తొలిమాట

ఈ సంచికతో రెండు సీరియల్స్ "మార్గ దర్శి", "ప్రయాణం" ఆఖరవుతున్నాయి.

వచ్చేసంచికలో కొత్త సీరియల్ "చదువు కున్న కమల" ప్రారంభిస్తున్నాము. రచయిత్రి శ్రీమతి ముప్పాళ రంగనాయకమ్మ.

సాంఘిక సమస్యలను తీసుకుని సహజత్వం ఉట్టిపడే ఇతివృత్తాలతో, సన్నివేశాలతో, సజీవ పాత్రలతో నవలలు రచించడంలో సిద్ధహస్తురాలైన శ్రీమతి రంగనాయకమ్మగారి రచనా నైపుణ్యానికి ఈ నవల మరొక మచ్చుతునక.

సమష్టిగా నివసించే ప్రతి మధ్య తరగతి కుటుంబం ఎదుర్కొనే సమస్యలను ఈ నవలలో ఆమె చిత్రించిన విధానం, అడుగడుగున ఆసక్తిదాయకమైన కథా సంవిధానం మా పాఠకులను అలరించగలవనే ఆశిస్తున్నాము.

వేమూరి రాధాకృష్ణ.


క్రొత్త మర్ఫీ
సూపర్ టోన్
8 బ్యాండ్లు
మోడెల్ టి ఎ 0826
మెయిన్సు టేబుల్ మోడెల్ టి ఎ 0926
ఆల్‌వేవ్ • 8 బ్యాండ్ • 7 వాల్వ్ (11 ఫంక్షన్సు) • హై ఫ్రి పవి
తనముపకు • రెండు లౌడ్ స్పీకర్లు • మూడు విధాల నొక్కు
బొత్తాముతో టోన్ కంట్రోల్ పికప్ జైటి స్పీకరు మరియు టేప్
రికార్డరులకు షాకెట్లు వాల్‌నట్ క్యాబినెట్
రు 668 50 ఎక్సైజ్ సుంకముతో మాత్రమే కలిసి
అమ్మకపు పన్ను మరియు ఇతర స్థానిక పన్నులు అదనము
భారత దేశమంతటాధర (మహారాష్ట్ర తప్ప)
murphy radio
మర్ఫీ రేడియో మీ గృహానికి ఆనందాన్నిస్తుంది'
NAS 6309b A

సచిత్ర మాసపత్రిక

బకింగ్‌హామ్‌పేట పోస్టు, విజయవాడ-2

విడిప్రతి వెల: 75 పైసలు — ఏడాది చందా: 9 రూపాయలు

సంపుటి 3 డిసెంబరు 1965 సంచిక 12

లోపల...

ముఖచిత్రం: "పల్నాటి యుద్ధం"లో తారాగణం


మేనేజింగ్ ఎడిటరు: వి. వి. రాఘవయ్య

ఆర్ట్ ఎడిటర్: బాపు

సంపాదక వర్గం.

నండూరి రామమోహనరావు, ముళ్ళపూడి వెంకటరమణ,

వి. ఎ. కె. రంగారావు, రావి కొండలరావు.


తలనొప్పి
జలుబు
దగ్గు
జామా
నివారిస్తుంది
తలనొప్పి, దగ్గు, జలుబు ఎక్కడ
వుంటే అక్కడ జామా రబ్ రుద్దండి వెంటనే
మీకు ఉపశమనం కలుగుతుంది మెంథాల్,
ఉపశమనం చేకూర్చే తదితర ఔషధులు కలిగి
వున్నందున జామా వెంటనే పనిచేస్తుంది
వొంటినొప్పులకుకూడా జామా రబ్ తగ్గిస్తుంది
జలుబువేసి ముక్కు దిబ్బడి వేసినపుడు
గుణమిచ్చి ఉచ్ఛ్వాసల
ఏలుగా సడలిస్తుంది
లక్ష్మీ మార్కు జామా
ఉత్పత్తిదారులే
అమర్‌చంద్
93, నైనప్పనాయక్ వీధి
ZAMA RUB
PAIN BALM
ZAMA RUB
FOR HEADACHE COLDS COUGHS NEURALGIA SWELLINGS SPRAINS AND CUTS
ZAMA
EP AM 7

ఉత్తరాయణం

మీ పత్రిక 'జ్యోతి' లో చలం గారినిగురించి వ్రాసిన వ్యాసం నాకు నచ్చింది.

ఒక తరం వెనక పుట్టిన మేము ప్రత్యక్షంగా ఆయన సెక్సు ఉద్యమంలో పాల్గొనకపోయినా, వారి పుస్తకాలవల్ల వో కాలంలోని పరిస్థితుల నాకళించుకున్నాం.

ఏదో ప్రత్యేకత లేనిదే మనిషి ప్రపంచంచేత గుర్తించబడడు అలాగే శ్రీ చలం ఏదో ఒక ఆవేశంలో అలా రాసుకుపోతే, వారి పుస్తకాల వేడిలో కొంతమంది కరిగి ఆయన కాలిజాడలలో ప్రవాహమయ్యారు.

ఇప్పుడుకూడా ఆయన విస్తరించిన విషయాన్ని వీరు సత్యాలనే భావించి మిగిలన వారిని కూడా నమ్మింపజూస్తున్నారు. పైగా 'చలం నిత్య సత్యాన్వేషి' అంటారు.

వ్యాస రచయితకు నా థాంక్స్.

ఎం. వి. ఎస్. పేరిశాస్త్రి
మొగల్తూర్

చలంగారు ఈశ్వరుడిని సెక్సులో అన్వేషించినా అది ఆయన వ్యక్తిగత ఆనంద మార్గం. అదే అందరిజీవితంలో కొంత భాగాన్ని అయినా పాలించేది; తన జీవితంలో అనుభవించినవాటిని - - ఊహించిన వాటిని నిజాయితీగా రచనలలో రూపకల్పన చేసి మనిషిలో సెక్సు పట్లవున్న కుత్సితభావాన్ని దూరంచేసి దానికికూడా ఆయన పవిత్రస్థానాన్ని కలుగజేశారు, అంతేగాని సెక్సుకు పట్టాభిషేకం కట్టలేదు. ఇక చలం సామాన్యుల ఈతిబాధలను, అనేక సమస్యలను స్పృశించ లేదంటే ఆయన పొరపాటుకాదు. ఆయన సామాన్యులలో వుండే వ్యక్తి రాగ ద్వేషాలకు ఇచ్చినంత ప్రాముఖ్యత దేనికీ ఇవ్వలేదు.

ఆయన సెక్సు స్వాతంత్ర్యోద్యమం ద్వారానే స్త్రీ స్వాతంత్ర్యోద్యమంలో తుఫాను లేవదీశారు. దానిని పురుషలోకం అనే మనుషుల లోకం భరించలేక ఏడ్చి కుళ్ళిపోయింది. స్త్రీని ఎన్నో సాకుల ద్వారా తమకు తృప్తినిచ్చే సాధనంగా మాత్రమే చూసుకునే పురుషులు, ఆ సాధనాలుగానే బ్రతికి సురక్షితంగా జీవించదలచే స్త్రీలు ఆ తుఫానుకు తట్టుకోలేకపోయారు.

చలం ఆంధ్రదేశంపై ఆగ్రహించి అరుణాచలం వెళ్ళిపోలేదు కాని తన వ్యక్తిగత జిజ్ఞాసాన్వేషణకి మాత్రమే వెళ్ళిపోయారు. అక్కడే అతీంద్రియ భావాన్ని అన్వేషిస్తున్నారు. ఆయన వ్యాసిపో ఆయనలోని మౌలిక ఆలోచనా విధానంలోనుంచి పుట్టుకొచ్చింది. కాని కనిస్సామాత్రులు అనుకోబడేవారి అహంకారం లాంటిది మాత్రం కాదు.

ఆయన కొందరి మనిష్యులలో గందరగోళాన్ని మిగిల్చాడు అనేది ఆ కొందరి మనస్తత్వాలనుబట్టి వుంటుందికాని, అది చలం అపరాధం మాత్రం కాదు ఆయన వ్యక్తి స్వతంత్రాలోచనకు ఇచ్చినంత అధికృత ఇంక దేనికి ఇవ్వ లేదనేది నిర్వివాదాంశం

నిఖిలేశ్వర్,
హైద్రాబాద్

దీపావళి 'జ్యోతి'లో మొదటి బహుమతిపొందిన చిన్న కథకంటే రెండవ బహుమతి పొందిన కథే బాగుంది శ్రీమతి భానుమతీ రామకృష్ణగారు వ్రాసిన 'అత్తగారు లంకెబిందెలు' చదవటానికి చాలా ఉషారుగా వుంది అందులో లంకెల బిందెలకోసం అత్తా కోడళ్ళు పడిన పాట్లు చదువుతుంటే నిజంగా జాలి వేసింది

జి. వి ఎస్ శెట్టి,
హనుమకొండ

దీపావళి 'జ్యోతి' సంచికలో కథలన్నీ చాలా వుత్తమ స్థాయిలో వున్నందుకు చాలా సంతోషం ప్రత్యేకించి, శ్రీ బాలగంగాధర తిలక్ గారి కథ 'దేవుణ్ణి చూసిన వాడు' చాలా అద్భుతంగా, విలక్షణంగా వుంది కథలో, బాహ్యంగా గవరయ్యలో క్రౌర్యాన్ని, అసహ్యాన్ని కనుపింపజేస్తూ, అతని అంతర్యంలో మంచితనాన్ని, హృదయ వైశాల్యాన్ని చూపించడం చాలా ఆకర్షణీయంగా వుంది. ఇటువంటి అమూల్యమైన కథలు ప్రచురిస్తున్నందుకు మీకూ, రాస్తున్నందుకు శ్రీ తిలక్ గారివంటి రచయితలకూ, నా అభినందనలు

సుశీ, కాకినాడ.

దీపావళి సంచికలో 'పెద్దమనిషి' చిన్న చిన్న కథ చాలా బావుంది. రచయిత శ్రీ రాఘవేంద్రరావుగారికి నా అభినందనలు మీకు ఈ పోటీకి వచ్చిన కథల్లో బహుమానార్హమైన మూడవ కథ లభించలేదంటే చాలా ఆశ్చర్యంగా వుంది! ఏమైనా రెండు ముక్కల్లో చెప్పాలంటే 'మీ ప్రయత్నం విజయవంతమైంది'. పోటీ నిబంధనలు, ముఖ్యంగా కథ సైజువిషయంలో అంత 'రిజిడ్'గా వ్యవహరించటం మంచిది కాదేమో ఆలోచించండి!

వక్కలంక రామారావు
అమలాపురం

అబ్బూరి ఛాయాదేవిగారి పెద్ద కథ 'ప్రయాణం' నేను చదువుతున్నాను నిజం నిర్మొహమాటంగా చెప్పాలంటే, 'జ్యోతి'లో ప్రచురింప బడదగిన స్థాయి ఆ కథకు లేదనే చెప్పాలి కథలో, సంభాషణల్లో ఏ మాత్రం నూతనత్వం లేదు కాగా అక్టోబరు సంచికలో శృంగారాన్ని మరీ పచ్చిగా రాశారు

వి శివాజీ, వరంగల్.

రాజకీయ వాతావరణం

ఈ సంవత్సరం దేశంలో ఆహార పరిస్థితిలో 'గ్రేట్ షార్ట్ ఫాల్...' కాకపోతే, 'కన్సిడరబుల్ షార్ట్‌ఫాల్ ...' ఆ మాట వద్దనుకుంటే 'అప్రీషియబుల్ షార్టు ఫాల్ ...' చివరకు, ఈ మాట కూడా వద్దనుకుని, 'షార్టు ఫాల్' మాత్రమే యేర్పడిందని వ్రాతమూలకంగా అంగీకరించుకున్నారుట: మొన్న ఢిల్లీలో జరిగిన ముఖ్యమంత్రుల సమావేశంలో పెద్దలు—

ఎక్కడైనా ఆకలిచావులు సంభవిస్తే వాటిని అంత 'పచ్చిగా' పత్రికల్లో ప్రకటించవద్దని నయానే నచ్చచెబుతున్నారు.

ఆహారధాన్యాల కొరత కలలో కనిపించి పీడిస్తున్న పెనుపిశాచం — దానికితోడు విజయవంతంగా రేషనింగ్ యెలా అమలుపరచాలా అనేది మరో సమస్య. అందుకే దానిని అమలుపరచటాన్ని కాస్త ఆగి పరిశీలిద్దాం అంటున్నారు ముఖ్యమంత్రులు. కాని, కేంద్రమంత్రి శ్రీ సుబ్రహ్మణ్యంగారు మాత్రం అందుకు ససేమిరా ఒప్పుకోటలేదు.

సోమవారాలు ఒక్కపొద్దు ఉండమని ప్రధాని శాస్త్రిగారు ఉద్బోధిస్తుంటే, వెంకటేశ్వరునికి ప్రీతి శనివారం, మనం శనివారాలలో ఒక్కపొద్దుందాం అంటున్నారు రాష్ట్ర ముఖ్యమంత్రి కాసు బ్రహ్మానందరెడ్డిగారు.

ఆహారాన్ని పొదుపు చెయ్యటానికి రాష్ట్రప్రభుత్వం 'గెస్టు కంట్రోల్ ఆర్డరు'ను జారీచేసింది. హొటళ్ళలో పెట్టే భోజనంలో పదార్థాలు తగ్గించమని కూడా ఇందుమూలంగా ఆదేశించారు. హొటళ్ళ యజమానులు 'మహబాగు' అనుకున్నారు. రెండుకూరల బదులు ఒకటే కూర చేస్తున్నారు. రాత్రివేళ పూరీలు వెయ్యటం మానేస్తున్నారు అల్లాగే 'కూటు' కూడా 'కట్' చేశారు...

—కాని భోజనం రేటు 'కట్' చెయ్యలేదు. శుభ్రంగా రూపాయపావలా పుచ్చుకుంటున్నారు. హొటళ్ళకెళ్ళే 'పాటురాయుళ్ళు' తెల్లమొగాలు వేసి ఒకరివంక ఒకరు

చూస్తుంటున్నారు. నిరాహార దీక్ష చెయ్యటానికి వాళ్ళకు ఓపిక లేదు వాళ్ళు 'ప్రొఫెషనల్ సత్యాగ్రహులు' కాదు. పైగా ఇది 'ఎమర్జెన్సీ'—రక్షణ నిబంధనల క్రింద వాటిని యేదైనా చెయ్యనివ్వు.

హైదరాబాదులో నక్షత్రకులందరూ కలిసి రక్షణకృషికి తీవ్రంగా తోడ్పడాలని తీర్మానించుకున్నారు. నిధిని పోగుచెయ్యటం బంగారాన్ని రక్షణ బాండ్లలో మదుపు పెట్టటం, వగైరా వగైరా పనులు వెంటనే చేస్తామని ప్రకటించారు. ధరలను స్థిరీకరిస్తామని హామీ యిచ్చారు కూడా. అక్షరాలా అపనే చేశారు. అప్పటికే భారీగా పెరిగిపోయిన ధరలన్నీ బెత్తెడు పైకి గానీ, క్రిందికి గానీ జరగకుండా వున్నచోటే స్థిరంగా నిలబడ్డాయి. తథాస్తు దేవతలు కూడా 'తథాస్తు' అన్నారు

అందరికీ సంఘాలు, సమాఖ్యలు వున్నాయి—బాగా రక్షణకృషి చేస్తున్నారు, చేసుకుంటున్నారు. (స్వరక్షణ? పరరక్షణ? అనేది మీరు అడగరాదు, నేను చెప్పరాదు)—

ఏ సంఘాలు, యే సమాఖ్యల లోనూ కలవలేని నాలాంటి, మీలాంటి 'సామాన్యులు' యేదీ చేసేది లేక, పత్రికాముఖంగా కనిపిస్తున్న బృహత్తర కృషి'ని, 'చూసి ఆనందిస్తున్నారు.' పరేంగి కాపలాదార్లైన పెద్దలు పదవులలో కూర్చుని, ఈ సామాన్యులమనుల వినకుండానే

వినకుండా గ్రహిస్తున్నారు గ్రహించవది సరైనది కాకంటే అగ్రహిస్తున్నారు. అటువంటప్పుడు యేమీ కాదనలేక అవుననటానికి మనసొప్పక, సంఘబలం లేని సామాన్యులు 'కిమిన్నాస్తి' అని కూలబడుతున్నారు.

పాపలా అమ్మే వస్తువు నాలుగేడు పావలాలు పెడితేనే గాని దొరకటంలేదు. ఆ పదమొక్కల వాడైన వెంకటరమణునికి కూడా 'నిలువుదోపిడీ' ఇవ్వటం కొందరు మానేస్తున్నారేమో గాని, పచారీ కొట్టు పెద్దమనిషి చేసే 'యేదోపిడీ' కైనా సరే అందరు సిద్ధపడుతున్నారు.

అర్ధణా తోటకూర బేడాఅర్ధణామ్మటానికి, పాకిస్తాన్‌లో మనయుద్ధానికి యేమిటో సంబంధం మనం చెప్పలేం కాని, పచారీకొట్టు పాపయ్య, కూరలమ్మే నూకాలమ్మా, పద్దులమ్మ, మరిడమ్మ... ఈ 'గ్రామదేవతలందరూ' మనకు బాగా నచ్చచెబుతారు.

ఈ సంవత్సరం దేశంలో 30 లక్షల టన్నుల ఆహారధాన్యాల కొరత వుంటుందని అధికార్ల అంచనా.

—అయితే, ఇహ ముందుండే దంతా ముసళ్ళపండగే...

రక్షణకృషి నిజంగానే చాలా ముందిని రక్షించింది.

—పైన చెప్పిన 'గ్రామ దేవతలకు మరింత సంబరం మరి

రేషనింగ్ వస్తోంది, కంట్రోల్స్ వచ్చాయి, వస్తున్నాయి — సర్వం పర్మిట్లగుండా సాగిపోతుంది. 'పాలకుండల్లాంటి' ఉద్యోగాలను అంటిపెట్టుకున్న పాలనాధికార్లకు చేతినిండా పుష్కలంగా డబ్బు ..

'వెధవది; యేం లాభం; యెంత డబ్బు సంపాదిస్తే మాత్రం ఏం ప్రయోజనం: డబ్బుకు విలువ లేకుండా పోతోంది. యెంత ఖర్చు పెట్టినా సుఖం దక్కకుండా పోతోంది. కనీసం ఇల్లు కట్టి పడేద్దామన్నా సిమెంటు ఇనుమూ మండిపోతున్నాయి'! ఏం చెయ్యాలో తెలియకుండా వుందనేది ఒళ్లక్రింద చెయ్యి జాపే పాలనాధికార్ల 'వింతబాధ'.

ఈనాటి సామాజిక జీవితం సామాన్యునికి 'పరమపదసోపాన పటం'లో ప్రయాణంలాగా పరిణమించింది.

'ముగ్గులో' నిలదొక్కుకున్న ప్రధాని లాల్‌బహదూర్

ప్రధాని నెహ్రూ కలలోనైనా ఆశించనంత ప్రజాదరణ శ్రీ లాల్ బహదూర్ శాస్త్రి పొందారని ప్రజాసోషలిస్టు నాయకుడు శ్రీ యన్. యన్. ద్వివేది అభిప్రాయం.

నిజంగానే ప్రధాని శాస్త్రి భారత ప్రజల హృదయాల్లో ప్రధానిగా స్థిరపడిపోయారు.

సెప్టెంబరు యుద్ధం శాస్త్రిగారి నాయకత్వానికి ఒక వింత వన్నెను అందించింది. విచిత్రమైన ఉపజ్ఞను వ్యక్తంచేసి, ఆ ఉపజ్ఞకు తగిన నిర్ణయాలను, తక్షణం తీసుకుంటూ, తొణకకుండా బెణకకుండా, పరీక్షా సమయంలో జాతిని నిలబెట్టిన కీర్తి ప్రధాని శాస్త్రికి లభించింది.

స్వపక్ష పరపక్షాలనే విచక్షణ లేకుండా రాజకీయ నాయకులందరినీ యుద్ధ సమయంలో శ్రీ శాస్త్రి సంప్రదించేవారు.

మెత్తగా వినిపించే మాట; మెత్తగా కనిపించే మనిషి: మెత్తగా 'కీలెరిగి వాత' పెట్టే మనస్తత్వం ఆయనది.

—అయితే యేం, ప్రధానిగా శాస్త్రిలో ఒక విలక్షణత ద్యోతకమైంది. దేశం యెదుర్కొన్న క్లిష్ట పరిస్థితిలో ఆ లక్షణం రాణించి, ఆయన వ్యక్తిత్వానికి ఒక విశిష్ట శోభను సంతరించింది.

ప్రతివారినీ ఆయన గౌరవిస్తారు. అందరిమాట ఆయన వింటున్నట్లే అనిపిస్తారు. అందరికీ ఆయన అందుబాటులో వున్నట్లే అనిపిస్తారు.

కాని, ఆయన యెవరి మాట వినరు, యెవరికీ అందుబాటులో వుండరు. తనది తనమాటే.

నెల్లున లోపోతూ వేగాన్ని పెంచుకుంటారు. నేర్పుగా కార్యసాధన సాగిస్తారు.

అత్యున్నత స్థాయిలో ఈ మధ్య ఆయన తీసుకున్న నిర్ణయాలు ప్రతిపక్ష నాయకులను కూడా సంప్రదించి తీసుకున్నారు. కొన్ని కొన్ని సందర్భాలలో స్వపక్షం వారికంటె

ముఖ్యంగా పరిపక్షాలను సంప్రదించి వారు.

—ఇది ఒక వింతగా దునుదగాన్ని వ్యక్తంచేస్తుంది! అయినను, ఆయన వెల్తురులో వేగాన్ని పెంచుకున్నారు, వ్యక్తిత్వాన్ని పెంచుకున్నారు, ప్రజాదరణ ఆయనను వరించింది.

ఇది చాలామంది కాంగ్రెస్ ముఠానాయకులకు కష్టం కలిగించింది. అయినా, అందరితోనూ మాట్లాడగల వ్యక్తి ఆయనొక్కడే అవటంవల్ల శ్రీ శాస్త్రిని కాదనలేక పోతున్నారు.

'ముగ్గు'లో నిల ద్రొక్కుకున్న వ్యక్తి శ్రీ లాల్‌బహదూర్.

ఇప్పుడు ఆయనకు కొత్త వాల్ యెదురైంది.

యుద్ధంలో విజయాన్ని సాధించారు. దౌత్యరంగంలో కూడా విజయాన్నే సాధించారు. కాశ్మీర్ సమస్యను శ్రద్ధా తాత్పర్యంతో చర్చించబోతుంటే, అందుకు అసమ్మతి తెల్పుతూ భారత ప్రతినిధివర్గం సమితిని 'వాకౌట్' చెయ్యటం— నిజంగా దౌత్యనీతిలో అమోఘమైన ప్రయోగం. జాతి స్థైర్యాన్ని ప్రదీపింపచేసింది. పాశ్చాత్యులకు అదొక చెంపపెట్టు.

ఆర్థికంగా దేశాన్ని స్వయం సన్నద్ధం చెయ్యటం ఆయనెదుర్కొంటున్న కొత్త సవాల్. యుద్ధంకంటె, దౌత్యంలో సాగే ప్రచ్ఛన్న యుద్ధంకంటే కూడా, ఇది జటిలమైన సమస్య.

౫౦, ౦౦౦ కోట్ల రూపాయలు ఖర్చుపెట్టుకోవాలని నాలుగవ ప్రణాళికను తయారు చేసుకున్నాం. పాకిస్తాన్‌తో యుద్ధం రక్షణావసరాలను పెంచింది.

ఆర్థిక సహాయం ద్వారా బ్రిటన్, అమెరికాలు భారతదేశ మీద రాజకీయపు వత్తిడి తీసుకు రావటంతో రాబోయే వారి సహాయం మీద మనకు నమ్మకం కలుగలేదు.

దేశం ఇప్పుడు స్వశక్తిమీద ప్రణాళికలు సాగించాలి. స్వశక్తి మీద ప్రజలలో నమ్మకం కలిగించాలి స్వదేశీఉద్యమాన్ని మళ్ళీ లేవతీశారు ప్రధాని శాస్త్రి.

ఈ పరీక్షలో ఆయన నెగ్గాలి. దేశాన్ని ప్రజలను నెగ్గేటుగా చెయ్యాలి.

'జై జవాన్! జై కిసాన్' శ్రీ శాస్త్రి లేవతీసిన కొత్త నినాదం.

పెను నిద్దుర వదలి పోవాల్సిన తరుణం ఆసన్నమైంది.

బాపు గాంధీ దేశాన్ని నడిపించి వట్టిగొంచి నూతనత్వాలను యేరినట్లే శాస్త్రిగారుకూడా కొత్త నినాదాలతో కొత్త తేజాన్ని ప్రజ్వరిల్ల చెయ్యటానికి ప్రతిన పట్టారు.

తాను నాయకుడుగా కాకుండా ప్రజలనే నాయకులుగా మార్చి వెనుకగావుండి నడిపించే మహా యత్నం ...

మహోజ్జ్వలంగా మళ్ళీ సంపూర్ణ దేశభక్తితో స్వదేశీ వుద్యమం పునః వేసుకోవాలని ఆకాంక్ష.

రామాయణంలో పిడకల వేట

దేశం ఈనాడు యెదుర్కొంటున్న గడ్డుసమస్యలమధ్య "మా ఊళ్లో విశాఖపట్టణంలో ఉక్కు కర్మాగారం పెట్టేమాట యేమిటూరు" అని అడగటం సాధారణంగా బయటి వాళ్ళకు "రామాయణంలో పిడకల వేటగా" అనిపిస్తుంది.

కాని, మనకు మాత్రం దాని విషయం ఇప్పుడు తేల్చకపోతే, కలిగినవాడు గాదెకెక్కిస్తే లేనివాడిపని యేదో అయినట్లు అవుతుంది.

కృష్ణాడెల్టాలో రెండవ పంటకు తుంగభద్ర నీళ్ళు మైసూరుప్రభుత్వం ఇవ్వకపోతుంటే, కేంద్రంతో మొర పెట్టుకోవటం, ఆంధ్రరాష్ట్రాన్ని పారిశ్రామికంగా పటిష్ఠం చెయ్యటానికి ఇంతవరకు యెటువంటి గట్టి చర్యలు తీసుకోలేదు కాబట్టి విశాఖ పట్టణంలో 'స్టీల్ ప్లాంట్' అయినా పెట్టమనటం సంకుచిత భావం యెలా అవుతుందో మనకు తెలియదు...

అయినా విశాఖపట్టణంలో ఐదవ స్టీల్ ప్లాంట్ నెలకొల్పేందుకు ఆంగ్లో - అమెరికన్ నిపుణుల బృందం సూచనలు చేసి చాలాకాలమైనా, ఆ విషయంలో కేంద్రం ఇంకా నిర్ణయం తీసుకోకపోవటం; ఈ జాప్యంవల్ల ఆంధ్రులకు అసలు ఈ కర్మాగారం దక్కకుండానే పోతుందేమోననే భయంకూడా ఉత్పన్నమవుతోంది.

విశాఖపట్టణంలో స్టీల్ప్లాంట్ను యేర్పాటు చెయ్యటంగురించి ఆంగ్లో-అమెరికన్ నిపుణుల బృందం చేసిన సూచనలలో యెట్టిమార్పుకు కేంద్ర ఉక్కుమంత్రి శ్రీ సంజీవరెడ్డి ఒప్పుకోటంలేదని తెలియవస్తోంది. విశాఖ పట్టణంలో ఉక్కు ఫ్యాక్టరీని నెలకొల్పటం అనే సమస్య తమ ప్రతిష్ఠతో ముడిపడ్డదిగా ఆయన భావిస్తున్నారుట. కథ అడ్డం తిరిగినట్లయితే తమ పదవికి రాజీనామా ఇవ్వటానికికూడా ఆయన సిద్ధంగా వున్నారుట.

కాని ఢిల్లీలో రాజకీయ వాతావరణంలో అనుకోని మార్పులు ఆయనకు యెదురైనాయి.

వేషాల్లో మార్పు, రంగంలో మార్పు, యెత్తుగడల్లోకూడా మార్పులకు దారి తీస్తున్నాయి.

రాజకీయంగా శ్రీ సంజీవరెడ్డి గారి కొత్తయెత్తుగడ యెలా వుంటుందో రాష్ట్రంలో యే యే సంఘటనలకు దారి తీస్తుందో, ఇదమిత్థంగా ఇంకా సూచి పడటల్లేదు.

రాష్ట్రరాజకీయ నాటకరంగం మీద సూత్రధారుడు ఇంకా ప్రవేశించలేదు.

వేషధారులు గాత్రధారులు మాత్రం నిండుగా ముస్తాబవుతున్నారు, రాజకీయంగా రాష్ట్రంలో.

పానుగంటివారి జంఘాలశాస్త్రికి మాత్రం, అది తోలుబొమ్మలాటకు చేస్తున్న యత్నమో, సారంగధర నాటకానికి సాగుతున్న యత్నమో ఇంకా సరిగ్గా బోధపడటల్లేదు.

—అనంతం.

□□□


సౌందర్య పోషణకు
Remy
రెమీ
పౌడర్



మతంలేని మనిషి (3)

గోపరాజు రామచంద్రరావుగారిని వ్యక్తిగా గౌరవించకుండా వుండడం కష్టం. ఆయన స్థిర విశ్వాసాలకు, స్థిరతరమైన ఆచరణకు జోహారనకుండా వుండడం మరీ కష్టం. ఎటొచ్చీ, ఆయన ఆరు నెలలకో, ఏడాదికో ఒకసారి లేవదీసే చిన్న సైజు ఉద్యమాలతో, సత్యాగ్రహాలతోనే ఇబ్బంది.

గోరాగారు దేవుడిని అబద్ధంకింద కొట్టి వేయడంలో విశేషమేమీ లేకపోవచ్చు. ఆస్తిక మతంతో పాటు నాస్తికత్వం కూడా చిర కాలంగా వున్నదే. క్రీస్తుకు ఆరు వందల ఏళ్ళ క్రిందటే డెమొక్రిటస్, ఆ తరవాత మూడు వందల ఏళ్ళకు ఎపిక్యూరస్ అనే గ్రీకు తత్త్వవేత్తలు అణువులను మించిన అంతిమ సత్యం లేదన్నారు. మన దేశంలో కూడా చార్వాక మతం చరిత్ర ప్రసిద్ధమైంది. కణాదుడనే మహర్షి అవసాన సమయంలో కూడా "పీలవః పీలవః పీలవః" (యాటమ్స్ యాటమ్స్ యాటమ్స్) అంటూ మరణించాడని చెబుతారు. ఇక ఆధునిక కాలంలో యూరపియన్ తత్త్వవేత్తలు చాలామంది దేవుడితో నిమిత్తం లేకుండానే తమ సిద్ధాంత సౌధాలను నిర్మించారు. వారిలాగ గోరాగారు తాత్త్వికులు కాకపోవచ్చుగాని, శాస్త్రీయ దృక్పథం కలిగినవారే

విశ్వాసాలుండడం వేరు, వాటిని ఆచరించడం వేరు. దేవుని మీద, మహిమల మీద, మొక్కుబడుల మీద నమ్మకం, కులభేదాలు బాహాటంగా ఫ్యాషన్లుగా చెలామణీ అవుతున్న నేటి సమాజంలో వాటిని

గోరాగారు ధైర్యంగా, ఒంటరిగా నిలిచి ఖండించడం, తన నమ్మకాల ప్రకారం నడుచుకోవడం సామాన్య విషయం కాదు.

అయితే, గోరాగారు నాస్తిక ప్రచారం పైనో, సాంఘికంగా కుల భేదాల నిర్మూలనవంటి సంస్కరణల పైనో తమ శక్తియుక్తులను కేంద్రీకరించివుంటే, ప్రజలలో క్రమంగా భావ పరిణామం తీసుకురావడానికి యత్నించివుంటే ఇంకా ఎక్కువ ఫలితాలు సాధించేవారేమో. అలా కాక, ఆయన రాజకీయాలతో కూడా దాగుడుమూతలాడడం జరిగింది. ఒకసారి సర్వోదయం, మరొకసారి పార్టీ రహిత ప్రజాస్వామ్యం, మరొకసారి మంత్రుల ఆడంబరాల పట్ల వ్యతిరేకత, ఈ మధ్య [illegible]గాయల ఉద్యమం—ఇలాగ ఆయన రకరకాల జెండాలను ఝళిపించారు. తమవైపు, తమ ఉద్యమాల వైపు ప్రజలదృష్టిని ఆకర్షించడం కోసం చిత్రమైన నినాదాలు, అంతకంటె విచిత్రమైన సత్యాగ్రహాలు చేశారు. ఏ కొత్త నినాదం తీసుకున్నా, అదొక్కటే మానవజాతి రుగ్మతలన్నిటికి తారకమంత్రం అన్నంత విశ్వాసంతో, ప్రపంచాన్ని సమూలంగా మరుక్షణంలో మార్చివేయాలన్నంత ఆవేశంతో ఆరంభిస్తారు. ప్రజలను మానసికంగా సిద్ధం చేయకుండా, రాజకీయంగా సంఘటితం చేయకుండా, కేవలం వ్యక్తిగతమైన తమ ఆదర్శాన్ని ప్రదర్శించినంత మాత్రాన చైతన్యం కలిగించవచ్చుననే ఉత్సాహంతో సత్యాగ్రహాలు మొదలు పెడతారు, అంత నిరుత్సాహకరంగాను ముగిస్తారు. ప్రజలనుంచి ప్రతిధ్వని రాని ఏ ఉద్యమమైనా అంతేనేమో.

ఒకొక్క మహా పురుషుడు తన కార్యాచరణకు ఒకొక్క మార్గాన్ని వెదుక్కుంటాడు. గాంధీగారి ప్రతిభ సత్యాగ్రహంలోనే వ్యక్తమైంది. అర్జునుడి చేతిలో గాండీవం లాగ అది ఆయనకే లొంగిన మహాయుధమైంది. ఒకప్పుడు లక్షలాది ప్రజలను కార్యరంగానికి కదిలించిన సత్యాగ్రహం ఈ రోజున సర్వసామాన్యమై పోయి, విలువ కోల్పోవడానికి కారణం ఇదే. గోరాగారి వ్యక్తిత్వ ప్రతిభ మరొక మార్గాన వికసించివుంటే వారి సిద్ధాంతాలకింకా ఎక్కువ వ్యాప్తి వచ్చేదేమో.

ఏమైనా, ఒకందుకు మాత్రం మన మంత్రులు అదృష్టవంతులు. తమ పదవులు తమ తీర్థయాత్రల మీద నేఆధారపడిఉన్నాయని వారు విశ్వసిస్తారు. "మీరంతా నాస్తికులవుతారా, లేక సత్యాగ్రహం చేయమంటారా" అని గోరాగారింకా వారిని హెచ్చరించలేదు.

—సవ్యసాచి

000

"కాదేదీ కవిత కనర్హం"

కాట్ల కుక్కంటే చాలమందికి భయం. కసిరి కొట్టే ఆఫీసరన్నా చాలమందికి భయం. కాని... కాట్ల కుక్కలా కరిచేటట్టుగా మాట్లాడే ఆఫీసరంటే గుమాస్తాలకు మరీ భయం! ఆ బాపతు భయంతోనే పార్కులో ఒంటరిగా దిగులుగా కూర్చున్నాడు భగవాన్లు ఒక సంధ్య వేళ. జీవితంలో ఏ సమస్యా ఎరగని భగవాన్లుకి వాళ్ళ ఆఫీసరు ఒక సమస్య తెచ్చిపెట్టాడు. 'సమస్య తెచ్చిపెట్టాడూ'–అనేకంటే...'తనే ఒక సమస్య అయి భగవాన్లు నెత్తిమీద కూర్చున్నాడు' – అంటే వినటానికి మరీ బాగుంటుంది. కాని వినటానికి మనకి బాగున్నా– భగవాన్లుకి మాత్రం అలా కూర్చోవటం ఏ మాత్రం బాగోలేదు. చాల ఇబ్బందిగా ఉంది... మహా దుర్భరంగా కూడా ఉంది. కర్ణకఠోరంగా ఆఫీసరు పెట్టే చివాట్లు అతని చెవుల్లో ఇప్పటికీ హోరు పెడుతూనే ఉన్నాయి...

"ఏమిటోయ్! ఆఫీసుకింత లేటు? ఎన్నిసార్లు చెప్పాలి... బుద్ధి లేదూ? పంక్చ్యువాలిటీ మెయింటెయిన్ చెయ్యాలని తెలీదూ?... ఆఁ... బస్సు మిస్సయ్యిందా!... అయినా సరే, అదంతా నాకనవసరం. నువ్వుమాత్రం టైముకి వచ్చి తీరాలి. అంతే... రూలంటే... రూలే!" శుభోదయాన్నే పలికే చక్కటి శుభవచనాలు...

"ఎవడోయ్ నీకు ఇంగ్లీషు నేర్పింది?... ఛ... ఛ.. ఛ... అన్నీ స్పెల్లింగు మిస్టేకులే! చూసి వ్రాయటంలో కూడా ఖాతరే! ఉద్యోగం మానేసి ఇంటికిపోయి కాపీలు దిద్దుకోగూడదూ." పని చేస్తుండగా ఇచ్చే 'ఉచితసలహాలే?...'

భగవాన్లు బాధగా చెవులు మూసుకున్నాడు ఇవన్నీ ఒకనాటి స్టేట్ మెంట్లూ, కామెంట్లూ, కాంప్లిమెంట్లూ కాదు రోజూ రివాజుగా భగవానుమీద భగభగ మండి పడుతుండే వాళ్ళ ఆఫీసరుగారి వాక్బాణాలు...

భగవాన్లు దీనంగా, నిదానంగా నిట్టూర్పు విడిచాడు నిజానికి అంత బరువుగా నిట్టూర్పు విడిచేటటువంటి బరువైన సమస్యలు ఏవీ అతని జీవితంలో లేవు. ఉన్నంతలో... ఉన్న ఒక్కగానొక్క భార్యతో, చిన్న స్వంత యింట్లో ఏ చీకూ చింతా లేకుండానే కాలం గడుపుకొస్తున్నాడు భగవాన్లు; బి. ఏ. సాంసారికమైనటువంటి సమస్యలుగాని, పిల్లల బెడదగాని– ఇటువంటివేవీ అతనికి లేవు. పిల్లలు లేకపోతే ఒక కుక్క పిల్లనుకూడా

భగవాన్లు జీవితంలో, ఆఫీసరు మాత్రం తీరని సమస్యలా, మారని శాసనంలా తగులడ్డాడు.

భగవాన్లు ఒరాగ్గా, బుఱ్ఱ గోక్కున్నాడు. తన కూడా వచ్చిన పెంపుడు కుక్క 'జిమ్మి' పచ్చగడ్డిలో పడి దొర్లుతూ ఉంది. ఉన్నట్టుండి అది ఒక్కసారిగా ముందు కురికి పరుగు ప్రారంభించింది. ఏమీ అర్థంగాక భగవాన్లు కూడా 'జిమ్మీ' అంటూ అరుస్తూ దాని వెంట పడ్డాడు.

కొంత దూరంలో ఒక బొద్దు పాటి కుర్రాడు గెంతుతూ బంతితో ఆడుకుంటున్నాడు. ఆ బంతి నందు కోవటం కోసం 'జిమ్మి' ముందుకు పరిగెట్టింది. అది చూసి ఆ కుర్రాడు గబగబ ఆ బంతిని తీసుకుని దగ్గరనే ఉన్న సిమెంటు సోఫా దగ్గరకు పరి గెట్టుకు వెళ్ళాడు.

'డాడీ!...డాడీ!... కుక్క!... కుక్క!...' అంటూ ఆ సోఫాలో కూర్చున్న ఆసామి పొడుగుపాటి జేబులో చటుక్కున ఆ బంతిని పడ వేశాడు.

'జిమ్మి' చటుక్కున ఆ వ్యక్తి ఒళ్ళో కురికి మొఱుగుతూ బంతి కోసం ఆ వ్యక్తి కోటుజేబు పీకిపెస్తూ నానా హడావిడి చేయటం ప్రారం భించింది.

వెనకాల రొప్పుకుంటూ, పరిగె గెట్టుకుంటూ వస్తున్న భగవాన్లుకి ఈ దృశ్యం కంటపడగానే, ఒక్క భయంతో బిగుసుకు పోయింది...

బట్టతల.. పెద్దపొట్టి, బుద్ధి మీసాలు . బుల్ డాగ్ లా మొహం... ఆ వ్యక్తి ఎవరో కాదు... వాళ్ళ ఆఫీసరు!

ఇంతసేపు తన బుఱ్ఱలో ఒక సమస్య అయి కూర్చున్న వ్యక్తి, ప్రస్తుతానికి కళ్ళెదురుగుండా సోఫాలో కూర్చున్నాడు.

భగవాన్లు 'జిమ్మీ!', 'జిమ్మీ!-' అంటూ ఖంగారుగా ముందు కురికి గబగబ ఆఫీసరు ఒళ్ళో ఉన్న కుక్కను క్రిందికి లాగేశాడు ..

'వెరీ సారీ సార్ ... బొత్తిగా మేనర్స్ లేదు... ...వెధవ కుక్క, బంతులంటే తెగపిచ్చ' అని హడా విడిగా ఆయాస పడుతూ, క్షమా పణ కోరుకున్నాడు. కంఠం భయంతో వణికింది

ఆఫీసరు ఒక్కసారి కళ్ళు పెద్దవి చేసి, ఆశ్చర్యంగా భగవాన్లు వంక చూశాడు. భగవాన్లు బిక్కు బిక్కు మటూ చూశాడు ఆఫీసరు వంక.

'ఈజ్ ఇట్ యువర్ డాగ్?' అనడిగాడు ఆఫీసరు.

అవునన్నట్టు భయంగా తల వూపాడు భగవాన్లు బి. ఏ.

ఆఫీసరు మళ్ళీ కళ్ళు పెద్దవిచేసి ఆనందంగా కుక్క కేసి చూస్తూ 'వెరీ లౌలీ డాగ్ ... వెరీ బ్యూటిఫుల్ డాగ్ ' అన్నాడు.

భగవాన్లు ఉలిక్కి పడ్డాడు. కోపంతో 'ఫూల్ ..బ్రూట్ ...ఇది

"యట్ ..." అని తిట్టిపోసేస్తాడేమో ఆఫీసరు - సౌమ్యంగా కుక్కమీద చక్కటి కాంప్లిమెంటు వదిలేటప్పటికి, అంతవరకు భయపడుతున్న భగవాన్లు ఆపని మానివేసి, ఆశ్చర్యపడటం మొదలుపెట్టాడు.

ఆఫీసరు కుక్కకేసి హుషారుగా చూసి నోటితో ఈలవేశాడు... కుక్క తోకాడించింది. ఈసారి ఆఫీసరు చిటికె వేశాడు ... కుక్క ఆఫీసరు దగ్గరగా వెళ్ళి ఆయన కాలు నాకటం ప్రారంభించింది...

"ఒరేయ్ కిట్టూ! బిస్కట్లున్నాయిరా?" అనడిగాడు ఆయన పక్కనున్న బొద్దుపాటి కుఱ్ఱాడి నుద్దేశించి, "ఓ!" అంటూ ఆ కుఱ్ఱాడు గబగబ జేబులోని బిస్కెట్లు పెకెట్టు తీసి ఆఫీసరుకు అందించాడు ఆఫీసరు ఒక్కొక్క బిస్కెట్టే తీసి, ప్రేమగా దానినోటి కందిస్తూ, ఆప్యాయంగా దానిఒళ్ళు నిమరటం ప్రారంభించాడు. ఈ అనురాగం, ఆత్మీయత ఏమిటో భగవాన్లుకి అంతుబట్టలేదు. అమాయకంగా చూస్తూ అలా నిల్చుండిపోయాడు

"అరె అలా నిల్చుండిపోయావేమిటోయ్! కూర్చో .." అన్నాడు ఆఫీసరు ఆప్యాయంగా. భగవాన్లు క్రింద పచ్చగడ్డిలో చతికిల పడ్డాడు.

"నో! ... నో! ... అక్కడ కూర్చుంటా వేమిటోయ్! ఇలా సోఫాలో కూర్చో ..." అంటూ తన ప్రక్కన చోటు చూపించాడు. భగవాన్లు సందేహించాడు... ఆఫీసరు

ప్రథమ బహుమతి
(రూ. 50/-)
వి. రామజోగయ్య
[బి. ఎ రెండవ సంవత్సరం]
నర్సపూర్ కాలేజి,
నర్సపూర్,
పశ్చిమ గోదావరిజిల్లా.

ప్రక్క కూర్చోటానికి భయపడ్డాడు.

"అరె!... కమాన్ ... డోంట్ ఫీల్ షై" అంటూ రెట్టించాడు ఆఫీసరు.

భగవాన్లు భయం భయంగా, ఆయనకు కాస్త ఎడంగా ఒదిగి కూర్చున్నాడు ఆశ్చర్యపడుతూ... లేస్తూ...

తనని ఎప్పుడు చూసినా కుక్కలా కసిరికొట్టే ఈయన తన కుక్కను చూడగానే ఉన్నట్టుండి మారిపోయాడు. దానికి మనిషికన్నా ఎక్కువ గౌరవం ఇస్తున్నాడు. దానితోబాటు తనకుకూడా మనిషికివ్వవలసిన గౌరవం ఇస్తున్నాడు. ఏమిటో ఈ కథా... కమామీషూ! అంటూ ఆశ్చర్యపోవటం ప్రారంభించాడు భగవాన్లు.

కాని అసలు ఆఫీసరు ఇవన్నీ

గ్రహించే స్థితిలో లేడు. ఆయన కుక్క అందాన్ని తిలకించటంలో మునిగి పోయాడు. 'వెరీ బ్యూటిఫుల్ డాగ్ ... ఎక్కడ సంపాదించావోయ్ దీన్ని ?' అని చాల కుతూహలంగా ప్రశ్నించాడు.

'బెంగుళూరు నుంచి ఒక ఫ్రెండ్ తీసుకొచ్చి ఇచ్చాడండి' అన్నాడు భగవాన్లు.

ఆఫీసరు కుక్కని, దాని ఒంటి మీదున్న తెల్లటి, ఊలు లాంటి బొచ్చుని, కుచ్చులాంటి దాని తోకను చూస్తూ, స్పృశిస్తూ, పదే పదే దాని అందాన్ని పొగడటం ప్రారంభించాడు. అంతటితో ఊరుకోలేదు. కుక్కల గురించి, వాటి తెలివి తేటలు గురించి, వాటి ధైర్య సాహసాలు గురించి, వాటి విశ్వాసం గురించి ఏకధాటిగా ఉపన్యసించటం ప్రారంభించాడు.

భగవాన్లు అయోమయంగా వింటుండి పోయాడు హఠాత్తుగా ఆఫీసరు ముఖంలో విషాద చ్ఛాయలు అలముకున్నాయి ... గొంతు గాద్గదికంగా ధ్వనించడం ప్రారంభించింది.

'భగవాన్లూ! ఈ కుక్కను చూస్తుంటే మా టైగరు జ్ఞాపకమొస్తోందోయ్. ముమ్మూర్తులా ఇలాగే ఉండేది. పువ్వుల్లో పెట్టి దాన్ని పెంచానోయ్. ఎప్పుడూ నా కూడా తోకాడిస్తూ తిరుగుతుండేది; నా ప్రక్కనే పడుకుంటూ ఉండేది. నేను చేత్తో తినిపిస్తేనేగాని తినేది కాదు. ఎంతో ప్రాణంగా చూసుకున్నాను. అది కూడా నేనంటే ప్రాణం ఇచ్చి పడి చచ్చేది. అంత ముద్దుగా పెంచుకున్న ఆ కుక్క రెండు సంవత్సరాల క్రితం జబ్బుచేసి చచ్చిపోయిందోయ్!...' ఆయన కళ్ళల్లో నీళ్ళుతిరిగాయి. దుఃఖంతో గొంతు పూడిపోయి మాటరాలేదు.

భగవాన్లు మ్రాన్పడిపోయాడు. ఎప్పుడూ తనని తిట్టిపోస్తూ, కిరాతకుడుగా కనిపించే ఆఫీసరు వెనక, ఇంత 'విషాదగాధ' దాగిఉందన్న మాట అనుకున్నాడు. అందుకనే తన కుక్కమీద చూపించిన ప్రేమకు కారణంకూడా అర్థమయింది. వెంటనే మెరుపులా ఒక ఆలోచన కూడా వచ్చింది.

'సార్ ... పోనీ మీకు కావలిస్తే మా కుక్కను పెంచుకోండి. దాన్ని చూసుకుంటూ అయినా మీ 'టైగర్'లేని బాధను మరచిపోవచ్చు.'

ఆఫీసరు మొహం ఒక్కసారిగా వికసించింది.

"మరి పాపం నీకుకే బాల ఇంక్రిమెంట్సుగా పెంచుకుంటున్నావను కుంటాను." అనడిగాడు ఆనందాన్ని కప్పిపుచ్చుకుంటూ "అబ్బే! నాకు పెద్ద అంత ఇంక్రిమెంట్సు లేదండీ ఉంది కదా అని పెంచుకోవటం తప్ప ఇంక్రిమెంట్సుగా ఉంటే మీరు తప్పకుండా పెంచుకోండి." అన్నాడు.

ఆఫీసరు అయిసయిపోయాడు. ఉబ్బి తబ్బిబ్బయి పోయాడు భగవాన్లుని చాల మెచ్చుకున్నాడు- త్యాగమూర్తివన్నాడు, అదన్నాడు, ఇదన్నాడు-ఆఖరున మీ ఇల్లెక్కడ అనికూడా అడిగి, అతన్ని వాళ్ళ ఇంటిదగ్గర తన కార్లో దింపేసి, కుక్కను తనతోబాటు తీసుకుపోయాడు.

అంతే .

అది మొదలుకుని, ఆఫీసరు భగవాన్లుని లేటుగా వచ్చావే అని ఎప్పుడూ అడగలేదు ఆ మాటకొస్తే అసలు భగవాన్లు కూడా ఆఫీసుకి ఆలస్యంగా ఎప్పుడూ రాలేదు కారణం? దార్లోనే గనుక ఆఫీసరుగారు తన కార్లోనే భగవాన్లుని ఎక్కించుకుని రోజూ ఆఫీసుకు తీసుకు వచ్చేస్తున్నాడు చాల అభిమానంగా చూడటం ప్రారంభించాడు ఆఫీసులో అంద రెదురుగుండా- భగవాన్లుని గౌరవించ ప్రారంభించాడు అతన్ని చూసి మిగతా వాళ్ళు బుద్ధితెచ్చుకోవాలని కూడా అంటుండే వాడు

ఆర్నెల్లలో భగవాన్లుకి ప్రమోషను కూడా వచ్చింది!!

ఈ మార్పులన్నీ మిగతా గుమాస్తాలకు మతులు పోగొట్టేశాయి వాటన్నిటికి కారణాలు అంతు బట్టలేదు. ఒక బొచ్చుకుక్క ఈ కిలకానికి కారణం అని వారికి తెలీదు తెలిసినా వారు నమ్మలేరు కాని భగవాను, అతనితోబాటు పైనున్న భగవాన్లుకి కూడా తెలుసు! వీటన్నిటికి కారణం ఆ బొచ్చు కుక్కేనని.

ఒక్కొక్కసారి చాల చిన్న విషయాలే జీవితంలో పెద్ద పెద్ద మార్పులు తెస్తూ ఉంటాయి.

అందుకే అన్నాడు మహాకవి శ్రీ శ్రీ

"కుక్కపిల్ల,
అగ్గిపుల్ల
సబ్బుబిళ్ళ
కాదేదీ కవిత కనర్హం..."

అని.

□□□

సీతి

"బువ్వొండుకు కూసున్నానా. అడు రానేలేదు, ఇసుగు బాబూ ఈడితో" విసుక్కుంది సీతి

సీతి పనిచేసే చోటు. ఆరోజు కూతురు పుట్టినరోజు చేసుకున్న అమ్మగారు అర్ధరూపాయి డబ్బులు చేతిలోపెట్టి 'ఏమన్నా కొనుక్కోవే' అంది తాతను సంతోషపరుద్దామని గబగబా ఉరుకుపరుగులతో సరుకులు తెచ్చి వండుకుని కూర్చుంది.

'తాత ఎంతమంచోడు పిచ్చి తాత కాకపోతే తనను సొంత మనమరాల్లా చూసుకుంటాడు' గుడిసెలో ఉన్నంతసేపు 'బుల్లెమ్మోయ్ బుల్లెమ్మా బుల్లీ' అని ఒకటే కలవరించి పోతూవుంటాడు ఇన్నాళ్లు ఆడిమీద ఇంతఇది కలగ లేదుకానీ నిన్న ఆడో సంగతి సెప్పగానే. .

ఏ సంగతి అని మనసడిగిందానికి సీతి కొత్తపెళ్ళికూతుర్లా సిగ్గుపడింది 'నరసిమ్ములు నన్ను పెళ్ళాడతాడంట' సిగ్గుతో సంబరపడిపోతూ ముడుచుకున్న మల్లెమొగ్గే అయింది

'బలే అందంగా ఉంటాడు సినిమాలో నాగేస్రావులాగా' తలుచుకుని మరొక్కసారి ముచ్చటగా సిగ్గుపడింది సీతి.

రాత్తిరి. 'తాతా' అంటూవచ్చి 'పిల్లా తాతకు చుట్టంటియ్యాల నిప్పంటు ఇలా పడెయ్యి' అని తలుపుప్రక్క నిలబడి నన్ను సూత్తుంటే అప్ప ఎంతబాగున్నాడో.

అయినా ఈ తాత ఇంకా రాడేంది ఎపుడన్నా కల్లు పోయింతా నన్నాడేమో ఎన్నిసార్లు ఒద్దని సెప్పినా మాట ఇనడు 'చత్తావురా తాక్కు' అని సెబితే 'నీకేం తెలుసు బుల్లీ దాన్తో మజా సొరగలోకవుందే దాన్లో, అయినా నువ్వు నాకెక్కడ దొరికావుసెప్పు ఇను మరి ఇలాగే కల్లు దాగి బయటి కొత్తే బయటు కేర్ కేర్ మని ఏడుపినపడింది సూత్తే నువ్వు. ఏ యమ్మ కనిడిసి పెట్టిందో ఏ ఇంట్లో పెరగాల్సిన దానివో ఈడి దగ్గర బతుకుతుండావు' అంటే.

'తాతా ఆ మాటేగద అనొద్దన్నాది ఈ సారంటే ఉరేసుకు సత్తా' అంది సీతి.

ఆ మాటకి 'ఊరుకోయే బుల్లీ ఈ బతుక్కి నువ్వున్నావు నువ్వత్తె మానూ సావు -న్న మాటంటే నేను సచ్చినంతొట్టు' అని అక్కున చేర్చుకునే తాత.

తాతను తలచుకుని గతంలోకి పంగెత్తిన సీతి ఉడికన్నదిత్తే ఓయమ్మో అపశకునం అనుకుంది.

"పిల్లా, ఓ పిల్లా" ఎక్కడినుంచో పిలుపు.

ఇంకెవడు ఆ అంబోతుగాడే ఎల్లి ఎదవ

తలుపు మాంచి దూకుడుగా తీసి, "పిల్లా" చేతులు నులుముకుంటూ అన్నాడు

"ఏరా" అంది విసుగ్గా

"మీ తాత అడ పడిపోయాడు. ఎవరో పట్టుకొచ్చారు."

"ఏడ ఎల్లయ్యా" గాభరాగా వుంది సీతి గొంతు

"తాగి ఎవడితోనో దెబ్బలాడితే తన్ని తాటి తోపులో పడేశారాడ్ని. కలవరిత్తా వుండాడు నీ కోసం"

ఎనకా ముందూ చూడకుండా అడితోపరిగెత్తిందిసీతి పరిగెట్టిఅలిసి పోయి, "ఇంకేడ" అంది గాభరాగా ఏడుస్తూ

వెకిలి నవ్వు నవ్వుతూ "ఈ సరి కింటి కెల్లుంటాడులేయే" అన్నాడు ఎల్లయ్య.

"దొంగెదవా, ఎంత పన్జేశావురా" పారిపోబోతున్న సీతిని బలవంతంగా చేతుల మధ్య ఇరికించుకున్నాడు

"నీకు పున్నెం వుంటాదిరా, ఒదల్రా, నరిసిమ్ములుగాడికి పెద్దాన మయిపోనాన్రా నీకు దణ్ణ మెడతాన్రా నీ కాళ్ళుచ్చుకుంటాన్రా నీ తోడ బుట్టిందాన్లాంటి దాన్రా" దీనంగా చేతులు జోడించి ప్రార్థించింది.

ఫలితం . పచ్చ పువ్వంటి ఆ

ద్వితీయ బహుమతి

(రూ. 25/-)

ఎస్. జ్యోతి

[బి ఎస్ సి. మూడవ సంవత్సరం]

ఆర్ బి వి ఆర్ ఆర్ విమెన్సు కాలేజి, నారాయణగూడ, హైదరాబాదు.

వెన్నెల్లో ఎల్లయ్య చేసిన మోసానికి సీతి శీలం బలి అయిపోయింది

తను చెయ్యాల్సిన పని పూర్తి చేసుకుని బద్ధకంగా ఒళ్ళు విరుచుకుంటున్న ఎల్లయ్యను చూడగానే సీత మనస్సు ప్రతీకార జ్వాలతో బుసలు కొట్టింది.

"అమ్మో" అన్న అరుపు నురగలు క్రక్కుతూ ప్రాణులా పడిపోయిన ఎల్లయ్య ప్రక్కగా ప్రాకిపోతున్న త్రాచును చూడగానే సీతి మనసు ఆనందంతో గంతులు వేసింది సంతోషంతో గోలచేసింది కాని ఎవరో చేసిన పాపంలో తనూ పాలు పంచుకుందన్న విషయం గుర్తుకు రాగానే మనస్సు దిగులు పడింది. తల భూమివైపుకు క్రుంగిపోయింది. దృఢ నిశ్చయంతో అడుగు తీసుకుంటూ చెఱువు గట్టు కేసి నడిచింది

పోటీదార్లకు మనవి

"జ్యోతి" మాసపత్రిక నవంబరు సంచికనుంచి కళాశాలల విశ్వవిద్యాలయాల విద్యార్థినీ విద్యార్థుల నిమిత్తం "చిన్న చిన్న కథలపోటీ" నిర్వహిస్తున్నది దీనిలో పాల్గొనేవారు ఈ క్రింది నిబంధనలు పాటించ గోరుతున్నాము

1 కథలు జ్యోతి లో నాలుగు పేజీలకు మించరాదు

2 స్వకపోల కల్పిత మైన స్వతంత్ర రచనలే పంపించాలి

3 తమ పూర్తిపేరు చదువుతున్న తరగతి కాలేజీ లేక విశ్వవిద్యాలయం పేరుతో సహా పూర్తి చిరునామా జతపరచాలి

4 ప్రతినెల 1వ తేదీ వరకు అందిన రచనలనే ఆ పైనెల సంచికలో పోటీకి పరిగణిస్తాము

5 బహుమతి పొందని రచనలు తిప్పి పంపబడవు అందుచేత స్టాంపులు పంపించనవసరంలేదు రచనల విషయమై ఉత్తర ప్రత్యుత్తరాలు జరుపబడవు

6 కవరు మీద జ్యోతి చిన్న చిన్న కథల పోటీకి అని స్పష్టంగా వ్రాయాలి

7 రచనలను పంపవలసిన చిరునామా ఎడిటర్ జ్యోతి సచిత్ర మాసపత్రిక విజయవాడ-2

8 రూ 50/- ప్రథమ బహుమతి రూ 25/- చొప్పున రెండు ద్వితీయ బహుమతులు

"బుల్లీ, బుల్లెమ్మా బుల్లెమ్మోయ్" తాత పిలుపు దగ్గర్లో

తాతా అంటూ కౌగలించుకుంది చుట్టూ వాతావరణాన్ని ఎల్లిగాడి శవాన్ని సీతి ఏడుపునూ చూసిన తాత కంతా అర్థమయింది

తల్లీ అడింత మోసం చేస్తాడనుకోలేదు అని ఓదార్చి ఇంటికి తీసుకెళ్ళాడు

కొన్నాళ్ళకి

సీతిపెళ్ళి నిశ్చయమైంది కాని సీతిమనసులో ఆనందంలేదు నవ్వులేదు ఆ పెదవులమీద

అనుక్షణం గుర్తుకువచ్చి బాధిస్తూనేవుంది నాటి సంఘటన "నీకు కొత్తసీరట్టుకొచ్చా తల్లీ—" తాత మురిపెంగా చెప్పబోయాడు

తాత వైపు దీనంగా చూసింది సీతి

"బుల్లెమ్మా" తాతకేమిటో సందేహం ?

"నన్ను చమించు తాతా" చేతులు జోడించింది

గన్నేరుపప్పుతిన్న సీతిప్రాణం ఎగిరిపోతూ వుంది

"తాతా త త తాతా

ఆఖరిమాటలు గాలిలోనే కలిసిపోయినయి తాత ఆరవప్రాణం ఆరిపోయింది వెన్నెముక విరిగిపోయింది నోటమాటరాని తాత గోడకు చేరబడి శూన్యంలోకి చూస్తూ వుండిపోయాడు పిచ్చివాడిలా

□□□

విజేత

యద్దనపూడి సులోచనారాణి

[గత సంచిక తరువాయి]

సీరియల్

3

మాధవ్ వూరు చేరుకునేసరికి ఉదయం పది గంటలకి పైగా అయింది. తన కళ్ళని తనే నమ్మలేక పోయాడు. అంతగా మారిపోయింది వూరు. ఆత్రంగా వీధులుదాటి మలుపులు తిరిగి తన యింటి సందులో ప్రవేశించాడు. వెంటనే అతని కళ్ళు బైర్లు కమ్మినాయి. తను చూస్తున్నది కలో, నిజమో అర్థం కాలేదు అతని యిల్లు వుండవలసిన చోటు ఒక చిన్న ఎలిమెంటరీ పాఠశాల వుంది. పిల్లలు కూర్చుని బిగ్గరగ కంఠాలెత్తి పాఠాలు చదువుకుంటున్నారు. ముందు ఆవరణలో కొత్తగా లభించిన స్వాతంత్ర్యపు వాయువుల్ని గట్టిగా పీల్చుకుంటున్నట్టు త్రివర్ణ పతాకం గాలికి రెపరెపలాడుతూ యెగురుతోంది.

నిశ్చేష్టుడైన మాధవ్ యింకా అలాగే చూస్తూ నిలబడిపోయాడు. "ఎవరుబాబూ? యేం కావాలి మీకు?" జీప్ దిగి మాసిన దుస్తులతో, చెదిరిన జుట్టుతో చేష్టలుడిగి బొమ్మలా నిలబడిపోయిన మాధవ్ దగ్గరికి కర్ర వూతం చేసుకుంటూ నడిచివచ్చిన ఒక ముసలాయన అడిగాడు. ఆయనకి చూపు సరిగ్గా ఆనదులా వుంది. కళ్ళకి చెయ్యి అడ్డంపెట్టుకుని మరీ చూస్తున్నాడు.

వెనక్కు తిరిగి క్షణం సేపు ఆయన్ని

చూసిన మాధవ్ వెంటనే దగ్గరగా వెడుతూ 'ప్రకాశం బాబాయ్! నేను! నన్ను నువ్వే గుర్తుపట్టలేదా—' కంఠం బొంగురుపోవటంతో ఆగిపోయాడు.

మాధవ్‌ని విచిత్రంగా, పరీక్షగా చూసిన ఆయన వెంటనే చెయ్యి జాచి గట్టిగా పట్టుకుంటూ 'అరె! మధూ! నువ్వా? యెప్పుడూ రావటం?' అన్నాడు.

'ఇప్పుడే బాబాయ్! మా యిల్లు—' మళ్ళీ వెనక్కు తిరిగి చూస్తూ అన్నాడు.

'మా యింటికి పోదాం పద.' ఆశ్చర్యానందాలతో తడబడుతూ అన్నాడాయన.

'బాబాయ్! అమ్మా వాళ్ళు ...' వాక్యం పూర్తిచేయనే లేదు.

'ముందు యింటికి పద. అంతా చెప్తాను' అంటూ ఆయన తొందర చేశాడు.

4

'ఏమేవ్! కాంతం. నిన్నే. ఇలా రా చప్పున. ఎవరొచ్చారో చూడు' ఇంకా మాధవ్ చేతిని అలాగే పట్టుకుని లోపలికి తీసుకు వెడుతూ కేకపెట్టాడాయన.

'ఎవరూ? కూర్చోమనండి. వస్తున్నా. పొయిమీద కూర తగలడింది. మాడిపోతుంది.' లోపల నుంచి విసుగ్గా వచ్చింది సమాధానం.

'నీ మొహం. ముందు బైటికి రావే! రా! వచ్చి చూడు. ఎవరో తెలిస్తే నోరు తెరుస్తావు. వస్తున్నావా లేదా?—'

'అబ్బబ్బ! ఎవరో చెప్పకూడదూ? మీ తొందరా మీరూ—' చేస్తున్న పని వదిలి చేతులు తుడుచుకుంటూ బైటికి వస్తున్న ఆవిడ మాధవ్‌ని చూడగానే గుమ్మంలోనే ఆగిపోయింది.

'ఎవరో గుర్తు పట్టావుటే?—'

'మధూ!'

'పిన్నీ!' మాధవ్ దగ్గరగా వెళ్ళాడు.

'నువ్వు—నువ్వు చచ్చిపోయావని అంతా—'

'నోరుముయ్యవే. ఏ మనిషి కన్పించనప్పుడు సవాలక్ష అనుకున్నాం. ఎదురుగుండా ప్రత్యక్షంగా కన్పిస్తున్నప్పుడు అలాటి మాటలు అంటే ఆయుక్షీణం అని కూడా తెలియదా నీకు' ముసలాయన కసిరాడు.

'ఎన్నాళ్ళయిందయ్యా నిన్ను చూసి! ఎప్పుడొచ్చావు?' తేరుకుంటూ అడిగింది ఆవిడ.

'మధూ! నువ్వు ముందు స్నానం చెయ్యి. ఇదుగో, ఏమేవ్! నిన్నే! ఇహ అలా ముద్దులాడటం ఆపి అబ్బాయికి వేణ్ణీళ్ళున్నాయో లేదో చూడు. ఇంట్లో ఏమున్నాదో? లేకపోతే వెళ్ళి తీసుకువస్తాను. చప్పున చెప్పు'.

'కాని బాబాయ్! అమ్మా వాళ్లు—' మాధవ్ అడ్డుతగిలాడు.

కాంతమ్మ భర్తవైపు బాధగా చూసింది.

'చెప్తారా బాబూ! చెప్తా. ముందు నువ్వు స్నానంచేసి పట్టెడు మెతుకులు తిను.'

మాధవ్ ఆయన దగ్గరగా నడిచి చివ్వున చెయ్యి పట్టుకుంటూ 'బాబాయ్! అమ్మా వాళ్ళేమయ్యారు? సుధ యెక్కడుంది? ఇవేవీ తెలుసుకోకుండా నేను భోజనం చెయ్యగలను అనేనా నీ వుద్దేశం?' అన్నాడు గట్టిగా.

కాంతమ్మ అక్కడ నిలబడటం యిష్టం లేనట్టు లోపలికి వెళ్ళిపోయింది.

ముసలాయన కర్ర గోడకి చేరబెట్టి క్రింద చతికిలబడుతూ 'కూర్చోరా నాయనా! కూర్చో— అంతా చెప్తా.' అన్నాడు. వణుకుతున్న కాళ్ళతో, కొట్టుకునే గుండెతో మాధవ్ కూడా ఆయన ప్రక్కనే కూలబడ్డాడు. ప్రకాశం గారు చెప్పటం ప్రారంభించాడు.

5

'ఇదిరా బాబూ, జరిగిన సంగతి. నీ కోసం మా యిల్లంతా గాలించారు. ఊళ్ళో అనుమానం తగిలిన ప్రతి యిల్లు సోదా చేశారు. అడ్డు పడిన ఇద్దరు ముగ్గుర్ని చావ చితగ్గొట్టారు. నువ్వు దొరకలేదన్న కోపంతో పూరంతా నానా హడావుడి చేశారు. అది జరిగిన వారం రోజులకి నువ్వు పట్టుబడ్డావన్నారు. కాల్చేసినట్టు పేపర్లో వార్తలు వచ్చాయి. ఆ వార్త వినగానే అసలే అన్నం నీళ్ళు లేకుండా కంటికి మంటికి యేకధారగా యేడుస్తున్న మీ అమ్మ పూర్తిగా మంచం పట్టింది. ఎంత ప్రయత్నం చేసినా మేమెవ్వరం ఆవిడచేత గుక్కెడు నీళ్లు తాగించలేకపోయాం. 1[illegible] రోజులు తిరగక ముందే పోయింది.'

'కాని - నేను - నేను అప్పుడు తప్పించుకున్నాను బాబాయ్.' ధారకడుతున్న కన్నీళ్ళని తుడుచుకుంటూ అన్నాడు మాధవ్.

'మాకెలా తెలుస్తుంది చెప్పు. నువ్వు కనీసం ఉత్తరం అయినా రాయలేదు.'

'ధైర్యం చాల్లేదు. అదీగాకుండా నేను త్వరలోనే మళ్ళీ పట్టుబడ్డాను. కులాసాగానే వున్నాను అని తెలియ చేయాలని యెంతో తహ తహ లాడాను. కాని నాకా అవకాశమే చిక్కలేదు.'

'మీ అమ్మ దహన సంస్కారాలవీ నా చేతి మీదనే ముగించాను.'

'మరి సుధ?-' మాధవ్ ఆత్రంగా అడిగాడు.

'సుధ కొద్దిరోజులు నా దగ్గరుంది తర్వాత వాళ్ళ మావయ్య వచ్చి తీసుకు వెళ్ళాడు.'


గుండె
జలుబును
వెంటనే
పోగొట్టుకోండి
అమృతాంజనం
పైనేరాసి త్వరగా గుణాన్ని పొందండి
AMRUTANJAN
Pain Balm
అమృతాంజన్ నొప్పుల జలుబుల నివారణకు 10
రకాల ఔషధాల చేరిన మందు

యీమయ్యో ?!'

'అవును. విశాఖపట్నంలో నాగభూషణంగారని ఎవరో వున్నారుటగా!'

'కాని యెప్పుడూ చెప్పుకోవటమే తప్ప సుధకి స్వయంగా తెలియదే! అసలు వాళ్ళంటే యిష్టం లేదుకూడా!'

'పరిస్థితులు సరిగ్గా లేనప్పుడు యిష్టా యిష్టాలతో ప్రసక్తి యేముందిరా పిచ్చివాడా ?—నేనే వుత్తరం వ్రాయమని చెప్పాను. ఏం చెయ్యను చెప్పు. నాతోపాటు యింత అన్నం అయితే పెట్టగలను కానీ పెళ్ళెక్కడ చెయ్యగలను! వయసు వచ్చిన పిల్లని పెళ్ళి చేయకుండా ఈ పల్లెటూళ్ళో వంటరిగా వుంచటం నా కంత బాగా అనిపించలేదు.'

'అయితే సుధ యిప్పుడు ?—'

'విశాఖపట్నంలో వుండి వుంటుంది.'

'అదేమిటి బాబాయ్! నీకు ఖచ్చితంగా తెలియదా ?—'

ముసలాయన తెలియదన్నట్టు తలాడించాడు. 'సుధ వ్రాసిన వుత్తరం చూడగానే ఆయన వచ్చి తీసుకు వెళ్ళాడు. వెళ్ళిన ఆరెన్నెల్ల వరకూ అప్పుడప్పుడు క్షేమం తెలియజేస్తూ, వాళ్లు బాగా చూస్తున్నారని వుత్తరాలు వ్రాసేది. తర్వాత, తర్వాత యేమైందో తెలియదు. ఉత్తరాలు ఆగిపోయినాయి. నేను వుత్తరం వ్రాస్తే తిరి వచ్చింది.'

మాధవ్ గుండెల్లోంచి చీల్చుకు వస్తున్న నిట్టూర్పుని శక్తి అంతా వినియోగించి ఆపుకున్నాడు.

ఇద్దరి మధ్యా మౌనం ఆవరించింది.

'సుధ వ్రాసిన వుత్తరాలు వున్నాయా బాబాయ్ ?—' చివరికి అడిగాడు.

'ఆ! ఒక్క సుధేమిటి ? మా యింటికి వచ్చిన యే చిన్న కాగితం అయినా సరే అలా శాశ్వతంగా వుండాల్సిందే! ఇదుగో! ఓయ్! నిన్నే. ఆ వుత్తరాల తీగె ఒక్కసారి యిక్కడకు తీసుకురా—విన్పించిందా నే చెప్పింది ?—'

అయిదు నిమిషాలతర్వాత కాంతమ్మగారు వుత్తరాలు దొంతరగా గుచ్చిన ఓ పెద్ద యినప తీగె ఒకటి తెచ్చి అక్కడ పెట్టి 'మధూ! స్నానానికి నీళ్లు పెట్టానులే!' అంది.

'అవున్రా బాబూ! నువ్వు ముందు స్నానంచేసి భోంచేస్తే కాని యివి ముట్టుకోటానికి వీల్లేదు.' ప్రకాశంగారు మాధవ్ చేతిలోని వుత్తరాలున్న తీగె లాక్కుని దూరంగా పెట్టారు.

'అయ్యో! అదేమిటి ఆ బుగ్గ మీద అంత గాయం. నేను సరిగ్గా చూడనే లేదే!—' అప్పుడే చూసిన కాంతమ్మగారు ఆదుర్దా ప్రకటించింది.

'ఇదా? — ఇది — ఇది — చిరిగి పోయింది పిన్నీ.' మాధవ్ తడబడుతూ సమాధానం చెప్పాడు.

'అయ్యో! నాకు చూపు సరిగ్గా ఆనదు. నేను చూడనే లేదు. ముందు దానికేదయినా మందు చూడు.' ముసలాయన నొచ్చుకుంటూ తొందర చేశాడు.

6

స్నానం చేసి భోంచేసిన తర్వాత వుత్తరాల తీగెలాగించి సుధ వ్రాసిన ఉత్తరాలన్నీ విడదీసి వరసగా పెట్టుకుని ఒక్కొక్కటే చదవటం ప్రారంభించాడు. మొదటి మొదటి ఉత్తరాల్లో మాధవ్ ను గురించి ఒకటి రెండు వాక్యాలున్నాయి. అంతే — తర్వాత, తర్వాత ఆ ప్రసక్తే లేదు. వాళ్ళ మామయ్య నాగభూషణంగారు చాలా మంచివాడుట. ఇంట్లో అంతా తనని స్వంత కూతురులా యెంతో అపేక్షగా చూస్తున్నారుట. వాళ్ళు బాగా వున్న వాళ్ళుట. తనని అపురూపంగా చూస్తుండటంవల్ల జీవితం ఏ లోటూ లేకుండా హాయిగా గడిచిపోతోందిట. సుధ ఉత్తరాలన్నీ ఆ యింట్లో యెంత ఖరీదయిన వస్తువులున్నాయో, ఆ కుటుంబానికి సాటివారిలో ఎంత గౌరవం, సంఘంలో యెంత పలుకుబడి వుందో వివరంగా విడమర్చి తెలియచెబుతున్నాయి. వాటినెన్ని సార్లు తిరిగి తిరిగి చదివినా యెక్కడా యీ పల్లెటూరు వదిలేసి వచ్చినందుకు చింత కాని, మాధవ్ కుటుంబం అలా అయిపోయినందుకు బాధ గానీ కన్పించలేదు. సుధ వ్రాస్తున్న ధోరణి చూస్తుంటే నెధవ పల్లెటూరు వదిలివస్తే వచ్చాను, హాయిగా నిక్షేపంగా బ్రతుకుతున్నాను అనే తృప్తి కన్పిస్తోంది.

నిరాశతో మాధవ్ మనసు అగాధాల్లోకి కృంగి పోసాగింది. ఎంత ఆత్రంగా వచ్చాడు తను! ఎన్ని వూహించుకున్నాడు! అందరితోపాటు సుధ కూడా తను మరణించాడని నమ్మేసిందా? నమ్మితే నమ్మింది పోనీ కనీస అతని జ్ఞాపకచిహ్నంగా నాలుగు మాటలు వ్రాయకూడదూ! ఆరోజు వెన్నెల్లో పున్నాగచెట్టుసాక్షిగా చెప్పిన మాటలంత తేలికగా మర్చిపోయిందా? మొదట విచారంతో కోపం ముంచుకువచ్చినా వివేకం నచ్చచెప్పటంతో మాధవ్ శాంతి పొందాడు. అవునుమరి. ఆడపిల్ల! యేం చేస్తుంది పరిస్థితులతో రాజీ పడకపోతే బ్రతుకు దుర్భరం అవుతుందని భయపడివుంటుంది. ఆ బెదురువల్లే బావని గురించిన జ్ఞాపకం గుండెల్లో పదిలంగా యే మారుమూలనో గుప్తంగా దాచుకుని మామూలుగా జీవిస్తూండి వుంటుంది. ఏనాడు వడగానే అది వెల్లువలా బైటికి పొంగి ప్రవహించదూ!

ఆ రాత్రి పడుకుంటే అతనికి నిద్రే పట్టలేదు. దేశానికి

స్వాతంత్ర్యం వచ్చింది. అందరూ సంతోషాతిశయాలతో ఆనందం పంచుకుని పండుగ చేసుకుంటున్నారు. కాని తనకేం మిగిలింది. ఎవరూ లేని దిక్కులేని వాడయ్యాడు. మరణించి అమ్మ దూరమైతే, ప్రతి కున్న సుధ వునికి కూడా తెలియనంత దూరంలో వుంది. ఈ ఒంటరితనం నుంచి బైటపడేదెలా? భయంకరమైన యీ నిరాశనుంచి తేరుకుని మళ్ళీ మనిషిగా మారటం యే విధంగా! తనకింత శక్తి యెవరు యిస్తారు! ఆవేదనతో అతని హృదయం మెలికలు తిరగసాగింది.

మర్నాడు వూరంతా చూడటానికి వెళ్ళినప్పుడు ఒకసారి తన యింటిని తృప్తిగా చూసుకునేందుకు స్కూలువైపు వెళ్ళాడు. ఇంటిని స్కూలుగా రూపొందించిన ఆ ఆవరణలో పున్నాగ చెట్టులేదు. కొట్టేశారు. ఇప్పుడక్కడ చదును చేసిన ప్రదేశం ఆటస్థలంగా మార్చబడి వుంది. మాధవ్ వెళ్ళేసరికి అందులో పిల్లలు ఆడుకుంటున్నారు. బరువెక్కిన హృదయంతో అక్కడ నిలబడలేక తిరిగి వచ్చాడు.

7

"నీ పేరుమీద ఆ ఇల్లు నే నే చొరవ చేసి స్కూలుకు యిచ్చాన్రా అబ్బాయి."

తలవూపుతూ అన్నాడు ప్రకాశంగారు.

"మంచి పని చేసేవు బాబాయి! చాలా మంచిపని చేశావు. కాని స్కూలుకి నా పేరు వద్దు. తీయించేసి అమ్మ పేరు పెట్టించు."

'ఆ వందెకరాల మాగాణి—' ముసలాయన సందేహంతో ఆగిపోయాడు. ఇన్ని రోజులనుంచి దానిమీద వస్తున్న తృణమో పణమో దానిమీదనే భార్యాభర్తల యిద్దరి జీవితాలు నిశ్చింతగా వెళ్ళిపోతున్నాయి. అది ఉండడంవల్లనే కొడుకులు చిల్లిగవ్వ పంపకపోయినా కూతురు వరుడూ పుణ్యం అంటూ అప్పుడప్పుడు వస్తూ పోతూ ఉన్నా ఆయనకి మరీ అంత బాధ అనిపించటం లేదు. చచ్చిపోయాడు అనుకున్న మాధవ్ తిరిగి వచ్చాడనుకున్న సంతోషం యెక్కువసేపు నిలవలేదు. ఆయన గుండెల్లో రాయిపడింది.

మాధవ్ దగ్గరగా వచ్చి ఆయన భుజంమీద చెయివేస్తూ 'బాబాయ్! అమ్మ పోయినప్పుడు కాస్తో కూస్తో ఖర్చయి వుంటుంది. సుధ కూడా నీ దగ్గర కొద్ది రోజులుండి వెళ్ళింది. నేను లేనప్పుడు నా కుటుంబానికి చాలా సహాయం చేశావు. ఈ కాస్తతో నీ ఋణం తీరిపోతుందని కాదు. కాని ఆ వందెకరాలు నువ్వు వుంచుకుంటే నాకు తృప్తిగా వుంటుంది' అన్నాడు.

ముసలాయన కళ్ళు ఆశతో ఆనందంగా మెరిశాయి. వెంటనే చెమర్చినాయి.

"కాని మధూ!–" యేదో చెప్ప బోయాడు.

"నా కింకేమీ చెప్పకు. ఈవూళ్లో నాకెలాగూ యిల్లు లేదు. ఎప్పుడైనా రావాలనిపిస్తే నీ దగ్గరకే వచ్చి రెండు రోజులుండి పోతాను"

"అదికాదు– నీకు– నీకు–" ముసలాయన తడబడ్డాడు.

"నాకేం ఫర్వాలేదు. జవసత్త్వాలు పుష్కలంగా వున్నవాడిని. నా ఒక్క పొట్టకోసం ఆ మాత్రం సంపాయించుకోలేకపోను" అన్నాడు. అతను ఆ సాయంత్రమే అక్కడినుంచి వెళ్ళిపోతున్నాడు.

ఇక్కడికి రాగానే జీప్ తిప్పి పంపేస్తూ తన పరిస్థితులు యిలా తారుమారు అయాయని తెలియజేస్తూ, వుత్తరం రాసి రాంగోపాలరావుగారికి పంపించాడు. ఆయన దగ్గరనుంచి వెంటనే సమాధానం వచ్చింది. "మాధవ్! నీ కేమని ఓదార్పు చెప్పాలో తెలియటం లేదు. నా అనేవాళ్ళు లేని భయంకరమైన నిరాశ యెలాటిదో నేను స్వయంగా అనుభవిస్తున్నాను. ఆ బాధ నాకు తెలుసు. మాధవ్! నా ఆరోగ్యం అంతగా బాగుండటం లేదు. కొద్దిరోజులు దేశం అంతా తిరిగి రావాలని వుంది. నువ్వు వెంటనే బైలుదేరిరా! నాతోపాటు నిన్ను కూడా తీసుకెళ్ళేందుకు వీలుగా యేర్పాట్లు చేస్తాను. మనిషికి మామూలు సమయాల్లోకంటే అనారోగ్యంగా వున్నప్పుడు ఆదరంగా చేసేవాళ్ళు చాలా అవసరం. అప్తులం అంటూ నా చుట్టూ చేరిన బంధువర్గం చాలా వుంది. వీళ్ళ ఆప్యాయత అంతా నా ఆస్తిమీద కాని నామీదకాదని నాకు తెలుసు. నిన్ననే నా దూరపు మేనల్లుడు ఒకడు డాక్టరు దగ్గరకెళ్ళి అయనింకా యెంతకాలం బ్రతుకుతాడని చూచాయగా వివరాలు తెలుసుకున్నాట్ట. ఒక్క మాటలో చెప్పాలంటే వాళ్ళందరి నుండి దూరంగా పారిపోయేందుకే నా ప్రయాణం. రేపు నేను వరంగల్ వెళుతున్నాను. అక్కడ మనతోపాటు ఖైదీఅయి జైల్లో మరణించిన నా ప్రాణస్నేహితుడి తల్లివుంది. నువ్వు వచ్చే వరకూ అక్కడే వుంటాను. నువ్వు రాగానే మనం బైలుదేరుదాం మాధవ్! నువ్వీ ప్రపంచంలో యేకాకినిఅని యెప్పుడూ అనుకోకు. నీకు నేనున్నాను. అలాగే నాకు కూడా నువ్వున్నావు అనే నమ్మకంతో నీ కోసం వేయి కళ్ళతో యెదురుచూస్తూ—"

ఆ ఉత్తరాన్ని కనీసం పదిసార్లయినా చదువుకున్న మాధవ్ తృప్తితో నిట్టూర్పు విడిచాడు. జీవితం ఓ దోవ వెతుక్కునేవరకూ తండ్రిలాంటి రాంగోపాలరావుగారి నీడన వుండడం యెంతయినా మంచిది కానీ– ఆయనదగ్గరకు వెళ్ళేముందు సుధని కలుసుకోవడం చాలా ముఖ్యం అన్పించింది అతనికి.

జరిగిన కథ

స్వాతంత్ర్యోద్యమంలో పాల్గొని జైలుశిక్ష అనుభవించి, విడుదలయి మాధవ్ స్వగ్రామానికి బయలు దేరుతాడు. తనవారిని, ముఖ్యంగా తాను గాఢంగా ప్రేమించిన సుధను కలుసుకోవాలనే ఆత్రుతతో తిరిగివస్తున్న అతనికి త్రోవలో రాత్రిపూట ఒక కోచ్‌లో ప్రయాణం చేస్తున్న ఒక యువతి తారసిల్లుతుంది. ఆ కోచ్ బురదలో కూరుకుపోయింది. లేవదీయడానికి మాధవ్ సహాయం చేస్తాడు. అయితే దురదృష్టవశాత్తు, అతని మంచితనాన్ని ఆమె అపార్థం చేసుకుని చెంపమీదకొట్టి గాయం చేస్తుంది. అతడు విభ్రాంతుడవుతాడు... ...

8

పది రోజుల్లో యెలాగో అతి ప్రయాసమీద మాధవ్ సుధ అడ్రస్ సంపాదించ గలిగాడు. నాగభూషణంగారు కలప వ్యాపారం మీద బాగా సంపాదించాడట. ఆయన ఒక్కగానొక్క కొడుకు భాస్కరం హైద్రాబాద్‌లో లాయర్ చేస్తున్నాట్ట. ప్రస్తుతం అందరూ అక్కడే వున్నారు. సుధ-భాస్కరంల వివాహం జరిగి రెండు సంవత్సరాలు పైనే అయింది. ఈ సమాచారం విని తేరుకోలేనంతగా కృంగిపోయాడు. ఎంత ఆలోచించినా అతనికి సుధమీద కోపం రావటంలేదు. తను చచ్చిపోయాడను అనుకుని ఆ వివాహానికి ఒప్పుకుని వుండి వుంటుంది. ఇప్పుడు వెళ్ళి తను కళ్ళకి కన్పిస్తే సుఖంగా సాగుతున్న సుధ సంసార జీవితంలో అనుకోని కల్లోలం రేపినట్లు అవుతుందేమో! ఏం చెయ్యాలి. అలాగని చూడకుండా వుండటానికి అతని మనసు ఒప్పుకోవటం లేదు. చూసి సుధని ఓదార్చాలి: 'ఎప్పటికీ నీవాడనే సుధా! నా గురించి ఆలోచనతో నీ జీవితం పాడుచేసుకోకు. భాస్కరానికి భార్యవైన నువ్వు అన్ని విధాలా అతనికి ఆనందం యివ్వటం ధర్మం'—ఇలా యింకా యెన్నెన్నో వూహించుకుంటూ అతను హైద్రాబాద్ చేరుకున్నాడు.

సుధ ఇల్లు కష్టపడ నవసరం లేకుండా సులభంగానే కనుక్కున్నాడు. భాస్కరం యింట్లో లేడని తెలిసింది.

'అమ్మగారిని కలుస్తాను' అన్నాడు మాధవ్. అతని గుండెలు చిత్రంగా

కొట్టుకోసాగినాయి. భర్త ప్రక్కన సుధని చూడటం వేరు. వంటరిగా సుధని కలుసుకోవటం వేరు.

"వీల్లేదు. ఎవ రొచ్చినా వీల్లేదు, తర్వాత రమ్మనమని చెప్ప మన్నారు" అన్నాడు.

"ఒక్క నిమిషం చాలు"

"వీలేదని చెప్పటంలా కే అమ్మ గారు క్లబ్ కి వెళ్ళబోతున్నారు. ఇప్పుడెవర్నీ చూడరు."

మాధవ్ కళ్ళు ఆశ్చర్యంతో పెద్ద వైనాయి. క్షణంసేపు ఆగి "వచ్చింది మీ బావగారు మాధవ్‌టు అని చెప్పు. అప్పుడు కూడా వీల్లేదంటే అలాగే వెళ్ళిపోతాను" అన్నాడు.

నౌకరు మాధవ్‌ని యెగాదిగా చూసి లోపలకు వెళ్ళాడు.

మాధవ్ డ్రాయింగ్ రూమ్‌లో నిలబడిపోయాడు. ఆ గది అందులో సామాను సుధ స్థితిగతులు యెంత వున్నతంగా వున్నాయో వివరిస్తు న్నాయి. ధనికులకుండే ఆ జూ దర్పం చక్కగా తెలుస్తోంది. ఐదు నిమిషాల్లో సుధ గదిలోకి వచ్చింది. అడుగుల శబ్దం విని మాధవ్ తిరిగి చూశాడు. ఎవరీ అమ్మాయి! తెల్లగా, పొట్టిగా, లావుగా ఖరీదుగల సిల్కు చీరెలో, వంటినిండా ధగధగ లాడుతున్న రాళ్ళ నగలతో, నుదుటిమీద కాసంత కుంకుమ బొట్టుతో — యెవరు? నిజంగా సుధేనా! మాధవ్ తడబడ్డాడు.

సుధ చేతిలో సన్నజాజులు గులాబిలు కలిపి కట్టిన పెద్దమాల వుంది. ఇద్దరూ నిర్విణ్ణు లయిపోయినట్టు క్షణంసేపు ఒకళ్ళని ఒకళ్ళు ఆత్రంగా చూసుకుంటూ అలాగే నిలబడిపోయారు.

"సుధా!" ఆగర్భ శ్రీమంతురాలిలా వున్న యీ వ్యక్తిని సుధగా గుర్తించటానికి అతని మనసు సంకోచిస్తోంది.

"బావా!" సుధ చప్పున వచ్చి అతని చేతులుపట్టుకుంది.

"సుధా!" అతని గొంతు బొంగురుపోయింది.

"బావా! నువ్వేనా? — నిజంగా— నిజంగా నువ్వేనా?—"

"నేనే సుధా! నేనే" అంతకంటె మించి పలకటం అతనికి సాధ్యం కాలేదు. క్షణాలు దొర్లినాయి.

"జన్మలో మళ్ళీ యిలా నిన్ను సజీవంగా కళ్ళారా చూస్తాననుకో లేదు. ఈరోజు లేచి యెవరిమొహం చూశానో!" అతని చేతులువిడిచిపెట్టి కన్నీళ్ళు తుడుచుకుంటూ అంది.

మాధవ్ అలాగే చూస్తున్నాడు.

"కూర్చో బావా! నా కింకా నమ్మకం కలగటంలేదు. నౌకరు చెబుతుంటే నిజంగా నాకు మతి పోయింది."

ఆదుర్దాగా, ఆసంభ్రమంలో సుధ చేతిలో పూలమాల క్రిందపడి సుధ కాళ్ళక్రింద నలిగి పోయింది.

"అయ్యో!" అన్నాడు మాధవ్ దాన్ని వంగి చేతిలోకి తీసుకుంటూ.

"అదా! పోనీ యింకోటి కట్టుకుంటాను." నిర్లక్ష్యంగా అనేసి మాధవ్ చేతిని పట్టుకుని సోఫాలో కూర్చోపెట్టి 'ఇప్పుడే వస్తా.' అంటూ లోపలికి పరుగెత్తింది.

మాధవ్ వెర్రివాడిలా చేతిలో మాలవైపే చూస్తూ కూర్చుండిపోయాడు. కొద్ది క్షణాలక్రితం కలకలలాడుతూ సజీవంగా నవ్వుతున్న పువ్వులు వాడి నలిగి దీనంగా చూస్తున్నాయి.

"క్లబ్ కి రానని ఫోన్ చేశాను" సుధ తిరిగివస్తూ అంది.

తిరిగి వచ్చిన సుధలో ఓ విధమైన హుందాతనం, గంభీరత్వం కన్పిస్తోంది. ఇద్దరూ కూర్చున్నారు. సంభాషణ మొదలైంది.

మాధవ్ క్లుప్తంగా తన కథంతా చెప్పాడు. సుధ సానుభూతిగా స్నేహితురాలిలా వింది. సంభాషణ సుధ విషయాలమీదకి మళ్ళింది. కర్తని గురించిన ప్రసంగం రాగానే సుధ ముఖంలో కోటి కాంతులు వెలిగాయి.

"ఆయన చాలా మంచివారు బావా! నేనంటే ప్రాణం" సగర్వంగా చెప్పింది. ఆ మాటలు మాధవ్ మనసులో శూలాల్లా గుచ్చుకున్నాయని సుధకి తెలియదు.

సుధ స్థితిగతులు చాలా బాగున్నాయి. ఆనందంగా ఏ లోటూ లేకుండా గడిచిపోతోంది. ఆ సమయంలో నాగభూషణంగారి అండ దొరకడం చాలా అదృష్టం. ఆపకుండా మాట్లాడుకున్న ఆ ధోరణి చూసిం తర్వాత మాధవ్ కి సుధని చూస్తున్నాను అనే ఆనందం ఆవిరిలా మాయమవసాగింది.

"కాని-సుధా—" ఆఖరి సమాగమం గురించి, ఆ వాగ్దానం గురించి గుర్తు చేయబోయాడు. అది అర్థం చేసుకొన్నట్టు సుధ ముఖం కొద్దిసేపు యెర్రబడింది, వెంటనే తేలికగా తోసేస్తూ "ఫో బావా రేపోమాపో తల్లిని కాబోతున్నాను కూడా! నువ్వా సంగతుల్ని గుర్తుచేశావంటే సిగ్గుతో నా ప్రాణం పోతుంది." అంది. మాధవ్ నిరుత్తరుడైనాడు అతని మనసు మంచు ముద్దని తాకినట్టు చల్లబడి మొద్దుబారిపోసాగింది.

"మారిన పరిస్థితులతో పాటు మనిషికూడా మారటం సహజం ఆ మార్పుని నువ్వు అర్థం చేసుకోవాలి కాని, వెక్కిరించకూడదు."

సుధ స్వరం గంభీరంగా పలికింది అంతకంటే "ఆడపిల్లని. నాకంతకంటే గత్యంతరం లేకపోయింది." అని కన్నీళ్ళమధ్య అంటే తన కెంత తృప్తిగా వుండేది!

కాని సుధ యివేవీ ఆలోచించే స్థితిలో లేదు.

"ఇంతకీ యెక్కడుంటున్నావు నువ్విప్పుడు?" ప్రసంగం మార్చటానికి కుశల ప్రశ్నలు ప్రారంభించింది.

"ఓ స్నేహితుడింట్లో—" పరధ్యాసగా జవాబు యిచ్చాడు.

కొద్దిసేపు ఆలోచించి 'మా యింటికి వచ్చేయి' అంది.

'వద్దులే సుధా!'

'ఎందుకని?'

'నీ కంత శ్రమ దేనికి?—'

'భలేవాడివే! రాక రాక నువ్వ వస్తే నాలుగు రోజు లుంచుకోవటం నాకు శ్రమా?—పోనీలే! ఆయన్ని రానీ. ఆయనే స్వయంగా అడిగిన తర్వాత వద్దుగాని—'

'నే వెడతా సుధా!—'

'అదేమిటి? ఆయన రాకుండానే – మంచివాడవే. కూర్చో—కూర్చో—వుండు కాఫీ టిఫిన్ పంపమని వంటమనిషితో చెప్పి వస్తాను.' లేచి లోపలికి పరుగెత్తింది.

ఎంతసేపు ఆయన ఆయన! ఆయన్ని గురించి తప్ప సుధకి మరో మాట రానట్లు వుంది. 'ఆయన చాలా మంచివారు. పరిచయం అయితే స్వయంగా నువ్వే ఆ మాట అంటావు.'

'ఆయన త్వరలో ఎడ్వకేట్ జనరల్ కాబోతున్నారు.'

'ఆయనకి నేనంటే ప్రాణం—' ఈ మాటలు పదే పదే వచ్చి అతని హృదయాన్ని తూట్లు తూట్లుగా పొడవటం ప్రారంభించాయి సుధ లేకపోతే అతనికి ఒక్క క్షణం గడవదట. ఇంటికి రాగానే కంటికి కన్పించకపోతే 'సుధా—సుధా' అని ఒకటే కలవరింతట. సుధని పెళ్ళి చేసుకున్న తర్వాత అతనికి పట్టిందంతా బంగారం అవుతోందిట. 'ఇదంతా నీ అదృష్టం. నా దేముంది' అంటాట్ట. 'స్త్రీకి జీవితంలో యింతకంటే యింకేం కావాలి? ఆడదాని అదృష్టానికి అంతకుమించిన నిర్వచనం యింకేం వుంది!' ఇది సుధ మాటల ధోరణి.

మాధవ్‌కి నిరాశతో పిచ్చెక్కుతుందేమో అన్పించింది. ఎన్ని వూహించుకున్నాడు తను! నాలుగు సంవత్సరాలు అంటే యేమంత పెద్దకాలం అని. కాని యీ కొద్ది కాలంలోనే సుధ యెంత మారిపోయింది! తనకు తెలిసిన మనిషికి ఈ మనిషికి అసలు పోలికే లేదు. రూపంలో నేకాదు, స్వభావంలో కూడా యెంత వ్యత్యాసంవచ్చింది! తన చిన్నారి మరదలు ఆ అమాయకపు సుధకి బావ తప్ప యీ ప్రపంచంలో యింకేమీ అవసరం లేదు. కన్నె వయసులో కమ్మని కలల్లో బతికే ఆ సుధకి జీవితం అంటే భయంలేదు. ఇప్పటి ఈ సుధకి లాయరు భాస్కరంగారి భార్యగా కొత్తవ్యక్తిత్వం వచ్చింది. కోర్కెలు పడగలువిప్పాయి. ఆ కది సంఘంలో ఆడంబరంగా గుర్తింపబడా లంటే పేరు ప్రతిష్ఠలు పుష్కలంగా వున్న భర్త కావాలి. అవన్నీ సమకూరుస్తున్నాడు కాబట్టి భర్త అంటే అంత ప్రాణమా! చదువు రాని సుధకి మధ్యలో కలిగిన సిరిసంపదలతో అమాయకత్వంపోయి, వివేకం

నటించి ఆడంబరంగా ప్రతిశాలనే ఆర్భాటం జాస్తి అయింది.

మాధవ్‌కి ముళ్ళమీద కూర్చున్నట్టు కంపరంగా అన్పించింది. ఎప్పుడెప్పుడు బైట పడతానా అని యెదురు చూడసాగాడు.

సుధ కాఫీ టిఫిన్ పట్టించుకు వచ్చింది.

అవి తీసుకోవటం యెలాగో పూర్తి అయాయనిపించుకుని వెళ్ళటానికి లేవబోతుండగా ఇంతలో భాస్కరం దానే వచ్చాడు. సుధ పరిచయం చేసింది. సుధ అంత గర్వంగా, తన అదృష్టంగా మురిసిపోతున్న భర్త పొట్టిగా – లావుగా వున్నాడు. అతను చాలా తెలివైనవాడని నిగనిగలాడుతున్న బట్టతలే సాక్ష్యం. ఇంత చిన్న వయసులో అంత జుట్టు వూడిపోవటం యెంత విచారం. సుధ అతనిలో యేం చూసిందో మాధవ్‌కి యెంత ఆలోచించినా అర్థంగాలేదు.

భాస్కరానికి కూడా మాధవ్ అంటే పెద్ద ఆసక్తి కలగనేలేదు. ముక్తసరంగా మాట్లాడాడు. ఆ మాటల్లోకూడా తను లాయర్ని అనే దీని ప్రదర్శించాడు.

కొద్దిసేపయింతర్వాత మాధవ్ వెడతానని లేచాడు. భాస్కరం అభ్యంతరం చెప్పలేదు అతని సోఫా వెనక నిలబడిన సుధ వంగి రహస్యంగా భర్త చెవిలో యేదో చెప్పింది. క్షణం సేపు కనుబొమలు ముడివేసుకున్న భాస్కరం వెంటనే ముఖం ప్రసన్నంగా మార్చుకుని 'మీ మరదలు మిమ్మల్ని నాలుగు రోజులు వచ్చి వాళ్ళింట్లో వుండమంటోంది.' అన్నాడు నిర్లక్ష్యంతో హాస్యం మిళాయించి.

సుధ అదేదో పెద్ద జోక్‌లా పకపకా నవ్వింది.

మాధవ్ మరో అయిదు నిమిషాలుకూర్చుని వుండటానికి వీల్లేదని క్షమాపణ చెప్పుకుని బైటకి వచ్చేశాడు.

• • •

మెట్లు దిగి వచ్చేస్తూంటే వరండాలో జంటగా నిలబడి వీడ్కోలు యిస్తున్న దంపతులని చూసి అతని మనసు అనుకున్నంతగా యీర్ష్య పడక పోవటం చూసి అతనికే ఆశ్చర్యం వేసింది. గుండెలు బిగబట్టుకుని యెదురు చూసిన సమయమేదో గడిచిపోయి హాయిగా గాలి పీల్చుకున్నట్టుంది కాని— ఇంకో రకమైన బాధ. వంటరితనంలాటిదేదో అతని మనసులో నిండిపోసాగింది. వచ్చే ముందు అతను వూహించుకున్న వూహాలు భావనా మాత్రంగా కూడా మిగలేదు. అతను బ్రతికి బైటపడ్డందుకు సుధ ఎంతో సంతోషిస్తోంది నిజమే! అందులో ఆప్యాయత వుంది కాని అనురాగం లేదు. ప్రియబంధువుగా చిన్ననాటి మిత్రుడుగా అభిమానం వుంది. కాని ప్రియురాలిలా అనుభూతి లేదు. ఇన్ని సంవత్సరాల తర్వాత మరణించా

తని నమ్మి మర్చిపోయిన మనిషి ప్రతిక్షణం కళ్ళముందు కన్పించినందుకు అన్నకోలేని సంతోషం వుంది. కాని అందులో యెన్ని రోజుల నుంచో యెదురు చూసి చూసి తపన పొందిన నిరాశతో కృంగి అనుకోకుండా మళ్ళీ పొందిన వుపశాంతి లేదు. ఇప్పటి యీ సుధకి యిల్లు, భర్త, పిల్లలు తప్ప ఇంకో విషయం ఆలోచించేందుకు అసలు తీరుబడి లేదు. మాధవ్‌ని గురించి కుశల ప్రశ్నలు వేయటంకంటే, మానసికంగా అతని పరిస్థితి తెలుసుకోవాలనే అభిమానం లేదు. సుధ గుర్తుకు వస్తే అతనికి అకారణంగా చిరాకు కలగసాగింది. అసలు చూడకుండా వున్నా బాగుండేది. అదో విధంగా ఒక మధురమైన అనుభూతిగా ఆ కాలం గుర్తుండేది. కన్నకలలు కాలి బూడిద అయినాయి. ఊహలు యెండమావుల్లా వెక్కిరించాయి. కట్టుకున్న ఆశాసౌధం గాలి మేడలా అంతరించి పోయింది. ఏం చెయ్యాలి తను! ఎక్కడుండాలి? సుధ లేని యీ జీవితాన్ని యేం చేసుకోవాలి! నిర్దాక్షిణ్యంగా సుధ కల్పించి పోయిన ఈ వంటరితనాన్నుంచి యే విధంగా తప్పించుకోవాలి? అన్నీ ప్రశ్నలే! ఒక్క దానికీ సమాధానం లేదు. తనెవరికీ అవసరం లేదు. ఈ ఆలోచనే అతన్ని అశక్తుడ్ని చేస్తోంది. భయంకరమైన నిరాశ శరీరంలో ప్రతి అణువుని కాల్చేస్తోంది. అర్థం గాని ఈ వెలితిని చూసి అంతరాత్మ భయం భయంగా ముడుచుకుపోతోంది. అనుకున్నది పొందలేక అపజయం పొందిన మనసు అవమానంతో కరకరమంటోంది. కోపంతో రక్తం వుడికిపోసాగింది కాని ఏం చేస్తాడు! అకారణంగా కలిగిన యీ ఆగ్రహాన్ని యెవరి మీద వెడలగక్కుతాడు? ప్రతీకారం యెవరి మీద తీర్చుకుంటాడు! అసలు యీ వూపిరే-యీ గాలే అతనికి విషపూరితంగా అనిపించింది.

9

మాధవ్ మరో గంటలో రైల్వే స్టేషన్‌లో ఉన్నాడు. అతను ప్లాట్‌ఫారం మీదకి వచ్చేసరికి సరిగ్గా ట్రెయిన్ కదలబోతోంది. టికెట్ కొనే వ్యవధి లేదు. కొనాలనికూడా అతనికి లేదు. ఎదురుగుండా అందిన పెట్టెలోకి యెక్కేశాడు. ఫస్ట్ క్లాస్ పెట్టె అది. పెట్టెలో ఎవరూ లేరు. అంతా ఖాళీగా వుంది. కాని! ఇలాగే అవనీ! టికెట్ లేకుండా ఫస్ట్‌క్లాస్‌లో ప్రయాణం చేస్తాడు. ఒకవేళ టికెట్ కలెక్టర్ టికెట్ యేది అని అడిగితే లేదు అని దబాయిస్తాడు. అతను రెట్టిస్తూ మతి మీరి మాట్లాడితే పట్టుకు కొడతాడు. తద్వారా జైలు. అదే నయం. ఈ జైలు ప్రపంచంకన్నా ఆ జైలే బాగుంటుంది. మాధవ్ దృఢ నిశ్చయంతో కూర్చున్నాడు. ఒక్క టికెట్ కలెక్టరే కాదు, అసలు పెట్టెలోకి రాబోయే యెవరైనా

సరే వాళ్ళని పిలిచి కయ్యం పెట్టుకోవాలనే స్థితిలో వున్నాడు. లేకపోతే అతనికి పిచ్చిపట్టేట్టుంది.

ట్రెయిన్ కొద్దిసేపటిలోనే వచ్చి సికింద్రాబాద్ స్టేషన్‌లో ఆగింది. మాధవ్ యెంత ఆశగా చూసినా యెవరూ వచ్చి పెట్టెలో యెక్కలేదు. టైమ్ అయిపోతోంది. ట్రెయిన్ మళ్ళీ కదలటానికి సిద్ధమౌతోంది. ఇక్కడకూడా నిరాశే. అసలీ స్థితిలో వంటరిగా వుండాలంటేనే అతనికి ధైర్యం చాలటం లేదు అనుకోకుండా చాలా సున్నితమైన చోట దెబ్బతిన్న మనసు వివేకం కోల్పోయింది. తనకేమైంది ఈరోజు? పిచ్చి పట్టిన గుర్రంలా మనసు యీ వెర్రి గంతులేమిటి? మాధవ్‌కి తనంతే తనకే విసుగేసింది ఇన్ని రోజులనుంచి రామగోపాలరావుగారి సాంగత్యంలో తీర్చిదిద్దుకున్న వ్యక్తిత్వం యేమైపోయింది? ఆయనదగ్గర జీవితాన్ని గురించే నేర్చుకున్న పాఠాలు ఏ గంగలో కలిశాయి. ఆయన్ని గురించిన ఆలోచనలు రాగానే అతను కొద్దిగా శాంతపడ్డాడు. వృద్ధుడు, సజ్జనుడు, పితృసమానుడు అయిన ఆయన జ్ఞాపకం రాగానే వివేకం కొద్ది కొద్దిగా కోలుకోసాగింది. మాధవ్ దిగవెళ్ళి టికెట్ కొనుక్కుందామనుకున్నాడు. అప్పటికే రైలు కదలటానికి సిద్ధమౌతున్నట్టు కూత వేసింది. మాధవ్ లేచి బాత్‌రూమ్‌వైపు వెళ్ళాడు.

అతను తిరిగి తలుపులు తెరిచేసరికి కంపార్ట్‌మెంట్‌లో యెవరో యెక్కారు. యెదురుగుండా బెర్తుమీద సామాను కన్పిస్తోంది. అమ్మయ్య అని వూపిరి పీల్చుకుని తోటి ప్రయాణికుని కోసం కంపార్ట్‌మెంట్ అంతా కళ్ళతో వెతికేసరికి గుమ్మం దగ్గర తలుపు లోపలగడియ వేస్తూ ఒకమ్మాయి కన్పించింది. వంటరిగా ప్రయాణం చేయటానికి యింకెవ్వరూ బైటనుంచి లోపలికి రాకుండా తలుపు, కిటికీలు మూసి బందోబస్తు చేసుకుంటోంది. మాధవ్ బాత్‌రూమ్ గుమ్మందగ్గర నిలబడిపోయి అలాగే చూడసాగాడు.

తలుపు సరిగ్గా పడిందో లేదోనని మరోసారి గట్టిగా పరీక్షచేసి తృప్తి పొందిన ఆ అమ్మాయి వెనక్కు తిరిగింది. మాధవ్ కదిలి ముందుకు వచ్చి బెర్త్‌మీద కూర్చున్నాడు.

వంటరిగా వున్న కంపార్ట్‌మెంటులో మొట్టమొదటిసారిగా అప్పుడే అతన్ని చూస్తున్న ఆ అమ్మాయి కళ్లు ఆశ్చర్యంతో పెద్దవైనాయి. వాటిల్లో లీలగా భయం కూడా తొంగి చూసింది. దాన్ని గుర్తించిన మాధవ్ పెదవుల మీద చిరునవ్వు తొంగి చూసింది. నిజంగా యేం ఆడవాళ్ళు! లేని వుద్దేశాలు కలిగించి రెచ్చగొట్టటంలో సిద్ధహస్తులు. అతనివైపు చూస్తూండగానే ఆ అమ్మాయి ముఖంలోకి విపరీతమైన భయం వచ్చి నిండింది. చెయ్యి అప్రయ

త్నంగా గుండెలమీదకి వెళ్ళింది. నిర్లక్ష్యంగా యిదేం పట్టనట్టు జేబు లోంచి సిగరెట్ తీసి వెలిగించుకో బోతున్న మాధవ్ హఠాత్తుగా ఆగి పోయాడు. అతని చూపులు ఆ అమ్మాయి గుండెలమీద నిలిచి అక్కడ వేళ్ళాడుతున్న పులిగోళ్ళని పరీక్షగా చూశాయి. ఈ అమ్మాయి-యీ అమ్మాయి! చేతిలో వెలిగించి పట్టుకున్న అగ్గిపుల్ల పూర్తిగా కాలి వేలికంటి చురుక్కుమంది. రైలు అప్పటికే ప్లాట్‌ఫారం వదిలి పూర్తి వేగాన్ని అందుకుంది.

అతను సంభ్రమాశ్చర్యాలతో చూస్తుండగానే ఆ అమ్మాయి కళ్ళు ఆత్రంగా కంపార్టుమెంట్ అంతా వెతికి అలారం బెల్ వున్న చోట నిల్చాయి. ఆ అమ్మాయి చూపులని వెంటాడుతున్న మాధవ్‌కళ్ళు అలారం బెల్ తను కూర్చున్న చోటుకి దగ్గరగా వుండటం గ్రహించి కొంటెగా నవ్వాయి. క్షణంసేపు జాలిగా చూసిన ఆ అమ్మాయి మరుక్షణంలో ధైర్యం తెచ్చుకుని తల యెగరేసి బెర్త్‌మీద కూర్చుంది. మాధవ్ చెయ్యి అప్రయత్నంగా చెంపమీద తడుముకుంది. అక్కడ అదివరకు ఆ అమ్మాయి యేర్పరిచిన గాయం శాశ్వతమైన ముద్రగా బలంగా చీరుకుపోయినట్టు లోతుగా గంటు యేర్పరిచింది. మాధవ్‌కి క్షణంసేపు ఆ అమ్మాయిని యేం భయపడవద్దని, 'ఆ రోజు కూడా అనవసరంగా అపోహపడ్డావు. ఆ రోజు నీ చేయి పట్టుకోవటం నాది తప్పే. కాని నా మనసులో అసలు వుద్దేశం యిది' అని అంతా వివరంగా చెప్పా లనిపించింది. 'నేను నిన్నేం చేయను. నా నుంచి నీకేం ప్రమాదం జరగదు' అని నాలిక చివరిదాకా వచ్చిన మాటలని ఆ అమ్మాయి కళ్ళలో కన్పించిన ఆ బెదురు, వెంటనే ఆ తల తిప్పుకోవటంలో ఆ పొగరు చూసిన తర్వాత కాసేపు యేడిపించి తర్వాత చెప్పవచ్చనే చిలిపి కోరిక ఆపేసింది.

ఆ అమ్మాయి ప్రక్కగా కొద్ది దూరంలో వచ్చి ఆదే బెర్త్‌మీద కూర్చున్నాడు. అప్పటికి కూడా అలారం బెల్ అందుకోవాలంటే అతన్ని దాటి వెళ్ళాల్సిందే! అతను ఓకాలు జాపి ఆ వీలు చూసుకుని మరీ కూర్చున్నాడు. తను కూర్చున్న బెర్తుమీద వచ్చి కూర్చున్న అతన్ని చూసి భయపడలేదు. అసహ్యించు కున్నట్టు ముఖం పెట్టింది. నువ్వు నన్నేం చెయ్యలేవు అన్నట్టు ధీమాగా చూసి ప్రక్కకు తిరిగి కిటికీ తలుపు ఒకటి పైకి యెత్తబోయింది. దాని కంటె ఆ అమ్మాయి బెదిరిపోయి నట్టు, భయపడ్డట్టు, జాలిగా చూస్తే అతను కరిగి పోయేవాడు. తక్షణం తన ప్రవర్తనకి సిగ్గుపడి క్షమాపణ చెప్పుకుని వెళ్ళి తన చోటులో కూర్చునేవాడు. కాని 'నువ్వు నన్నేం చెయ్యలేవు' అనే ఆ నిర్లక్ష్యపు ప్రవర్తన అతన్ని రెచ్చ గొట్టింది. అందుకే వెంటనే వచ్చి తెరవబోతున్న కిటికీని ఆపుచేశాడు.

(సశేషం)

నేనే ఓడిపోయాను



తూర్పు తెల్లవారు తుండగానే వీధిలో ముగ్గు పెడుతున్న పార్వతి అల్లంత దూరంలోనే తన తల్లి, చెల్లెలు వస్తున్న జాడ కనిపెట్టి, ముఖం మాడ్చుకుంది.

'వస్తున్నాయి పాడు ముహాలు' గావన్ను! ఆ దిక్కుమాలిన అనుకుని, గబగబా ఇంట్లోకి పరు [illegible] రెండూ [illegible]స్తున్నాయి గుర్తి నిద్రపోతున్న భర్తను లేపి ఏమేమో మ[illegible] [illegible]
'మా తమ్ముడి పెళ్ళికి పిలవడానికి ఓ వార్నింగ్ [illegible] కాఫీ కాచడాని

కుపక్రమించింది తల్లి చెల్లెళ్ళను కుసనులో కొట్టుకుంటూ.

'పార్వతీ! పార్వతీ!' తలుపు గుద్దుతూ పార్వతిని పిలుస్తోంది తల్లి.

'ఆఁ! పార్వతికాదు! సింగినాథం' అనుకుంది పార్వతి.

'అక్కయ్యా; ఓ అక్కయ్యా!' చెల్లెలి పిలుపు.

పార్వతి భర్త శివరావు లేచాడు. పార్వతి ఉరిమి చూసింది. 'మీరెందుకు? మీరూరుకుండరూ! లేచారు పెద్ద గొప్పగా'

శివరావు ఆలోచనలో పడ్డాడు.

'పార్వతీ! పార్వతీ! అక్కయ్యా! తలుపు తలుపు' తలుపు దడదడలాడిపోతోంది.

ఇహ తట్టుకోలేకపోయాడు శివరావు. పార్వతి 'వెళ్ళకండి' అని శాసిస్తున్నా వినిపించుకోకుండా వెళ్ళి తలుపు తీశాడు. 'రండి రండి' అని ఆహ్వానిస్తూ.

తల్లీ కూతుళ్ళు వచ్చి చాపమీద కూలబడ్డారు.

పార్వతి మండిపడి పోతోంది. అందుకే తన ముఖంకూడా వాళ్ళవైపు త్రిప్పకుండా బిర్ర బిగుచుక్కూచుంది.

'అమ్మాయ్ పార్వతీ! ఎల్లుండి రాత్రి మద్రాసులో పెద్ద తమ్ముడి పెళ్ళి. సాయంత్రం మీరు కూడా పిల్లలతోసహా ప్రయాణానికి సిద్ధంగా ఉండండి. కాస్త త్వరగా వెళ్ళకపోతే మెయిల్లో సీట్లు దొరకవు' అంటూ మొదలెట్టింది తల్లి.

ఈ ఆహ్వానం పార్వతిలో కించిత్తైనా చలనం కలిగించలేదు.

'ఏమంటావు పార్వతీ?' తల్లి ప్రశ్న.

పార్వతి ప్రవర్తనలో మార్పేమీ లేదు. ఇది సాంబశివరావుకు బాధ కలిగించింది. నెమ్మదిగా 'విన్నావా పార్వతీ! మంచి శుభవార్త. మీ పెద్దతమ్ముడు పెళ్ళితోబాటు మనకు మద్రాసుకూడా చూసే శుభయోగం కూడా పట్టింది' అన్నాడు నవ్వుతూ.

'మనకుతుక్కదొక్క లేకు తక్కువ' ...డిగా అంది పార్వతి.

పార్వతి ప్రవర్తన తల్లికిగాని, చెల్లికిగాని ఏమీ ఆశ్చర్యం కలిగించలేదు — తెలిసిన విషయమే కాబట్టి. అసలు పార్వతి లక్షణం ... ప్రతి చిన్న విషయాన్నీ కొండంతచేసి తను బాధపడి ఎదటి వాళ్ళనుకూడా రాచి రంపాన పెడుతుంది— వాళ్ళెవరైనా సరే! ప్రతిదీ తన ఇష్ట ప్రకారమే జరగాలను కుంటుంది. ఒకవేళ వరాలు ... కొందిందా ... ప్పులుతొక్కిన కోతిలా ప్రవర్తిస్తుంది. ఆ ప్రవర్తనలో ఏం చేస్తుందో కూడా ఎవరికి తెలియదు.

అయినా ఇన్నికూడదు. మంచిగా ... వాళ్ళలోకి రావాలని తల్లి ... అనుకొంటే 'పార్వతీ! ఎందుకిట్లా మరీ అంత ఇదై పోతావు. అనవసరంగా కోపాలు

కక్షలూ పెంచుకుంటే ప్రయోజనం ఏముందమ్మా? నెమ్మదిమీద నేనంతా చక్కబరుస్తానని చెప్తూనే వున్నాగా. 'శుభమా' అని తమ్ముడి పెళ్ళి జరగబోతూంటే నువ్విలా ప్రవర్తిస్తే ఏమన్నా బాగుందా? చెప్పు! తప్పులేమన్నా జరిగితే మావల్ల జరిగాయి గాని వాడేం తప్పు చేశాడు చెప్పు వాడి పెళ్ళికి రాకుండా మానడానికి! పెద్దక్క, పెద్దబావ రాకుంటే వాడి మనసెంత క్షోభకు గురవుతుందో కాస్త ఆలోచించు.' అంది తల్లి సౌమ్యంగా.

'ఈ హితకథలన్నీ మాకేం వినిపించక్కర్లేదు. పెళ్ళికి రావాలో మానాలో మాకు బాగా తెలుసు. మీరొచ్చిన పనైందిగా! ఇహ దయచెయ్యొచ్చు' మొహం ఇటు త్రిప్పకుండానే వాడిగా విసిరింది మాటలు. శివరావుకే ఆ మాటలు ములుకుల్లా తగిలాయి. పాపం! వాళ్ళకెలా ఉన్నాయో? తల్లి నిజంగానే మ్రాన్పడిపోయింది మాటరాక.

'ఏమిటి పార్వతి నీ మాటలు? నువ్వేనా?' మెత్తగానే మందలించాడు శివరావు.

'మీకేం తెలియదు! మీరూరుకోండి! ఊరికేను' గదిమింది పార్వతి.

అదికాదక్కయ్యా' చెల్లెలు లేచి పార్వతివైపు నడిచింది.

పార్వతి కేకపెట్టింది 'మీ భారత భాగవత రామాయణాలు వినేవాళ్ళెవరూ లేరు. ఉన్నా టైమూ లేదు. మీరు తక్షణం నా ఇంట్లోనుంచి వెళ్ళిపోతే చాలా సంతోషిస్తాను. మళ్ళీ మీరు నా గుమ్మం తొక్కవలసిన పని కూడా లేదు వెళ్ళండి' తారస్థాయిలో అరిచింది పార్వతి.

చెల్లెలు స్తంభంలా నిలబడిపోయింది మధ్యలో నే—గుడ్లనిండా నీరు కుక్కుకుని తల్లి సరే సరి.

పార్వతిని ఈ స్థితిలో అదుపులో పెట్టడం ఎవ్వరివల్లా కాదని గ్రహించిన శివరావు 'నేను నెమ్మదిగా చెప్పి సమాధానపరచి పెళ్ళికి తీసుకొస్తాగా! మీ కెందుకు! మీరు వెళ్ళండి! నేనున్నాగా' అని సంజ్ఞ చేశాడు అత్తగారికి ధైర్యంచెప్తూ.

అత్తగారు దానికేం సంతోష పడలేదు. బరువుగా లేచింది.

'సరే! నా పెద్దకొడుకు పెళ్ళి కాబట్టి, పిలవ్వలసిన విధాయకం కాబట్టి పెళ్ళికి రమ్మని వేడుకొంటున్నాను. తర్వాత మీ ఇష్టం. వెళ్ళొస్తా' అంటూ తనచిన్న కూతురిని తీసుకు బయిల్దేరింది. శివరావు వాళ్ళతో వీధి గుమ్మందాకా వచ్చి

పెండ్యాల నాగాంజనేయులు

'అత్తగారూ! మీరేం బెంగపడకండి, మేమూ తప్పకుండా పెళ్ళికొస్తాం. అదొక్తి పిచ్చిది. దాని మాటలకు మీరేం బాధపడకండి' అని మేక పోతు గాంభీర్యంతో ధైర్యం చెప్పి సాగనంపాడ; మెల్లిగా లోపలి కొచ్చాడు.

నిప్పులు కక్కే కళ్ళతో పార్వతి 'హుబ్బ! అత్తగారంటే ఏం భక్తి! ఏం గౌరవం? ఆహాహా! మానాభి మానాలుండాలి మనుషులికి'- అంటూ మీదిమీదికి వచ్చి బుగ్గలు పొడిచి నంత పని చేసింది.

'ఏమిటి పార్వతీ నీ పిచ్చి? ఇష్టం లేకపోతే నోర్మూసుకుండాలి గాని ఏమిటా కట్టువిరుపు మాటలు? అస హ్యంగానూ!' చీదరించు కున్నాడు శివరావు.

'అవునవును! నా మాటలసహ్యంగా వుంటాయి. పాపం! మీ మాటలే మహా ముద్దొస్తూ వుంటాయి. అందు కేగావన్ను ఆ అత్తగారు చింకి చేటంత మొహం చేసు కెళ్ళింది. ఇంకేం! వెళ్ళండి వివాహ మహో త్సవానికి! మెచ్చి మేక తోలూ, పొగిడి పులి తోలూ కప్పుకాడు' ఝాడించేసింది పార్వతి. శివరావుకి కొంచెం కోపం వచ్చింది. అయినా నంబాళించుకుని 'అదేమిటే అలా ఎగిరి పడతావు? ఇటు చూడు! నేచెప్పేది కాస్త విని ఆలోచించు. అక్క, బావ, సొంత బావమరిది పెళ్ళికి వెళ్ళకపోవడం ఏమన్నా బాగుంటుందా? లోకం దృష్టి

సంగతి వదిలెయ్. అసలు మనకే మన్నా బాగుంటుందా అని' అంటూ చేయి గడ్డం పుచ్చుకోబోయాడు.

ఆ చేతి నొక్క తోపు తోసింది పార్వతి. 'ఆ విషయం నేను బాగా ఆలోచించాను. ఈ పెళ్ళికే గాదు. అసలు వాళ్ళింటికే మనం వెళ్ళక పోవడం చాలా మంచిది; ఆరోగ్యం కూడాను.' తెగేసి చెప్పింది పార్వతి.

'అలా అంటే ఎలా? మనిద్దర్లో కనీసం ఎవరో ఒకళ్ళయినా వెళ్ళక పోతే...'

'ఓహో! అదా సంగతి? నే నెలాగూ వెళ్ళనని భీష్మించాను కాబట్టి తమరు వెడదామనా?...'

'అహఁ! అదికాదు! నేను కూడా వెళ్ళకపోతే ఏమను కుంటారో చూడు,'

'అంటే ... నేను అప్రదిష్ట పాలయ్యేదాన్ని... మీరు మాత్రం పేరు గడించుకునే వారూ నన్న మాట! ఏం? సిగ్గుండాలండీ మనుషులై పుట్టాక...'

ఈ మాటతో శివరావుకి ఛర్రుమంది. 'అయినా నీతో వాదించడం నాదే బుద్ధి తక్కువ. ఎవరితో ఏం మాట్లాడాలో ఎలా మాట్లాడాలో కూడా తెలియని మొద్దువి. నువ్వే మయితే నాకేం! నే వెళ్తాను' అన్నాడు శివరావు విసురుగా.

ఒక్క నిముషం స్తంభించింది

పార్వతి. "వెళ్తారాలే ... సరే వెళ్ళండి చెప్తాను" అని బెదిరించింది:

"ఏం వెళ్తే? తలదీసి మొలేస్తావా!" శివరావు గద్దించాడు.

"ఏం జరుగుతుందో మీరే చూద్దురుగాని" అంటూ రివ్వున వెళ్ళిపోయింది పార్వతి.

"ఏమిటి తెలిసేది? గాడిద గుడ్డు" అనుకొని వంకీనున్న చొక్కా తొడుక్కొని అంతకన్నా కోపంగా వేగంగా వీధిలోకెళ్ళాడు శివరావు.

• • •


పార్వతి పెద్ద తమ్ముడు సత్యం. మద్రాసులో ఓ గుమాస్తా ఉద్యోగం చేసుకుంటూ నెలకు నూటయాభై రూపాయలు తెచ్చుకుంటున్నాడు. ఇతడికే మద్రాసులో పెళ్ళి. రెండో తమ్ముడు కృష్ణ. పార్వతి ఉండే ఊళ్ళోనే బడిపంతులు చేస్తూ ఓ వంద రూపాయలు సంపాదిస్తాడు. ఆ జీతం మీదే తల్లీ, పక్షవాతంతో బాధపడే తండ్రీ, చెల్లెలూ, తానూ ఓ పాతిక రూపాయల అద్దె ఇంట్లో వుంటూ గుట్టుచప్పుడు కాకుండా కాలక్షేపం చేస్తున్నాడు. సత్యం వల్ల వీళ్ళకప్పుడప్పుడూ పదీ పరకా సాయం దొరుకుతూంటుంది.

పార్వతి భర్త శివరావు మాత్రం ఓ డబ్భయి రూపాయలు సంపాదించేవాడు ఓ పచారు కొట్లో లెక్కలు రాసి. దానిమీదే తానూ, భార్యా, ముగ్గురు పిల్లలూ బతుకుతున్నారు ఓ 20 రూపాయల పూరింట్లో.

షుమారు రెండునెల్ల క్రితం పార్వతికో అద్భుతమైన ఆలోచన తట్టి, భర్తకు చెబితే అతడామోదించలేదు. అయినాసరే భర్తమాట వినకుండా, నెమ్మదిగా తల్లిదగ్గర కెళ్ళి ఏడుస్తూ ఓ పాచిక వేసింది. ఏడ్పు పనిచేసింది. ఇంతకీ ఏమిటా ఏడ్పు?

పార్వతి సంసారమూ తల్లి సంసారమూ కలిసి ఓ ముప్ఫయ్యయిదు రూపాయల యింట్లో నివసించడం. కృష్ణ సంపాదనా తీసుకొచ్చి తల్లి దోసిట్లో పొయ్యడం: ఆమె ఈ మొత్తం సంసారాన్ని పస్తు పెట్టకుండా సమానంగా ఈదుకు రావడం.

పాపం! ఆ తల్లి కూతురిమీద జాలిపడిపోయి కృష్ణను సమాధానపరచి వత్తిడి పెట్టేసి 35 రూపాయలకు ఓ మంచి అద్దెఇల్లు చూసింది. ఆ యింటిఖామందు అడిగిన ఓ నెల అడ్వాన్సు నిమిత్తం కృష్ణ 20 రూపాయలిచ్చాడు. పార్వతి తన భర్తచేత 15 రూపాయలిప్పించింది అడ్వాన్సు ఇచ్చిన వారం రోజులకు రెండు సంసారాలు కొత్తయింట్లో చేరి పాలుపొంగించుకుని. తామింత తిని చూడొచ్చిన వాళ్ళకీ, చుట్టుపక్కల వాళ్ళకీకూడా తినిపించారు. ఐతే ఆ రోజు శుక్రవారం కావడంవల్ల, పాత ఇళ్ళను ఖాళీ చెయ్యడం మర్నాటికి



వాయిదా వేశారు. ఆ రోజే ఓ విశేషం జరిగింది.

శివరావు మధ్యాహ్న భోజనార్థం ఇంటికి వస్తుండగా, కాకతాళీయంగా ఓ పెద్ద బట్టలషావు యజమాని కనబడి, అతని యోగక్షేమాలూ, ఉద్యోగం జీతం వగైరాలు విచారించి; జాలిపడి తన షావులో నూట ఇరవై రూపాయల ఉద్యోగ మిచ్చాడు. వెంటనే ఎడ్వాన్సుగా ఓ ఏభయి రూపాయలు కూడా ఇచ్చేశాడు. శివరావు ఆనందంతో ఉక్కిరి బిక్కిరయి, ఆ పూటకి హెూటల్లో భోంచేసి, ఆ మధ్యాహ్నమే పాత ఉద్యోగానికి రాజీనామా ఇచ్చేసి కొత్త ఉద్యోగంలో చేరిపోయాడు.

ఆ రాత్రి పార్వతి కి కొత్తవార్త విన్నప్పటి నుంచి నిద్ర పట్ట లేదు. ఒకటే ఆలోచన. తన భర్త జీతం తక్కువ. తమ్ముడి జీతం ఎక్కువ గనుక, తన సంసారానికి లాభంగా ఉంటుందనే సదుద్దేశంతో రెండు సంసారాల్నీ ఏకంచెయ్యబోతోంది తాను. తీరా తన భర్త ఎక్కువ సంపాదించ బోతున్నాడు! అను కున్నప్రకారం రెండు సంసారాలూ ఏకమయితే ... ఇంకేముంది? తన సంసారానికినష్టమే నాయె! అందుకే వెంటనే నిద్రపోతున్న శివరావుని లేపి "ఏమండీ! మనం ఈ ఇంట్లోనే ఉండిపోదాం. వాళ్ళతో కలవ్వద్దు. నేను బాగా ఆలోచించి చూశా! ఇలా కలవడం ఎవ్వరికీ మంచిది

కాదు. ఓ పోరూ పొత్తూ లేకుండా ఎవరి మానాన వాళ్ళం బ్రతుకు తున్నాం. ఒకరికొకరు దూరంగా ఉంటేనే చుట్టరికాలూ మర్యాదలూ నిలుస్తాయి' అంటూ హితబోధ మొదలెట్టింది.

శివరావు చిరునవ్వు నవ్వుతూ 'లేలిది వరహా ల్పాష్పే విల్లావ్‌ళి' అన్నాడు ఆవులింతకు చిటికెలు కొడుతూ.

'నిజమేలెండి! మీరు కూడా అప్పుడప్పుడూ కరెక్టుగా నేచెప్తారు.' అంది పార్వతి. శివరావు బండనిద్ర పోయాడు.

తెల్లారుతుండగా నె పార్వతి తన తల్లి దగ్గరకు పరుగెత్తి వెళ్ళింది. అప్పటికి ఇంకా ఎవరూ నిద్ర లేవ లేదు తల్లితప్ప. తల్లితో రాత్రి మర్యాదలూ చుట్టరికాలూ గురించి తన భర్తకు చెప్పిన పాఠమే చెప్పింది. అయితే ఆ పాఠం సృష్టి కర్త తను కాదనీ. తన భర్తేననీ వినీతే యతతో విన్నవించింది. తల్లి ఎంత గానో ప్రయత్నించింది పార్వతిని ఒప్పించాలని. వింటేగాక పైగా 'అమ్మా! ఆ యింటి కిచ్చిన అడ్వాన్సు పదిహేను రూపాయలూ కొంచెం త్వరగా ఇమ్మనిచెప్పు తమ్ముడితో, డబ్బులేక నానా అవస్థ పడుతు న్నాం' అంటూ చెప్పేసి తల్లి సమాధానంకోసం కూడా ఎదురు చూడకుండా ఇంటికి పరుగెత్తింది. తల్లి కొయ్యబారిపోయింది. కృష్ణ తల్లిద్వారా అంతా విన్నాడు, అరి కాలిమంట నెత్తికెక్కింది. అయినా తల్లి మీది గౌరవం కొద్దీ అంతా అణగదొక్కుకున్నాడు. ఆరోజే తాముండే ఇల్లు తప్పని సరిగా ఖాళీ చెయ్యవలసిన పరిస్థితి ఏర్పడ్డంవల్ల కొత్త యింటికి తన సంసారాన్ని మార్చేశాడు - తలకి మించిన బరువని తెలిసి కూడా.

పార్వతి, తన తమ్ముడింటో వుండని వేళల్లో తల్లి దగ్గరకెళ్ళి అడ్వాన్సుగా ఇచ్చిన 15 రూపా యలూ తెమ్మని కూర్చునేది. ఇలా అయిదారు సార్లు తిరిగి ఓ పది రూపాయలు దక్కించుకుంది పార్వతి ప్రవర్తనా, ఆమె పెట్టే వత్తిడీ కృష్ణకే కాదు - తల్లీ, తండ్రీ, చెల్లెలుకూడా కష్టంగా నె తోచింది. పార్వతివల్లే వాళ్ళంత రొంపిలో దిగబడ్డారు. అసలుతిండికీ, దినవెచ్చానికీ కష్టంగా నేవుండే పరి స్థితిలో కాబూలీవాడిలా పార్వతి తయారు ఇవ్వలేనని గానీ చెప్పలేక పోతున్నాడు కృష్ణ. రేపిస్తా, మాపిస్తా అని వెళ్ళమారుస్తాడు. అతను చెప్పి నట్టే తల్లికూడా సమాధానం చెప్తోంది. కాని ఈ విధమం ఎంతో కాలం సాగలేదు.

మరోనాడు పార్వతి వచ్చిందా బాకీ వసూలు చేసుకునేందుకు. ఆ సమయంలో అంతావున్నారింట్లో.

పార్వతి నాలుక ఆర్జోజు మరీ పదునుగా వుంది. తప్పంతా వాళ్ళ నెత్తినే తోసేసి, ఇన్నాళ్ళుగా ఇంత ఓపికతో తిరుగుతున్నందుకు 'నేను చాలా ఉత్తమురాల్ని' అని పొగుడుకుని, మిగిలిన 'ముష్టి అయిదు రూపాయిలు' వెంటనే ఇవ్వకపోతే వాళ్ళ మర్యాద దక్కడం కష్టమని హెచ్చరించింది. దాంతో కృష్ణ రేగాడు. పార్వతి నైజాన్నిగురించి, వేసే ఎత్తుల్ని గురించీ చెడామడా చెరిగేశాడు. పైపెచ్చు 'నీ భర్త దేవుళ్ళాటి వాడు. నువ్వే మరీ రాక్షసివి' అని తూలనాడేశాడు. దానికి చెల్లెలు వంతపాడింది. 'బావగారు నిజంగానే ఉత్తములు. ఆయనకిలాంటి ఛండాలబుద్ధుల్లేవు' అని.

ముసలితండ్రికూడా 'ఆ మాట నిజమేలే! ఏమంటావేం?' అన్నాడు భార్య వంకచూసి.

'నిజమే ననుకోండి...' అని సాగదీసిందామె—పాపం భర్త మాటకెదురాడని సత్యకాలపు ముత్తైదువ.

తూలాల్లాంటి ఈ మాటలతో పార్వతి దెబ్బతిన్న ఆడ పులిలా గాండ్రించింది. చిందులు తొక్కింది తన తండ్రి వంశాన్ని ఏడు తరాలు (వెనకటి) వరకూ తరిమి తరిమి తిట్టింది. 'ఛూ' అని ఉమ్మేసింది. 'నాకు బుద్ధిలేక మీ గడప తొక్కాను' అంది. 'ఆ అయిదు రూపాయలతో మీరు బాగుపడి మేడలూ మిద్దెలూ కట్టుకుని, కార్లూ రేడియోలూ కూడా కొనుక్కో'నుంది. 'ఇక మీకూ మాకూ సంబంధాలు లేవు. ఒకరి గుమ్మం ఒకరు తొక్కితే గాడిద కడుపున పుట్టినంత ఒట్టు' అని ఒట్టేసి, ధారలు కట్టే కన్నీళ్ళతో ఇంటికి చేరి, భర్తతో విషయమంతా చెప్పింది.

శివరావు బైరాగిలా కూర్చున్నాడు 'ఊ! ఆఁ!' అనకుండా దమ్ముకొడ్తూ తనను తిడుతూ, తన భర్తను వాళ్ళు పొగిడిన విధమంతా, ఒక్క మాటకూడా విడవకుండా ఖచ్చితంగా అంటూ వందసార్లు గింజుకుంది.

శివరావు అర్ధ నిమీలిత నేత్రాలతో, చిరునవ్వు నవ్వుతూ పద్మాసనం వేసుక్కూర్చుని బుద్ధుడిలా పోజు పెట్టాడు.

నోరు నెప్పి పుట్టింది పార్వతికి. దాంతో దగ్గూ, పడిశెం, ఆయాసం, దడ, నీరసం, నిస్సత్తువ, రొప్పూ, రోషం, క్రోధం వగైరా గుణాలు పుట్టి, ఆమెతో మెట్రిక్ తులామానం ప్రకారం రెండు శేర్ల కన్నీళ్ళు కార్పించాయి. స్తబ్దుగా వున్న శివరావు వంక చూసి 'ఛీ!

చీమూ నెత్తురు లేని మనుషులు! ఇలాంటి వాళ్ళకి భార్యెందుకు? బండ రెందుకు?' అని కసిగా విసుక్కొని పడుకుంది ఫోం చెయ్యకుండా.

శివరావు హాయిగా ఫోంచేసి పడుకున్నాడు.

ఆనాటినుండీ పార్వతికీ, పుట్టింటి వారికీ రాకపోకలు నశించాయి. ఇదీ పూర్వ కథ.

పార్వతికన్నా వేడిగా వీధిలో కెళ్ళిన శివరావుకు పెళ్ళికి వెళ్ళి తీరాలనే పట్టుదల ఎక్కువయింది. ఇన్నాళ్ళుగా ఏ విషయంలో నైనా తనే తగ్గిపోయి పార్వతికే నెగ్గే అవకాశం కలిగించేవాడు సంసారం రచ్చ కెక్కుతుందని. ఇకమీద అలా జరగడానికి వీల్లేదు. తన పంతం నెగ్గాలిసిందే. పార్వతి రోగం కుదర్చాలిసిందే. పెళ్ళి కెళ్తే ఏమిటో చేస్తుందట, ఏమిటి చేసేది? ఇదివరలో అంతే పార్వతి గొప్ప దయినా కోపంవస్తే బడబడా పుట్టింటికిపోయి కూర్చునేది. శివరావే వెళ్ళి బ్రతిమాలి తీసుకొచ్చేవాడు. ఇప్పుడు పార్వతికా అవకాశమే లేదు. మరేం చేస్తుంది? పిల్లల్ని చావ బాదుతుంది.

మరేం ఫర్వాలేదు. పోతే... ఉరి పోసుకుని ... ఛఛ! దరిద్రపాలోచన... ఆఁ! అలాంటివేం చేయదు లేద్దూ ... మహా అయితే పస్తులుంటుంది. ఉండనీ! మాయరోగమా? బియ్యం ఆదా అవుతాయి. ఆరోగ్యం మరింత వృద్ధవుతుంది.

అయినా బయల్దేరేప్పుడు పార్వతితో చెప్పాలని సిద్ధాంత మేమిటి? గుప్ చుప్ గా జారుకుని ఎవరితోనైనా కబురుచేస్తే సరి. తర్వాత!

ఈ నిర్ణయానికి రాగానే శివరావు ఇంటికొచ్చేశాడు. స్నానం చేసి గుడ్డలు కట్టుకుంటుండగా పార్వతి పెరట్లో నూతిదగ్గర బోకి రేవు పెట్టింది. చంటివాడు ఆమె పక్కనే ఆడుకుంటున్నాడు. పెద్ద పిల్లలిద్దరూ (7ఏళ్ళు, 5ఏళ్ళు) చద్దన్నాలు తిని బడికి వెళ్ళిపోయారు అంతా క్షేమే.

శివరావు కిది మంచి అదను. చేతి సంచిలో గబగబా రెండు జతల బట్టలు కుక్కేసి మెల్లగా జారుకున్నాడు.

సాయంత్రం ఏడు గంటలకల్లా శివరావు తన యజమాని దగ్గర నాలుగు రోజులు సెలవు, అరవై రూపాయలు అడ్వాన్సు సంపాదించాడు. షాపులో పనికుర్రాణ్ణి పిల్చి, తను పెళ్ళికి మద్రాసు వెళ్ళిన విషయం ఇంటిలో చెప్పి రమ్మని పంపించేసి స్టేషనుకు పరుగెత్తాడు.

తీరా స్టేషనులో కాలుబెట్టాక

ఈ పాటికి కుర్రాడు పార్వతి కీ వార్త చెప్పే వుంటాడు. పార్వతి ఎలాంటి సంచలనానికి గురయిందో?!' అనుకున్నాడు శివరావు. అలాగే నిలబడిపోయి 'బహుశా పిల్లల్ని చావగొట్టడం లేదుగదా? ... లేకపోతే ఉరి పోసుకో. .అదేం వీలులేదులే! అసలే ఇంటివి పుచ్చిపోయిన వాసాలు, పైగా ఇల్లు ఎత్తు బహు తక్కువ. ఒకవేళ నూతిలో దూకలేదుగదా? ఏమో ... ఎప్పుడూ 'దూకుతా దూకుతా' అనడమే గాని ఆ పని మాత్రం చెయ్యలేదు. అసలంత వరకూ వచ్చేవరకూ అవకాశం ఆమెకు ఏనాడూ తను కలగజెయ్యలేదు. కాని... ఈరోజున లాంటి అవకాశం కలిగించినవాడయ్యాడేమో అనుకో?' ఆట్టే ఆలోచిస్తే తను ఎప్పటికన్నా బాగా నూకుడుగా వున్న మాట నిజమే ... ఈ పరిస్థితిలో పార్వతి ఆ పని చేసినా ఆశ్చర్య పడవలసిన పని లేదు. అలాటిదే జరిగితే పిల్లల గతేమిటి? తన గతేమిటి? గతిమాట దేవుడెరుగు, లోకమంతా భార్య చావుకు కారణం తనేనని వేలెత్తిచూపిస్తారే... ఛ! అలాటిదేమీ జరగడానికి వీల్లేదు. ఆలోచించి, ఆలోచించి బుర్ర వేడెక్కింది శివరావుకు. అతని పట్టుదల సడలిపోయింది. ఇహ టికెట్టు కూడా కొనబుద్ధి పుట్టలేదు. వెనక్కి తిరిగాడు. 'నేనే ఓడిపోయాను. ఆమే గెలిచింది. ఎప్పటిలాగా ఆమెనే గెలవనీ!' అనుకుంటూ.

గబగబ నడక సాగించాడు. తన ఇల్లువుండే వీధి మలుపు తిరిగాడు. ఎక్కడెక్కడి జనం హడావిడిగా తన 'ఇంట్లోకే పరుగెత్తుకున్నారు. శివరావుకు గుండెదడ పట్టుకుంది. పరుగెత్తాడు. వీధి గుమ్మంలోనే తన పెద్ద పిల్లలిద్దరూ బ్యారే మని ఏడుస్తూ వచ్చారు. 'నాన్నా! అమ్మ' అంటూ...

● *ఇద్దరు రుమేనియన్ కార్మికులు ఫ్యాక్టరీ నుంచి ఇళ్ళకు తిరిగి వెళుతున్నారు. ఇద్దరి మొహాలు గంభీరంగా ఉన్నాయి. ఇద్దరిలో ఎవ్వరూ మాట్లాడ్డంలేదు. ఏదో ఆలోచిస్తున్నారు. చివరి కొకడు నిట్టూర్చి థుపుక్కున ఉమ్మేశాడు. రెండో వాడు కూడా వెంటనే ఉమ్మేశాడు.*

మొదటివాడు "చాలు చాలు. ఎవరన్నా చూస్తే మనం రాజకీయాలు మాట్లాడుకుంటున్నామని అనుకుంటారు"

పెరట్లో నూతిదగ్గర ముట్టూ జనం మూగివున్నారు. ఏవేవో రకరకాల మాటలు వినబడుతున్నాయి. 'జాగ్రత్తగా లాగండి' 'అరెరె! తలకి బాగా దెబ్బలు తగిలాయి' 'ప్రాణానికి మోసం లేదు గదా' వగైరాలు... శివరావు వూహించినది నిజమే! గుండెలు పగిలిపోయాయి అతనికి...

పిల్లల్ని వదిలించుకుని 'పార్వతీ! పార్వతీ! నేనే ఓడిపోయా పార్వతీ!' అని పిచ్చిగా కేకలేస్తూ నూతి దగ్గరకు పరుగెత్తాడు జనాన్ని తోసుకుంటూ.

జనంమధ్యలో గాయాలతో, అప్పుడే నూతిలోనుంచి తీయబడిన ఇంటివారి గేదె దూడ పడుకుని వుంది!

శివరావుకు మతి పోయినంత పనయింది.

చందా దారులకు మనవి

పాత చందాదారులు తిరిగి చందా పైకం పంపేటప్పుడు మీ చందా నెంబరు, అడ్రసు వివరంగా వ్రాసి మాతో సహకరించ ప్రార్థన.

మేనేజరు, 'జ్యోతి'

ఇంతలో ఇంటి యజమాని అతణ్ణి చెయ్యిపట్టుకుని వెనక్కి లాగి, ఓ మడతపెట్టిన కాగితమూ, ఇంటి తాళం చెవీ ఇచ్చాడు. 'పార్వతమ్మగారు మీకిమ్మన్నారండీ' అంటూ.

త్వరత్వరగా తాళంతీసి, పిల్లలతో ఇంట్లో ప్రవేశించి కాగితం చదవటం మొదలెట్టాడు శివరావు.

'పూజ్యులైన భర్తగారికి,

పార్వతి నమస్కారములు. నేనే ఓడిపోయాను. పెళ్ళికి ఎవరో ఒకరైనా వెళ్ళాలన్న మీరే గెలిచారు! సాయంత్రం 5 గంటలకు మా అమ్మ నాకోసం ఏభయి రూపాయిలు, పట్టుచీర తెచ్చింది. పెళ్ళికి రమ్మని గోలపెట్టింది. ఏమిటో... ఆవిడ ముఖం చూస్తే రాలేనని, రానని చెప్పలేకపోయాను. కాబట్టి మా వాళ్ళతో బయల్దేరి రాత్రి మెయిలుకు వెళ్తున్నాను. ఈ విషయం పెద్ద పిల్లలిద్దరికీ తెలియదు. ఇంకా బడినుంచీ, ఆటలనుంచీ రాలేదు. మన ఇంటాయన దగ్గర ఓ పాతిక రూపాయిలు అప్పు తీసుకున్నాను. అవి మీరు తీర్చెయ్యాలండి.'

ఇలా

మీ పాదదాసి

పార్వతి'

శివరావుకు నోట మాట లేదు. మెదడులో చైతన్యం లేదు.

□□□

మల్లాదివారి సినిమా పాటలు

టాకీ చిత్రాలు కొత్తగా వచ్చిన రోజుల్లో పాటలలో రచనాశైలి శుద్ధ గ్రాంథికంగానే వుండేది. తరువాత ఒక దశాబ్దానికి క్రమంగా మామూలు మాటలతో పాటలు వ్రాయటం అలవాటయింది. ఈ మార్పుతో పాటలు సహజత్వాన్ని సాధించినా, సాహిత్యాన్ని ఒక విధంగా మరిచినవనే చెప్పాలి. అలా కాకుండా సినిమాలకోసం వ్రాసిన ప్రతి పాటలో సాహిత్యం, సహజత్వం, సిసలైన స్నిగ్ధ సౌందర్యం మూర్తీభవింపజేసి అన్ని తరగతుల ప్రేక్షకుల, శ్రోతల, రసికుల మన్నన లందుకున్న మహనీయులు కీర్తిశేషులు మల్లాది రామకృష్ణ శాస్త్రి గారొకరే.

వారు మాటలూ, పాటలూ వ్రాసిన చిత్రాలు కొన్నే. 'రాజనందిని', 'రేచుక్క', 'శ్రీ కృష్ణరాయబారము', 'చిరంజీవులు', 'శ్రీ గౌరీ మహత్మ్యం', 'చిన్నకోడలు' మొదలైనవి. మాటలు మాత్రమే వ్రాసిన చిత్రాలు అయిదూ, పాటలు ఒకటీ రెండూ మూడూ వ్రాసిన చిత్రాలు ఒక ఐదు పదులూ వుండవచ్చు.

వారి పాటలు పాటలు కావు; కపురపు వీణెలూ, సంపంగి రెమ్మలూ, సన్నజాజి తీవెలూ, దోరవలపులూ, పాల వెన్నెలలూ, మురిపాల వెన్నెలలూ పరిమళించే దివ్య వనాలు. 'మదనుని యెదిరించు అందాలు నీవి, మనసార మురిపించు సరసాలు మావి, కామనలీడేరు ఏకాంతమోయి, కామికావోయి ఓ మోక్షగామి' (జగన్నాటకం) అని వారి కావ్యకన్యక హెచ్చరిస్తే కాదనేవాడెవడు? విరహాన వేగుచున్న ఒక విరిబాల యేమన్నది? 'లాలనగా రారారమ్మని మాలిమైన జవరాలిపైన జాలితో మరిమరి బ్రతిమాలించుకోవాలో' అన్నది (రేచుక్క). ప్రేమికుల జంట ఒకరి నొకరు 'ఒకలింత చిగురు సంపంగి గుబురు' (చిరంజీవులు) అని మల్లాది రచనలోనే సంబోధించుకో గలరు.

వారు భగవత్పరంగా వ్రాసిన పాటలు ఉత్తమ సంగీత సాహిత్య శీలలేగాక మధుర భావానికి మధురమైన నిదర్శనాలు.

లావణ్యా కుమారి


ఆంధ్రా
ప్రధమశ్రేణి కాఫీ విత్తనములను నేర్పుతో
ఎన్నికచేసి నైపుణ్యతో గింజలను మిశ్రమపరచి
అనుభవజ్ఞానముతో శాస్త్రీయముగా రోస్టుచేసి
నాణ్యతను సంరక్షించు ప్యాకింగ్‌లో
తాజాగా మీకు మార్కెట్టులో దొరుకునట్లు
సరఫరా చేయబడుచున్నది.
ఆంధ్రా కాఫీ
ఉల్లాసప్రదమైనది!
G V RAO
ఆంధ్రా కాఫీ యిండస్ట్రీ
హెడ్డాఫీసు: బ్రాడీపేట 2 లైను, గుంటూరు-2.

'తెల్లవారగ వచ్చె
తెలియక నా స్వామి
మళ్ళి పరుండేవు లేరా
మళ్ళి పరుండేవు
మసలుతూ నుండేవు
మారాము చాలింక లేరా.'
(చిరంజీవులు)

అని మేలుకొలుపుతూనే మేల మాడినా

'ఉరకమంటాడు బలదేవుడూ
ముందు రేపూటినో కానడు
అండిన వారిని నందగోపాలుడు
చిందు వేయించక మానడు'
(శ్రీకృష్ణరాయబారం)

అని ప్రేమతోనే వెక్కిరించినా

'నిన్ను తలచి గుణగానముచేసి
దివ్యనామ మధుపానముచేసి
సారసాక్ష మనసా వచసా
నీ సరస జేరగనే సదా వేదనా'
(జయభేరి)

అని నాయికాభావాన్ని రవళించినా

'పిల్లనగ్రోవి పాటకాడ
పిలచిన పలికేదాననోయ్
తలచిన వలచే జాణనోయ్'
(చిన్నకోడలు)

అని వలపుమీర పిలిచినా అది వారికే తగును. వారికి అత్యంత ప్రీతిపాత్రమయిన, వారికే వ్రాయ చేతయిన జానపద సరళిలున్న, జాను తెనుగు 'రాజనందిని'లో ప్రతిఫలించి నట్లు మరేదోటా లేదు. చూడండి.

'వెంగున యెగిరే లేడికూనను
చురకోరల పులిరాజా
యిక ఈ వేట చాలించరా'

'సిక్కేవులేరి సక్కాని రాజా
సినదాని సేతికి నీవు సిలకలాగ'

'మా సీమలో వాళ్ళ
మగల నిదరోయేవు
నీ లాంటి నాలాంటి
నిండైన సిలకలు
కోరి యెదురొస్తె
కొరతే వుండదులె'

'సన్నజాజి జాబిలిలా
యెన్నెలుండిరా
సక్కిలిగింతల సల్లగాలిలో
సంపంగి గుబాళింపురా.'

అర్థానికి, అందానికి ప్రాముఖ్యం తగ్గి అల్పత్వానికి, చవకబారు భావా నికి ప్రాముఖ్యం హెచ్చిన యీనాటి సినిమా పాటలలో వారి పాటలు యెక్కువగా వినిపించలేదు అవును మరి. వారికి చేతకానిది ఆ విధమైన పాటను వ్రాయుట.

అయినా కొందరు పండితులు, పాట వరసేకాక పదపడీ అందంగా వుండాలనుకున్న వారూ, అన్ని మాటలు అందరికీ అర్థం కావా లను

కోసం వ్రాసిన పాటలు పాటలు కావు కేవలం మాటలు పేటలు అని గ్రహించిన పూర్వీకులు, వారిచేత అడపాదడపా వ్రాయిస్తూనే వచ్చారు. ఆ కోవకు చెందినదే 'అనురాగం' లోని —

'సన్నజాజి తీవలోయ్
సంపంగి పూవులోయ్
చిలిపి సింగారులోయ్ పాపలు
సిరులొలికే సింగారులోయ్'
(యస్ 69773–78)

కుర్రకారు హాస్యానికి మెరుగు అద్దము వంటిది 'పేటలమీద పెళ్ళి' లోని 'పోయిరా మా బంగారు తండ్రీ' అనే మగవారి అంపకాల పాట. 'చిన్నారి మనసున కోరికలల్లే చిటారి కొమ్మను చెంగలించు కోయిల' పాటల్లో కన్నెమనసును విప్పిచెప్పిన పాటా ఆ చిత్రంలోనిదే. (పై రెండూ జి.ఇ. 35465). వారి హాస్యగీతాలూ, హాస్యవల్లులను ప్రేమల పొదరిళ్ళ ప్రాకించిన గీతాలూ 'దేశద్రోహులు'లో వున్నాయి. 'కన్నా కన్నాసోకే ఖరారౌనులే, ఈ చిన్నదాని పేరే హుషారౌనులే', 'ఓ రంగుల గువ్వ, రవ్వల మువ్వ, బంగరు సింగారి' (జి.ఇ. 35421) ఒకమారు వినాలి. ఆ రెండు రసాలూ వీరి కలంలో యెలా మేళవింపబడ్డాయో తెలుసుకోవాలంటే–

అదే చిత్రంలో 'మన స్వతంత్ర భారతమ్మహా' (జి.ఇ.35535) అన్నది జాతీయగీతాలలో మరపురాని మరువలేని మచ్చుతునక. సర్వమానవ సౌభ్రాత్రాన్ని పెంపొందించే స్నేహమాలిక.

కాని వారి పాటలన్నిటిలోకీ మధురతరమనిపించేది 'కలిమిలేము'ల్లో యిది.

'కొమ్మలమీద
కోతికొమ్మచ్చులాడింది
తెల్లాతెల్లని బుల్లియెండ
నేలమీద వాలింది
నాలుముగ్గు లేసింది
నల్లానల్లని బుచ్చి నీడ'
(జి. ఇ 35304)

ఎవరో అన్నట్లు సహృదయులందరూ, ఏకీభవించినట్లూ ఎండమీద వెన్నెలవంటి కవనం చెప్పగలిగినవాడు యీనాడు భువిని లేడు. దివినే వున్నాడు.

(శాస్త్రిగారి పాటలు [illegible] 'పక్కలో బల్లెం' (జి.ఇ 35512), 'రహస్యం', 'పట్నంలో [illegible]' 'లంకా దహనం' చిత్రాలలో వినవచ్చు. బ్రాకెట్లలో నంబర్లు ఉదహరింపబడిన రికార్డులు మాత్రమే యిప్పుడు దొరుకుతున్నవి.)

ప్రయాణం

(గతసంచిక తరువాయి)

స్వాములవారి మీద ఉన్న భక్తి భావంకొద్దీ మారు వాదించలేక పోయాను. ఆయన చెప్పిన దాన్ని మననం చేసుకోవటానికి ప్రయత్నిస్తానని చెప్పి నమస్కరించి ఇంటిముఖం పట్టాను.

దారిలో కాల్టెక్సు దగ్గర మూర్తి ఎదురయాడు. ఎవరికైతే దూరం కావాలనుకుంటున్నానో అతనే మరింత దగ్గిరికి వస్తున్నాడు. నిమిత్తమాత్రంగా పలుకరించాను.

'ఎండలో ఎక్కణ్ణించి వస్తున్నావ్?' అన్నాడు ఆప్యాయంగా నన్ను చూస్తూ.

'రామకృష్ణా మిషన్నుంచి'

వెంటనే అతని కనుబొమలు ముడుచుకున్నాయి.

'ఇదుగో, నీ బుర్రలో ఏదో తిరుగుతోంది. నిన్న హైదరాబాదు నుంచి వచ్చినప్పటి నుంచి చూస్తున్నాను, మనిషివి మారిపోయినట్టుగా వింతగా ప్రవర్తిస్తున్నావ్ ఏమిటి నీ ఉద్దేశం?

మాట్లాడవేం? చెప్పరాదూ నామీద ప్రేమ ఇంకేమీ లేదని. మీ నాన్న చూసిన సంబంధమే చేసుకుంటానని స్పష్టంగా చెప్పరాదూ? ఈ ముసుగులో గుద్దులాట ఎందుకూ?' మూర్తి కంఠం ఒణికింది. ఎండకి మొహం మరింత ఎర్రబడింది.

'మూర్తీ, నువ్వు ఊహించినది నిజంకాదు.'

'పోనీ, నిజమేదో చెప్పు' అని తొందర పెట్టాడు.

'సరే పద, చెబుతాను.'

అటు పక్కని ఉన్న జీడితోపుల వైపు దారితీశాడు. చాలా దూరం నడిచి బాగా నీడగాఉన్న చోటు చూసుకుని పెద్ద జీడిమామిడి చెట్టు కింద రాలిన ఆకులమీద కూర్చున్నాం. నా చేతిలోని పుస్తకాలు తీసుకుని, తలకింద పెట్టుకుని పడుకున్నాడు మూర్తి. నా చేతిని

పెద్దకథ

లాక్కుని గుండె మీద పెట్టుకున్నాడు. "ఊఁ, చెప్పు" అన్నాడు.

నా ఒళ్ళంతా జలదరించినట్టయింది. చెయ్యి వెనక్కి లాక్కోబోయాను. మరింత గట్టిగా పట్టుకున్నాడు. అతని గుండెలు తీవ్రంగా కొట్టుకుంటున్నాయి. అతని ఉచ్ఛ్వాస నిశ్వాసాలతో నా చెయ్యి కూడా కదుల్తోంది.

"మూర్తీ, హైదరాబాదు నుంచి వస్తూ దారిలో రాజమండ్రిలో ఓ పూట ఉన్నాను" అన్నాను — ఎక్కడో అక్కడ మొదలుపెట్టాలి కదా అని.

"అచ్చా! రాజమండ్రిలో ఎవరున్నారు నీకు? ఇక్కడ నీ దర్శనం లేక నేను గిలగిల్లాడి పోతూంటే నువ్వు పెత్తనాలు చేస్తున్నావన్నమాట!"

అతను నవ్వుతూనే అన్నప్పటికీ— నేనిక్కడ నిష్కల్మష ప్రేమతో నీకోసం ఎదురుచూస్తూంటే నువ్వెళ్ళి మరొకడికి శరీరాన్ని అప్పగించి వచ్చావా — అంటున్నట్టు తోచి మూర్తి కళ్ళలోకి చూడలేక పోయాను.

"రాజమండ్రిలో నా స్నేహితురాలు సుధ ఉంది. ఎవరినో దిగబెట్టటానికి స్టేషనుకి వచ్చారుట. నన్ను చూడగానే వాళ్ళింట్లో ఓరోజుండమని బలవంతం చేశారు."

"బలవంతం చేశారని ఉండిపోయావ్" అన్నాడు నవ్వుతూ.

"అంతేకాదు మూర్తీ—ఆ రాత్రి—సుధ మొగుడు — నన్ను ..." ఎంత నిగ్రహించుకుందామన్నా నా గొంతులో బాధ, భయం స్పష్టమవుతున్నాయి. ఎలా కొనసాగించాలో, ఏ మాటల్లో చెప్పాలో తెలియక తలెత్తి మూర్తి మొహంలోకి చూశాను. అతని చూపులు వేటగాడి బాణాన్ని ఎదుర్కొంటూన్న లేడి చూపుల్లా ఉన్నాయి. అతని పిడికిలి గట్టిగా బిగుసుకుంది. ఆ పిడికిలిలో నా చేతి వేళ్ళు నలిగిపోతున్నాయి. వెంటనే ఏదో మొండి ధైర్యం ఆవహించింది.

"రాత్రి నేను నిద్రలో ఉండగా—సుధ మొగుడు వచ్చి ..." నా గొంతు పూడిపోయింది. తల దించుకున్నాను. మూర్తి పిడికిలి నిస్సారమయిపోయింది. నా వేళ్ళు విరిగిపోతాయనుకున్నాను. అతని కన్నుల్లోని భయ విహ్వలతను భరించలేకపోయాను. చివరికి ప్రాణం ఉగ్గబెట్టుకుని చెప్పవలసిన మాటలు చెప్పేశాను మంత్ర ముగ్ధలా.

తక్కున నా చెయ్యి పట్టు వదలేశాడు. అతని గుండెలమీంచి నా చెయ్యి కిందికి జారిపోయింది. నాకు తెలుసు. మూర్తి కిది విద్యు

దాఘాతం. సాంప్రదాయక మయిన కుటుంబంలోంచి వచ్చిన ఎవరికైనా అది అఘాతమే. దానికి తట్టుకుంటాడని నేను అనుకోనూలేదు. చాలా సేపు అతనేమీ మాట్లాళ్ళేదు. నేను ఎండిరాలిన ఆకుల్ని చూస్తూ, అతను ఏమంటాడోనని ఎదురు చూస్తూ కూర్చున్నాను మెల్లిగాలేచి మోకాళ్ళమీద గడ్డం ఆన్చి కూర్చున్నాడు. రెండు చేతుల వేళ్ళనూ జుట్టులోనించి పోనిస్తూ "నాకెందుకు చెప్పావు రమా?" అన్నాడు. బాధగా మూలిగినట్టుంది అతని గొంతు. విశాలమయిన నుదుటిమీద అడ్డంగా మూడు గీతలు పడ్డాయి.

"చెప్పకుండా ఎలా వుండను మూర్తీ? మనస్సులో ఇటువంటి భీకర సత్యాన్ని దాచుకుని నీతో ఎలా జీవించగలననుకున్నావ్?" ఆకాశంకేసి చూస్తూ అడిగాడా ప్రశ్న.

మూర్తి సామాన్య మానవుడు. సాంఘిక నియమాలు ఎరిగినవాడు. ప్రేమించాననుకున్నవాడూ అంతకన్నా ఏమని అడుగుతాడు? పరిస్థితిని నేనర్థం చేసుకున్నాను.

"మూర్తీ, పొరపాటు పడుతున్నావు. అన్యాయంగా నిన్ను ప్రేమతోనే బంధించాలని నేను ఆశించటంలేదు. అంత స్వార్థం నాకు లేదు. నా బలహీనత వల్ల కలిగే ఫలితాలను అనుభవించడానికి సిద్ధంగానే ఉన్నాను. అందులో నిన్నిరికించటం నా అభిమతంకాదు"

"ఇప్పుడు నేనేమైపోవాలి" కళ్ళు మూసుకుని అస్పష్టంగా గొణుక్కున్నాడు. అతన్ని ఏవిధంగా సముదాయించను? చెట్టుమీది కాకి రెక్కలు విదిలించుకుని రివ్వున ఎగిరిపోయింది. చెట్టు ఆకులు కొన్ని గలగలమంటూ మామీద రాలాయి. మూర్తి ఉలిక్కిపడి కళ్ళు తెరిచి నా వంక చూశాడు. చటుక్కున నా చేతులు రెండూ పట్టుకుని "రమా, నే నేమైపోను? నువ్వు లేకుండా నే నేమైపోను?" అన్నాడు. మూర్తిని చూస్తూంటే పసిపిల్లవాడు గుర్తుకొచ్చాడు. గుండెల్లో పొదివి పట్టుకోవాలనిపించింది.

"నే నెక్కడికి పోతాను మూర్తీ! చచ్చిపోవటం లేదుకదా. కానీ జీవించలేనంత పాపం ఏముంటుంది! నీ మీద ప్రేమ ఎప్పుడూ

అబ్బూరి ఛాయాదేవి

లక్స్

నా చర్మ సౌందర్యంకోసం దివ్యమైన సబ్బు

అన్నది కాంచన



కాంచనకున్నట్లే మీకున్న చర్మసౌందర్యం
అమూల్యం ఆ సాధనమే దానికి తగినది!

లక్స్ టాయిలెట్ సబ్బు సినిమాతారలకు సౌందర్యమునిచ్చే శుభ్రమైన, స్వచ్ఛమైన సబ్బు
తెలుపులోను, నాలుగు రంగుల్లోను వస్తుంది

LTS. 190-77 TL — హిందూస్థాన్ లీవర్ వారిది

ఉంటుంది — స్థలానికీ సమయానికీ అతీతంగా ఉంటుంది."

నా మాటలు వినిపించుకోలేదను కుంటాను. మరింత ఉద్వేగపడుతూ "నువ్వు కావాలి రమా — నువ్వు కావాలి—కాని—ఇలా కాదు — ఇలా కాదు" అంటూ అరిచాడు. మూర్తి చేతుల్లోంచి నా చేతుల్ని విడిపించుకున్నాను. ఇంతటి ఆవేశపరుణ్ణీ అమాయకుణ్ణీ ఎలా ప్రేమించానా అని ఆశ్చర్యపోయాను.

"లే, మూర్తీ, పోదాం. ఆలస్యం అవుతోంది" అంటూ లేచి పుస్తకాలు తీసుకున్నాను.

జీడిమామిడి తోపులోంచి రోడ్డు దాకా మౌనంగా నడిచాం. మలుపు రాగానే, అతను ఏమో అనే అవకాశం ఇవ్వకుండా నేనే 'వెళతాను మూర్తీ, క్షమించమని అడిగే అర్హత లేకపోయినా అడుగుతున్నాను. క్షమించు' అనేసి ఇంటి దారి పట్టాను. పైన ఎండ. లోపల బాధ. ఎంత పట్టించుకోకుండా ఉందామన్నా మూర్తి ప్రవర్తన నన్ను విపరీతంగా బాధపెట్టింది. అకస్మాత్తుగా అగాధంలోకి పడిపోయినట్టుగా ఉంది. నిస్సహాయంగా అనిపించింది. కర్తవ్య విమూఢురాలినై పోయాను. మనస్సు నిర్జీవమయిపోయింది. యాంత్రికంగా నడిచి వెళ్ళాను ఇంటికి.

'అలా వున్నావేమిటే' అంది పిన్ని నన్ను చూడగానే. పుస్తకాలు బల్లమీద పడేసి మంచం మీద వాలిపోయాను.

'ఎండదెబ్బ కొట్టిందో ఏమో, లేచి వెళ్ళి మొహమూ కాళ్ళూ చేతులూ కడుక్కో రా, కాస్త అన్నం తిందువుగాని" అంది.

సమాధానం చెప్పకుండా చలనం లేకుండా చూరువైపు చూస్తూ ఉండిపోయాను. ఆలోచనలు గూళ్ళు కట్టుకోసాగాయి.

నా సంగతి వినగానే మూర్తి నన్ను ఏవగించుకుంటాడనీ, నా మీద ప్రేమ చంపుకుంటాడనీ నేను ముందే వూహించుకున్నాను. జరుగనున్న దాన్ని ఎదుర్కోవటానికి మానసికంగా సంసిద్ధురాలినయాను. కానీ, అనుకున్నదే తీరా జరిగేటప్పటికి అంతులేని బాధ. అంతరాంతరాల్లో ఇంకా "మూర్తి నన్ను అర్థం చేసుకుని నన్ను వివాహం చేసుకుంటాడ"నే ఆశ కొన ఊపిరితో ఉండటం వల్లనా? అతనిపై 'ఆశ' నాలో ఓ మూల స్థావరం ఏర్పరుచుకున్నట్లు నేను అణుమాత్రమయినా గ్రహించలేదా? లేక గ్రహించి కూడా నన్ను నేను మభ్యపెట్టుకో చూచానా? సర్వ సంసిద్ధతతో


ఎదురు చూసిన దానికి ఇంత క్షోభ దేనికి? మూర్తి నన్ను నిరాకరించినంత మాత్రాన నేను బాధపడటం ఎందుకు? నిన్న అతనికి వివాహం గురించి చెప్పినదంతా అర్ధ శూన్యమేనా? కాదు—కాదు. నే నెంతో ఆలోచించుకుని నేను సంపూర్ణంగా నమ్మిన దాన్నే అతనికి చెప్పాను. నన్ను నేను మోసగించుకోలేదు. మూర్తి ప్రవర్తన నాకనుగుణ్యంగా లేదని బాధపడటం భావ్యంకాదు. నా వ్యధకి కేవలం అహంభావం తప్ప మరో కారణం లేదు. అన్ని అనర్థాలికీ ఈ అహంభావమే మూలకారణం. దాన్ని అణుచుకోవాలి. అప్పుడే నాకు మనశ్శాంతి ... నా మనస్సులో బాధ నాకు అర్థమయిపోయింది. మనస్సు తేలిగ్గా ఉందిప్పుడు. ఎవరికోసమయితే మొన్నటి నుంచీ వ్యక్తావ్యక్తంలో సంఘర్షణకు లోనైయానో వారికి నేనక్కర్లే దిప్పుడు. నా బాధ్యత తీరిపోయింది. ఆత్మ వంచనకి గాని పరివంచనకి గాని ఆస్కారం లేదిప్పుడు. మోహం గాని ప్రేమ గాని లేదిప్పుడు. నేననుసరించదలుచుకున్న మార్గానికి అటంకాలు లేవిప్పుడు నిస్సంకోచంగా నిదానంగా వెళ్ళొచ్చును. నేను వెళ్ళాలి. వెళ్ళి తీరాలి.

మధ్యాహ్నం మూడింటికి కాఫీ తాగి కట్టుబట్టలతో బయల్దేరాను స్టేషనుకి. స్వాములవారితో కలిసి—ఆయన వద్దన్నా సరే—ఆయనతో కలిసి కలకత్తా వెళ్ళిపోవాలని బయల్దేరాను. 'లైబ్రరీకి వెళుతున్నా'నని చెప్పాను పిన్నితో. ఆఖరి బంధాన్ని తెంచుకునే సమయంలో చిన్న అబద్ధం ఆడక తప్పలేదు.

బస్సుకోసం నిలబడ్డాను. ఒకటి తరవాత ఒకటి పోటీలు పడుతూ రెండు బస్సులు కౌను వైపు వెళ్ళిపోయాయి. అటు వైపు నుంచి ఒక్కటీ రాలేదు. ఎదురు చూస్తున్నాను. హఠాత్తుగా రామ్మూర్తి గారు కనిపించారు మా రాన. నా వైపే నడిచి వచ్చేస్తున్నారు. ఈయన్నిప్పుడెలా తప్పించుకోవటం? ఒట్టి బిడ్డు మనిషి. పట్టుకుంటే వదల్డు. ఏదైనా పనిమీద ఆయన మరో వైపుకి పోతే బావుండు ననుకున్నాను.

"ఏవమ్మా, ఎండలో నిలబడ్డావ? ఎక్కడికేవిటి ప్రయాణం?" అన్నాడు నన్ను సమీపించి. నా గుండె దిగజారిపోయింది క్షణం సేపు. మొండిగా గుండె కుదుట పరుచుకుని 'స్టేషన్ కండి' అన్నాను

'మీ వాళ్ళెవరైనా వస్తున్నా రేవిటి?'



'అవునండి' అన్నాను తడుముకోకుండా. ఆమాత్రం అబద్ధం ఆడక తప్పలేదు. ఈ జనం మధ్యన ఉంటే అడుగడుగునా అబద్ధాలాడటం అనివార్యమవుతుంది. సత్యవాక్పరిపాలన కెంత కట్టుబడి ఉన్నప్పటికీ ఎదుటివారి మనస్సుకి కష్టం కలుగుతుందనో వారికి ఇబ్బంది కలుగుతుందనో ఎన్నో చిన్నచిన్న అబద్ధాలు చెప్పవలసొస్తుంది కొన్నిసమయాల్లో.

"గుడ్డిలో మెల్ల అన్నట్లు నా అదృష్టం కలిసొచ్చి కౌను వెళ్ళే బస్సు మరోటి దూసుకుంటూ వచ్చి మా ముందు ఆగింది. రామ్మూర్తి గారు చప్పున అందులోకి ఎక్కి ఓసారి వెనక్కి తిరిగి నా వైపు చూశారు—లోపలికి వెళ్ళి కూర్చునే ముందు. 'ఇంకా అడిగి అన్ని విషయాలూ తెలుసుకో లేకపోయానే' అన్న బాధ ఆయన మొహంలో స్పష్టంగా కనిపించింది! ఒకరికి అదృష్టాన్ని చేకూర్చినదే మరొకరి దురదృష్టానికి హేతువవుతుంది. ఈ లోకపు తీరే అంత. ఈ సంఘర్షణలేని స్వార్థరహిత వాతావరణంలోకి నేను వెళ్ళబోతున్నానని హాయిగా ఊపిరి పీల్చుకున్నాను. బస్సు వచ్చింది.

స్టేషనుకి వెళ్ళేసరికి రైలు వచ్చేసి ఉంది. హడావిడిగా టిక్కెట్టు కొనుక్కుని రైలు దగ్గిరికి పరుగెత్తాను

స్వాములవారు కనిపిస్తారేమోనని ఆత్రుతగా అన్ని పెట్టెలవైపూ చూస్తూ హడావిడిగా నడుస్తున్నాను. హఠాత్తుగా పరిచితమయిన నవ్వు కనిపించింది. నడక ఆపి అటువైపే చూశాను. శేఖరం నవ్వుతూ రైలు దిగుతున్నాడు. నేను తేరుకునేలోపునే నన్ను సమీపించాడు,

హలో. నేనింత అదృష్టవంతుణ్ణి అనుకోలేదు. అనుకోకుండా స్వాగతం లభించిందే!"

మర్యాద చిహ్నమయిన చిరునవ్వు నవ్వాను. అతను సూట్‌కేసూ బెడ్డింగూ దించుకుంటూంటే ఇటూ అటూ హడావిడిగా చూశాను — స్వాములవారి జాడ ఏమన్నా కనిపిస్తుందేమోనని. శేఖరాన్ని వదిలిపెట్టి స్వాములవారిని వెతకటానికి వెళ్ళలంటే ఇబ్బందిగా తోచింది. నను సన్యసించి కలకత్తా వెళ్ళిపోతున్నానని శేఖరంతో చెప్పటానికి మరింత ఇబ్బందిగా తోచింది. చేతిలోని టిక్కెట్టు చూసుకున్నాడు. ఏం చెయ్యనిప్పుడు? "పదండి" అన్నాడు శేఖరం.

నేను చెయ్యబోయే పనిని హాస్యాస్పదంగా చేసుకోవటం నా ఉద్దేశం కాదు. ఇప్పుడు కలకత్తా వెళ్ళటానికి తగిన సమయం అవునో కాదో తెలియలేదు ఎప్పుడూ ఏదో ఒక అర్థం తగుల్తూనే ఉండొచ్చును. ఈ లెక్కని ఎప్పటికి సాధ్యమవుతుంది? ఇంతవరకూ వచ్చాక ఇక వెనుదీయకూడదు. చెబితే అతను అర్థం చేసుకోకపోడు.

"ఏమిటి ఆలోచిస్తున్నారు? ఎవరికోసమన్నా ఎదురు చూస్తున్నారా? అన్నట్టు మీరు స్టేషనుకి ఎందుకొచ్చారు?"

తెగించి చెప్పేశాను. "కలకత్తా వెడదామనుకుంటున్నాను"

అతను వెంటనే ఎందుకు, ఏమిటి అంటూ గాభరా పడలేదు. తాపీగా అడిగాడు.

"నిజమా! సామానెక్కడ పెట్టారు? ఒక్కరూ వచ్చారేం? మీ పిన్ని, బాబయ్య కులాసాగా ఉన్నారా?"

వివరంగా చెప్పటం తప్పనిసరి అయింది. "రామకృష్ణా మిషన్‌లో చేరటానికి వెడుతున్నాను. అందరిలాగా మామూలు జీవితం జీవించాలని లేదు నాకు."

"మీ వాళ్ళకి తెలుసునా?" నిదానంగా అడిగాడు. చిరునవ్వు నవ్వుతూ "తెలియదనుకోండి. తెలిస్తే ఆపు చెయ్యటానికి శాయశక్తులా ప్రయత్నిస్తారు కదా" అన్నాను.

"నేనలా చెయ్యనని మీకు ధైర్యం ఏమిటి?" అన్నాడు మృదువుగ నవ్వుతూ

"మీరంత ఉద్వేగపరులు కాదను కుంటాను. సానుభూతితో అర్థం చేసుకుని నన్ను ప్రోత్సాహపరుస్తా రన్న నమ్మకం నాకుంది" అన్నాను అతని ముందుకాళ్ళకి బంధం వేస్తు న్నట్లుగా.

'నామీద ఆ మాత్రం సదభి ప్రాయం ఏర్పడింది ... అంతే చాలు ... కానీ, ఒక్క విన్నపం'

ఏమిటన్నట్లు చూశాను.

"మీతో కాస్సేపు మాట్లాడే అవకాశాన్నివ్వాలి" అని రిస్టువాచీ చూసుకున్నాడు. "ఇంకా చాలా సేపు అగుతుంది రైలు" అన్నాడు.

సరేనన్నాను. స్వాముల వారి లాగే శేఖరం కూడా సమంజసం గానూ నిర్వివాదంగానూ మాట్లాడ గలడన్న భావం కలిగింది. అతను ఏమంటాడో విందామన్న కుతూ హలం కూడా కలిగింది.

సామాను తీసుకుని రైల్వే రెస్టారెంటులోకి తీసుకు వెళ్ళాడు. హాల్లో గోడమూల రెండు సీట్లు ఖాళీగా ఉన్నాయి. అక్కడ కూర్చున్నాం. రెండు కాఫీలు ఆర్డరు చేశాడు. ఎదురుగా కొంచెం దూరంలో 'చౌదరి' నన్ను చూసి చిరునవ్వుతో పలకరించాడు. సమానంగా చిరునవ్వు నవ్వాను. శేఖరం వెనక్కి తిరిగిచూసి 'ఎవ రతను' అన్నట్లు నావేసి చూశాడు. 'మా క్లాస్ ఫెలో' అన్నాను.

'పరీక్ష లెప్పటినుంచి ? బాగా చదివారా?' శేఖరం ఆ ప్రశ్న అడగ టంలోని యుక్తిని నేను అర్థం చేసుకోక పోలేదు. నేను వెళ్ళి పోతున్నానని చెప్పిన తరవాత కూడా మామూలుగా యథాలా పంగా నా చదువు ఎలా సాగుతోం దని అడగటంలో అతని ఉద్దేశం ఏమిటో నాకు తెలుసు. అలా ఈ కబురూ ఆ కబురూ చెప్పి మరిపించ టానికి నేనేం పసిపాపని కాదు.

సర్వరు కాఫీలు పట్టుకొచ్చాడు. సిగరెట్ యాష్ట్రేలో పడేసి కాఫీ కప్పు నాచేతికిచ్చాడు శేఖరం. సర్వరు నా ఎదురుగా పెట్టిన కప్పు మరోటి ఉన్నప్పటికీ శేఖరం తన

● ఒకాయన కొత్తగా సిటీ చూడ్డానికొచ్చి, ఒక టాక్సీ యెక్కాడు. టాక్సీ తొందరగా నడుస్తోంది. దారే నడిచేవాళ్ళని హడల గొడుతూ, కార్లనీ సిటీబస్సులని దాటుకుంటూ తప్పించుకుంటూ బ్రహ్మాండమైన ప్రమాదాల్ని క్షణాల్లో తప్పించుకుంటూ.

"కొంచెం నెమ్మదిగా పోనీ అయ్యా. నేను టాక్సీ యెక్కడం కొత్త;" అన్నాడు కూర్చున్నతను.

"నాకూ కొత్తే, డ్రైవింగు." అన్నాడు డ్రైవరు.



వేలకొలది హృదయాలు ఒక్కటిగా స్పందిస్తున్నాయి.
చిన్న చిన్న వాగులు సాగర గర్భంలోకి ప్రవహిస్తున్నాయి.

విభిన్న జాతులతో కూడిన నేటి మన సంఘం కూడా యిలాగే ఉంది. ఈ మన సంఘం స్వాతంత్ర్యాన్ని గలిగి ఉండి శాంతి సౌజన్యాలతో జీవిస్తోంది. ఈ సంఘముకోసం పాటుబడి పోరాడటం, నిలబెట్టటం అవసరం. జ్ఞాపకముంచుకోండి. ఈ సంఘానికి మీరెంత ప్రధానమో మీ పొరుగువారు కూడా అంత ప్రధానమే.

భారతదేశం ఒక్కటే
భారత జాతి ఒక్కటే

DA 65 F4

ముందున్న కప్పుని తన ముందుకి లాక్కున్నాడు.

'ఈ రైలుకే నేను వెళ్ళాలి' అన్నాను - కబుర్లతో కాలక్షేపం చేసి రైలు దాటిపోయేటట్టు చేద్దామనే అతని ఉద్దేశమయితే అతని గడుసుతనానికి లొంగిపోయేటంత తెలివితక్కువదాన్ని కాదని సూచిస్తూ.

'అలాగే, తప్పకుండా వెళుదురుగాని. మిమ్మల్ని జాగ్రత్తగా రైలెక్కించే పూచీ నాది' అన్నాడు నా సంగతి పసిగట్టేసినట్టు.

తొందరపడి అనవసరంగా భుజాలు తడుముకున్నానేమో అనుకున్నాను. కాకపోయినా, ఈ సమయానికే ఇతను వాల్తేరు ఎందుకు రావాలి?

'ఏదన్నా పనిమీద వచ్చారా ఇక్కడికి? ఇంత త్వరలో వస్తున్నట్టు మొన్న నేను బయలుదేరేటప్పుడు చెప్పలేదే!' సంభాషణ అతని వైపుకి మళ్లేటట్టు అడిగాను — ఆ విధంగానైనా నా గురించి వివరాలు అతనికి చెప్పే అవసరాన్నుంచి తప్పించుకోవచ్చునని. ఎలాగో ఈ కాస్సేపూ గడిపేస్తే నేను రైలెక్కిపోవచ్చును. నన్ను బతిమాలిగాని బలవంతంచేసిగాని నా ప్రయాణాన్ని ఆపుచేసే చనువూ చొరవా అతనికి లేవు. ఆ ఆలోచన రాగానే నా గుండె కొంచెం కుదుటబడింది.

'మీతో మాట్లాడదామనే వచ్చాను'

అతని కన్నుల్లో కొంటెతనం లాంటిదేమైనా కనిపిస్తుందేమోనని చూశాను. పైకి కనిపించకపోయినా నన్ను హేళన చెయ్యటానికే ఆమాట అన్నాడని అనుమానం వేసింది.

'నేను వెళ్ళిపోతున్నట్టు కలొచ్చిందా?'

'వేళాకోళం కాదు' గంభీరంగా అన్నాడు. ఇది మరీ బావుంది! వేళాకోళం ఆడుతున్నది మధ్య నేనా!

'ఆ వేళ మీరు స్టేషనుకి చాలా ఆలస్యంగా వచ్చారు, మీతో సావకాశంగా మాట్లాడే అవకాశం లభించలేదు. ఆరోజు పొద్దున్న మీ ఇంటికెళ్ళాను-మీతో మాట్లాడదామని. మీరుఎవరో స్నేహితులతో కలిసి షాపింగుకి వెళ్ళారని చెప్పారు మీ అమ్మగారు. ఏమయినాసరే మీతో వివరంగా మాట్లాడాలనుకున్నాను. మీరన్నట్టు 'కల' రాలేదు గానీ, ఏదో అనిర్వచనీయమైన శక్తి మాత్రం నన్ను తొందరపెట్టింది,

---

● "పాపం, మీ ఆయనకి ఉన్నట్టుండి గూని వచ్చినట్టుందే! మొన్న బజార్లో వంగి నడుస్తూ కనబడ్డారు!" అన్నది సుబ్బమ్మగారు.

'గూనిగాదు. అయిదురోజుల కిందట ఆయనకి రోడ్డుమీద రూపాయి దొరికింది. అప్పట్నుంచీనూ—' అంది సూర్యకాంతమ్మ.

వాళ్లరు వెళ్ళిరమ్మని వెంటనే సెలవు పెట్టి బయలుదేరాను...'

ఇప్పుడు మళ్లీ మొదటి కొస్తాడులా ఉంది. భగవంతుడా అనుకుని టైము చూసుకున్నాను. అది గమనించనట్లు అతను వెంటనే లేచాడు. 'అమ్మయ్య' అనుకున్నాను.

కానీ, నేననుకున్నట్లు సరాసరి రైలు దగ్గరికి తీసుకుపోలేదు. వెయిటింగ్ రూమువైపు దారి తీశాడు. అతన్ని అనుసరించాను. చూస్తే అక్కడ చాలామంది జనం ఉన్నారు. 'ఇక్కడొద్దు, అలా ముందుకి పదండి' అన్నాడు. ప్లాట్ ఫామ్ చివరిదాకా వెళ్ళి అక్కడమట్టి నేలమీద పెట్టె, బెడ్డింగూ పడేశాడు. తన పెట్టె మీద నన్ను కూర్చోమని తను బెడ్డింగుమీద కూర్చున్నాడు.

జేబులోంచి సిగరెట్ పెట్టె, అగ్గిపెట్టెతీసి సిగరెట్ ముట్టించాడు. సిగరెట్ నిదానంగా కాలుతోంది. వలయాలు తిరుగుతూ క్రమంగా దూరమై గాలిలో కలిసిపోతూన్న సిగరెట్ పొగని చూస్తున్నాను. అతను నా మొహాన్నే పరిశీలిస్తున్నట్లు తోచింది. పొగని చూడటం మానేసి అతని కన్నుల్లోకి చూశాను. అతను చెక్కు చెదరలేదు. నన్నే చూస్తున్నాడు. చంద్రుణ్ణి తదేకంగా చూడగలిగినట్లు తొట్రుపాటు లేకుండా అతని చూపుల్ని తట్టుకో గలిగాను. చివరికి అన్నాడు.


'ఊఁ, అయితే మీకు జీవితం మీద విరక్తి కలిగిందన్నమాట!'

నేను సమాధానం చెప్పలేదు - అది ప్రశ్న రూపంలో లేదుకాబట్టి.

'అంత తొందరపెట్టిన కారణం ఏమిటో చెబుతారా?' దానికి సమాధానం చెప్పలేదు-ఎక్కణ్ణుంచి చెప్పాలో ఎంతవరకూ చెప్పాలో తెలియక.

'మీ కింకా నామీద తగినంత నమ్మకం కుదిరినట్లులేదు. దయచేసి నా ఉనికినీ నా వ్యక్తిత్వాన్నీ మరచిపోయి మీతో మీరు చెప్పుకుంటున్నట్టుగా చెప్పండి' మిమ్మల్ని అర్థం చేసుకోవటానికి ప్రయత్నిస్తాను. అంతకన్న నేను కోరేదేమీ లేదు.' మరొక సిగరెట్ వెలిగించాడు.

'మూర్తి మా యూనివర్సిటీలో లెక్చరర్. అతనూ నేనూ ప్రేమించుకున్నాం. వివాహం చేసుకుందామనుకున్నాం. అందువల్లనే మిమ్మల్ని ఒప్పుకోలేదు. అమ్మనీ నాన్నగార్నీ నిరుత్సాహ పరిచి, బాధ కలిగించి హైదరాబాదునుంచి వస్తూ దారిలో రాజమండ్రీలో మా స్నేహితురాలి ఒలపంతంమీద ఒక రోజుకి హోల్డింట్లో దిగాను. ఆ రాత్రి మా స్నేహితురాలి భర్త నేను నిద్రలో ఉండగా వచ్చి నన్ను స్వాధీనపరుచుకున్నాడు. ఆ విషయాన్ని నాలోనే దాచుకుని మా ప్రేమ వివాహాన్ని కలుషితం చెయ్యదలుచుకోలేదు. దాచినంతమాత్రాన నా మనస్సుగాని శరీరంగాని పరి



శుద్ధం కాలేదు. ఆత్మవంచన చేసుకోవటమే కాకుండా స్వార్థ బుద్ధితో మూర్తిని కూడా వంచించినట్లవుతుంది. అతనితో చెప్పటానికి సంశయించాను మొదట — అతను నాకు దూరమయి పోతాడేమోనన్న భయంతో. మనస్సులో కొంత సంఘర్షణ జరిగిన తరవాత మరో మార్గం స్ఫురించింది. అతనితో అసలు విషయం చెప్పకుండా కేవలం నేను వివాహం చేసుకోదలుచుకోలేదని చెప్పి రామకృష్ణుని మార్గాన్ని అనుసరించాలని నిర్ణయించుకున్నాను. స్వార్థంకోసం మూర్తిని మోసగించిగాని, ఒప్పించిగాని వివాహం చేసుకునే బదులు ఈ మార్గం ఉన్నతమయినదిగా తోచింది. మూర్తికి నా ఉద్దేశం చెప్పాను. అతను అర్థం చేసుకోలేదు. వివాహం ఎందుకు చేసుకోదలుచుకోలేదో చెప్పమని నిలదీశాడు. అసలు సంగతి చెప్పాను. అతను — నీళ్ళకుండీలో పడ్డ ఎలుకపిల్ల గట్టు మీదికి రాలేక, లోపల నీళ్ళలోకి పోలేక గిలగిల్లాడినట్లు బాధపడ్డాడు. అతని మానసిక బలహీనత చూశాక మరింత విరక్తి పుట్టింది.'

ఆఖరి దమ్ము పీల్చి సిగరెట్ అవతలికి విసిరేశాడు శేఖరం. పొగ పక్కకి తప్పుకుంది. నిశ్చలంగా నాకేసి చూస్తూ అన్నాడు. 'అంతా బాగానే ఉంది. కాని, మీరు వేదాంత మార్గాన్ని అనుసరించవలసిన అగత్యం ఏమిటి? వివాహం చేసుకొని తీరాలని లేదు. అలాగని సన్యాసం పుచ్చుకోవాలని ఎక్కడా లేదే...'

నా పెదిమలు కదిలాయి. నన్ను

ఏమీ చెప్పనివ్వకుండా అతనే మళ్ళీ అన్నాడు.

'మీరు శరీర పారిశుధ్యం' 'ఆత్మ వంచన' అంటూ చాలా మాటలు వాడారు. అసలు పారిశుధ్యం అంటే ఏమిటి? శరీరాన్ని నిర్బంధంలో పెట్టినంత మాత్రాన పరిశుద్ధంగా ఉన్నట్లేనా? మనస్సు మాటేమిటి? మనస్సులోని ఆలోచనలు పరిశుద్ధంగా ఉంచగలరా? ఏదో బలీయమైన కారణాంతరాల వల్ల బ్రహ్మచర్యం అవలంబించినంత మాత్రాన 'నేను బ్రహ్మచారిని' అన్న స్పృహ అతనికి లేకుండా ఎలా ఉంటుంది! అంటే కేవలం బాహ్య పరిస్థితులవల్ల శరీరాన్ని నిర్బంధంలో ఉంచాడన్నమాటే కదా. ఎవరైనా ఆకర్షణీయమైన స్త్రీని చూడగానే తాత్కాలికంగా అతని మనస్సు చలించవచ్చు. కానీ, అతను సాధన చేసి అలవరచుకొన్న సంస్కారం, ఆత్మశిక్షణ—శరీరాన్ని అదుపులో ఉంచగల శక్తిని అతనికిస్తాయి. 'నేను బ్రహ్మచారిని' అన్న స్పృహ ఉన్నంతకాలం 'పారిశుధ్యం' అనే పదానికి అర్థం లేదు. ఆ 'స్పృహ' శరీరాన్ని నిర్బంధించినంత కాలం ఉండి తీరుతుంది. అలాగే పాతివ్రత్యమూను. పాతివ్రత్యం అలవరచుకుంటే వచ్చేది కాదు. పతివ్రతగా ఉండాలి అనుకున్నంత మాత్రాన పాతివ్రత్యం సిద్ధించదు. మీరిప్పుడు సన్యాసం పుచ్చుకుని వస్త్రాలను కుంటున్నారు. ఆ తరవాత- ఎందువల్ల సన్యాసం పుచ్చుకున్నారో ఆ కారణం మీ మనస్సు

లోంచి తప్పుకుంటుందా? ఆ 'స్పృహ' మీలో ఉన్నంతకాలం మీ సన్యాసానికి అర్థంలేదు.

మరో విషయం చూడండి — మీ స్నేహితురాలి భర్త చేసిన పనిని మీరు ఏవగించుకుంటున్నారు. రెండు కారణాలవల్ల — ఆ పని సాంఘిక నీతి నియమాలకు విరుద్ధం కావటంవల్లనూ, మీ మనస్సంతా మూర్తివైపు మొగ్గి ఉండటం వల్లనూ. అవునా? మీరు కారులో రోడ్డుమీద పోతూంటే ఎదుటి నుంచి ఎవరో నియమాలకు వ్యతిరేకంగా మరో కారు నడిపించుకుంటూ వచ్చి మీ కారును ఢీ కొంటాడు. మీ కారు దెబ్బతింటుంది. మీరు మాత్రం సరియైన మార్గాన్నే నియమ బద్ధంగానే వెళ్ళారు. అయినా మీ కారు పాడైంది. అక్కడ మీ మనస్సు 'నియమోల్లంఘనం' గురించి బాధపడవలసిన అవసరం లేదు కదా. కారుని బాగు చేయించుకుంటారు — అంతే. ఆ కారు నిరుపయోగం అని తేలితే మరో కొత్త కారు కొనుక్కుంటారు. లేకపోతే మరో వాహనంమీద ప్రయాణం చేస్తారు. లేదా, కాలి నడకని పోతారు. అంతే కాని ఆ రోడ్డుమీంచి ఇంకెప్పుడూ పోనని మూర్ఖంగా పట్టు పట్టరు కదా!...'

'ఇంతకీ ఏం చెబుదామని ఇతని ఉద్దేశం?' అనుకున్నాను.

'రమా...'

ఆశ్చర్యంగా అతని వైపు చూశాను. ప్రప్రథమంగా నన్ను చనువుగా సంబోధించాడు.

'నీకు తెలివితేటలున్నాయి, అందుకే నీమీద నాకు గౌరవం. అభిమానం. నువ్వు చదువుకుని శాస్త్ర పరిశోధన చేసి పైకి రాగల స్తోమత ఉన్నదానివి. నువ్వు వృథా అయిపోవటం నా కిష్టం లేదు. పరీక్షలయిపోగానే హైదరాబాదు రా. ఈ లోపున నీ రిసెర్చికి అమెరికాలో స్కాలర్‌షిప్ కోసం ప్రయత్నిస్తాను. దొరక్క పోదు. లేకపోయినా ఎలాగో అలా సాధించి వెళ్ళేటట్లు చేస్తాను. నువ్వు నా కూడా ఉండి నాకు చేదోడు వాదోడుగా ఉండి శాస్త్రపరిశోధనలో కృషిచేస్తే మనం సాధించలేనిది ఉండదు. నీ తోడు కావాలి నాకు. జీవన సహచరులుగా ఉండటానికి ఆడపిల్లలు అనేక మంది దొరుకుతారు. కానీ నీలాగ ఆలోచనాశక్తి ఉన్న ఆడపిల్ల దొరకటం అరుదు. అరుదైనదే నాకు కావలసినది. ఇంతకాలం నేను ఆగినది కూడా అందుకే.'

'నాకు జరిగిన సంఘటన విషయంలో?' అని అడిగాను.

'అటువంటి అల్ప విషయాల గురించి నేనెప్పుడూ ఆలోచించను. నాకా ఆసక్తిలేదు'

'అంతే, నీతి నియమాలంటే లెక్క చెయ్యరా?'

'చెయ్యనని కాదు. ఆ మాట కొస్తే ఆడవాళ్ళమీదే నాకు పెద్ద ఆసక్తి లేదు.' అంచేత నేను అటువంటి పని చెయ్యటానికి ఆస్కారం లేకపోయిం దింతవరకూ. ఒకవేళ ఎవరైనా 'తప్పు పని' చేసినా వాళ్ళని నడివీధిలో నిలబెట్టి అగ్ని సంస్కారం చెయ్యాలనే తత్త్వం కాదు నాది. నా ఆలోచనలూ ఆశయాలూ వేరే స్థాయికి చెందుతాయి.'


'మీ ర్నన్నెప్పుడూ ప్రేమించలేదు' అన్నాను.

'నిన్ను ప్రేమించానని నేనూ అనలేదే. 'ప్రేమ' అని ఈ రోజుల్లో వాడుతూన్న పదానికి అర్థంలేదు. చూడగానే కలిగే భావం ప్రేమ కాదు. పైపై పరిచయాలతో ఏర్పడే స్నేహమూ ప్రేమ కాదు. అది మోహమయినా అవుతుంది. ఆకర్షణ అయినా అవుతుంది. ప్రేమ అనేది రక్తసంబంధం వల్ల కలుగుతుంది. లేదా, సహజీవనంతో పుట్టి పెరుగుతుంది. 'ప్రేమ వివాహం' కానంతమాత్రాన మన తల్లిదండ్రులకి ఒకరిపై నొకరికి ఉన్న అనురాగం ప్రేమ కాదనగలవా? వాళ్ళ ముప్ఫయ్యేళ్ళ కాపురంతో వాళ్ళు సాధించినది అదే. ఏదో ఒక ధ్యేయం పెట్టుకుని సహజీవనం చెయ్యటంలో ప్రేమ ఆవిర్భవించి క్రమక్రమంగా విస్తృతమవుతుంది. అల్ప వయస్సులో వచ్చే మనస్పర్థలకు అప్పుడు విలువ ఉండదు. అటువంటి ప్రేమ అన్ని ఒడుదుడుకులకూ తట్టుకో గలుగుతుంది. తగిన వ్యక్తిని ఎంచుకుని సహజీవనం ప్రారంభిస్తే ప్రేమ గురించి ప్రత్యేకంగా ఆలోచించవలసిన అవసరం ఉండదు. 'తగిన వ్యక్తిని' ఎంచుకోవటంలోనే తొందరపడకూడదు. ఇన్నాళ్ళు నీ కోసం ఆగినందుకు నేను విచారించటం లేదు...'

ఇటువంటి మాటల కోసమే మూర్తిలో వెతికాను. నన్నొక 'వ్యక్తి'గా గుర్తించి నన్ను గౌరవించగల సహచరుని కోసమే మూర్తిలో వెతికాను, ఇంకా అన్వేషణలో ఉండగానే 'ప్రేమ' అనే పొగమంచు నా దృక్పథాన్ని కప్పేసింది. ఆ పొగమంచు వెనుక నా ఆశయం కరిగిపోయినట్లుగా శేఖరం మాటలు నాకు కనువిప్పు కలిగించాయి. నా సాహచర్యాన్ని వాంఛించే వ్యక్తిని స్పష్టంగా గుర్తించాను.

రైలు కూత వినిపించింది. నేను కదల్లేదు. మరొకసారి హెచ్చరించి రైలు కదిలింది. నేను చలించలేదు. రైలు నా ముందు నుంచి సాగిపోయింది.

(సమాప్తం)


మధ్య ప్రదేశ్ జానపద కథ
మధ్యప్రదేశలో ఒక జాలరి ఉండే వా-
ఒకనాడు అతని వలలో ఒక సారా బుడ్డి దొరికెను
ఒక భూతము వచ్చి నేను మీ సేవకుడను ఆజ్ఞాపిస్తే నెరవేర్చుతాను నా పని ఏమి సెలవు అనెను
మహత్తరమైన మద్యము తెమ్ము-
ఇంకొక బుడ్డి
ఈ మద్యము దివ్యముగానున్నది మరియొక బుడ్డి, వేరొక బుడ్డి కూడా తెమ్ము" అనెను
బుడ్డి కూడా ఉండాలి మళ్లీ త్రాగటం అవసరం అవుతుందిగా మరి'

చరిత్ర శకలం

కె. వివేకానందమూర్తి



ఉన్నట్టుండి ఏదో భరించలేని శబ్దం గుండె బ్రద్దలు వేసింది అధిగమించిన వేగంతో పరిగెత్తుతున్న బస్సు ప్రయాణీకులందర్నీ ఒక్కసారి కుదిపి, బాణం తగిలిన పక్షిలా కీచు అరిచి హఠాత్తుగా ఆగిపోయింది

డ్రైవరు కిందికిదిగేడు. చక్రాల వేపు వొంగి పరిశీలనగా చూస్తూ అన్నాడు - 'గిగండి! బండి దెబ్బ తింది'

కండక్టరు కూడా దిగిచూసేడు. అదేమాట తనూ చెప్పేడు. ప్రయాణీకులందరం క్రిందికి దిగేం. వెనుక వైపు వెలికివచ్చిన చక్రాల కేసి చూస్తూ - డ్రైవరు కండక్టరుతో ఏదో మాట్లాడుతున్నాడు. ఓ ముసిలాయన కండక్టర్ని అడిగేడు - 'రిపేరీ వొచ్చిందేవిటి?'

'మరేనండి'

'ఇప్పుడప్పుడే కదల్దేవిటి?'

'కదల్దండి' కండక్టరు ఏదో హామీ యిస్తున్నట్లు చెప్పేడు.

'అస లేవైందేవిటి?' మళ్ళీ అడిగేడు ముసిలాయన.

'ఎనక సెక్రాలు దెబ్బతిన్నాయ్- నాలుగ్గజాలు ఎదర కెళ్ళిపొస్తె బండి తిరగపడి పోనేది. దేచి నే శ మంచిది.'

'సైడు మిర్రర్లోంచూ సేను. రెండూ ఎలిపికొచ్చీసియ్.' డ్రైవరు తన సామర్థ్యాన్ని ప్రకటించుకున్నాడు. ముసిలాయన ముక్కుమీద వేలేసుకున్నాడు. ఆయన భార్య కాబోలు - గుండెల మీద చెయ్యి పెట్టుకుంది. ఆ చెయ్యి క్రింద మంగళసూత్రాలున్నాయి.

ఎవరో మరోవ్యక్తి అన్నాడు. 'ఎంత ప్రమాదం తప్పింది!'

'ఇప్పు డేంచెయ్యడం?' మరో ఆసామీ ప్రశ్నించేడు.

'చక్రాలు ఫిరాయించాలండీ.' డ్రైవరు జవాబు చెప్పేడు.

'ఎంతసేపవుతుంది?' నే నడిగేను.

'సెప్పలేనండి, యిటు పొచ్చే లారీ ఏదన్నా అపుసేసి వొయిజాగెల్లి హెడ్డాపీసుకి రిపోర్ట్రిస్తె. స్పేరు బండో; రిపేరికి జీపో తోల్తారు. నే నెల్లాలి-అల్లు రావాలి. ఫిటింగిచ్చాక బండి కదలాలి. ఏటి సేత్తాంలెండి? నయ్యం! పేణాలు దక్కేయ్!' డ్రైవరు జవాబు చెప్పేడు.

'మళ్ళీ ఎవరో విద్యార్థి అడిగేడు- 'మరయితే అందాకా రాంభజనే అన్నమాట?'

'మరి తప్పదండి. లేటవుద్ది సేనా' అన్నాడు కండక్టరు.

అప్పటికే జనం చాలామంది నట్టూరా చెట్లక్రిందికీ, పచ్చిక మీదికీ చెదిరిపోయేరు. రాంభజన చేస్తానన్న విద్యార్థి కూడా, మరో నలుగురు మిత్రబృందంతో కలిసి కాస్త దూరంలో మెత్తటి గడ్డిమీద బైఠాయించేడు. భజన మొదలు పెట్టేందుకేమో - జేబుల్లోంచి చిడతలు తీస్తారు లావుంది అనుకున్నాను. కాని పేక తీసి ఆట పరిచేరు - చప్పుడులేని భజన!

వొంటరి ప్రయాణీకుణ్ణవడం వల్ల నా కేమీ తోచడంలేదు.

కాస్సేపటి క్రితం బస్సులో కూర్చుని మరో రెండు గంటలకల్లా విశాఖ పట్నంలో కాఫీ తాగొచ్చు నను కున్నాను. తీరా యిప్పుడు కాఫీ తాగడం కోసమే ప్రాణాల్తో మిగిలి నట్టయింది. చేతి వాచీ చూసు కొన్నాను. నాలుగైంది. సాయం త్రపు చల్లదనం కొంచెం కొంచెం తెలుస్తోంది. ఎండలో తారురోడ్డు ఎంచక్కా మెరుస్తోంది. రోడ్డు కిరువైపులా పచ్చని చెట్లూ, పొలాలూ, పొదలూ, దూరాన ఎత్తుగా కొండలూ, యింకా ఎత్తుగా వంగిన ఆకాశం—ప్రకృతి అందం ప్రయాణంలో బాగా కనబడు తుందనుకుంటూ.

రుమాలుతో ముఖం తుడుచుకుని దూరంగా చూసేను. చెట్లమధ్య ఏదో చిన్న పల్లెటూరు కనబడింది. దాదాపు మైలు దూరం వుండొచ్చు. ఎలాగో అలా నాకూ కాలహరణం చెయ్యాలనుంది మెల్లగా కదిలేను. పిల్లగాలి పీలుస్తూ, పిల్ల కాలువ గట్లు దాటుకుంటూ నెమ్మదిగా నడి చేను. అరగంట గడిచేసరికి ఆ వూళ్ళోకి అడుగు పెట్టేను.

బాగా చిన్న వూరులా ఉంది. బహుశా వెయ్యి గడప వుంటుందేమో యిళ్ళన్నీ దాటుకుంటూ మట్టిరోడ్డు మీద మరో నాలుగు నిముషాలు నడిచేక చెరువొకటి కనబడింది. చెరువు కిపతలగా ఒంటిగా, వెలి వేయబడినట్టున్న ఒక పాత పెంకు టిల్లు జబ్బుమనిషిలా నిలబడివుంది. దాని కెదురుగా చిన్న ఖాళీ స్థలం ఉంది స్థలమంతా పచ్చిక మొలి చింది

బాగా నడవడంవల్ల కాళ్ళు పీకుతున్నాయి. అక్కడికి పోయి కాస్సేపు కూర్చుందా మనిపించింది. అటువైపు కదిలేను. పచ్చికలోకి అడుగు పెట్టగానే స్థలం మధ్యగా ఏదో నా దృష్టి నాకర్షించింది. చక చకా అక్కడికి వెళ్ళేను. అది ఏదో మహాశిల్పం తాలూకు అవశేషం. మోకాళ్ళ క్రిందికి విరిగిపోయి మిగి లిన పాదాల జంట అది. రాతిమీద చెక్కడం. అందమైన ఆభర ణాల్నీ, క్రిందికి జారిన వస్త్రాన్నీ ఆకర్షణీయంగా అలంకరించి మలిచేరు. అది ఏనాటి శిథిలమో!— దానిలో యింకా నాజూకుతనం తొణికిస లాడుతోంది. పవిత్రత వుట్టిపడు తోంది. ఎవరో మహత్తర శిల్పస్రష్ట చేతుల్లో సృష్టింపబడినట్టుంది అది. ఇంతకుముందు నేను మొహంజొదారో, హరప్పా శిథిలాలు చూసేను. అజంతా ఎల్లోరాలు చూసేను. 'అమరశిల్పి జక్కన' సినిమా కూడా చూసేను నాకు శిల్పాలంటే పిచ్చి. ఆ పాదాల్ని చూడగానే, నే నింత వరకూ చూడని గొప్ప శిల్పితనం నాకు వాటిలో కనబడింది. ఇష్టంగా వాటిని చేతుల్తో ముట్టుకు చూసేను. అరగంటసేపు చూసేను— నడిచినంత సేపు. ఆ స్త్రీమూర్తి పాదాలు నా కెంతో నచ్చేయి. నా కప్పు డనిపిం చింది—ఆ పాదాలు ధరించే పూర్తి

విగ్రహం చూడగలిగితే ఎంత బాగుణ్ణో కదా— అని. కాని, ఆ అవకాశం నాకు దక్కలేదు. కేవలం శిథిలం మాత్రం చూడగలిగేను. అది నా మనస్సులో ముద్ర వేసింది. దాని పూర్తి స్వరూపాన్ని చూడలేకపోయినా, కనీసం దాన్ని మలిచిన 'మహాశిల్పి' నేనా చూసి తీరాలనిపించింది. ఆయనది బహుశా ఈ వూరే అయ్యుంటుంది. ఆయనిక్కడివాడే అయ్యుంటాడు— అనే వూహాలు నాలో కలిగేయి. ఆయన్ని కలుసుకుని, మనసారా అభినందించే భాగ్యం కలిగితే బాగుణ్ను అనుకున్నాను.

వంగినవాణ్ని లేచి నిలబడ్డాను. వూళ్ళో వాకబు చేద్దామని వెనక్కి తిరిగేను. ఎదురుగా పాత పెంకుటింట్లో ఎవరో నివాసం వున్నట్టు తోచింది. ముందు అక్కడికి పోయి అడిగిచూస్తే సరి— అనుకుని ఆ యింటివేపు దారితీశాను. ఇల్లు సమీపిస్తున్న కొద్దీ, నా మనస్సు నీడలో ఆ శిథిలం యింకా స్థిర పడుతోంది. దగ్గర కొచ్చేను. ఇల్లు కూడా శిథిలావస్థలోనే వుంది. విరిగిపోయిన నాగరికతా చిహ్నంలా, చితికిపోయిన అంతస్తుకి ప్రతీకలా కనబడింది. వానొచ్చినప్పుడు కాళ్ళు బురద కాకుండా యింటిముందు నాపరాతి ముక్కలు పరిచేరు. నేల బాగా వున్నా వాటి మీదుగానే నడిచి, అరుగులమధ్య మెట్లెక్కేను. తలుపటూయించేక తలుపుతట్టేను. సమాధానం లేదు, నెమ్మదిగా నెట్టేను. దగ్గరగా జేరవేసిన తలుపు, సన్నటి శబ్దంతో తెరుచుకొంది. తల ముందుకివొంచి లోపలికి చూసేను. చాలా పెద్ద గది. హాలనుకుంటా. జీర్ణావస్థలో ఉంది. గోడలకి అక్కడక్కడ బెల్లులూడిపోతే మట్టి రాసేరు. ఓ పక్కగా చాంతాడుతో దణ్ణెం కట్టేరు. దానిమీద ఒక వెలిసిన

మందమతి ప్రొఫెసరుగారు, రైల్లో ప్రయాణంచేస్తూ పుస్తకం ఏదో చదువుకుంటూ, అందులో మునిగిపోయి, సర్వం మరిచిపోయాడు. ఇంతలో టిక్కెట్ కలెక్టర్ చెకింగ్ కొచ్చేడు. ప్రొఫెసరుగారు జేబులన్నీ గబగబా వెతికి, కంగారుపడి, టిక్కెట్టు కనబడక తెల్ల మొహం వేసి, కొసకి ఏడుపు మొహమే పెట్టేశాడు.


టిక్కెట్ కలెక్టరు ఆయన అవస్థ చూసి భరించలేక 'పోనీలెండి సార్ ఫరవాలేదు. మీరు టిక్కెట్టు కొనే వుంటారు. నాకు తెలుసులెండి. నిశ్చింతగా ప్రయాణం చెయ్యండి' అన్నాడు.

'అది సరే— మరి— మరి నే నెక్కడ దిగడం?—' అన్నాడు ప్రొఫెసరుగారు.

చీరె, ఒక వెలవని జాకెట్టూ, యింకా ఏవో పాతబట్టలూ, పేద బట్టలూ వరేసి వున్నాయి. ఏవో నాలుగైదు అందమైన శిల్పాల్ని గోడలు భరించ గలుగుతున్నాయి. క్రిందగోడ వారే బల్ల లుపరిచేరు. ఆ బల్లలమీద పెద్దవి, చిన్నవి రకరకాల చెక్కటిశిల్పా లెన్నో వున్నాయి. వాటిలో చాలాభాగం స్త్రీ మూర్తులు. మిగతా వాటిలో రెండు ముసిలి గాంధీలు, నాలుగు పడుచు గోపికలు—మధ్య ఒక చిలిపి క్రిష్ణుడు, హృదయం లేకుండా తల మాత్రమే వున్న హిట్లరు, చెయ్యి విరిగిన ఛత్రపతి శివాజీ, జూలు మాసిన సింహమూ మొదలైనవి వున్నాయి. క్రిష్ణుడి చేతిలో పిల్లనగ్రోవి లేదు. విరిగిపోయిందనుకుంటూ — ధ్యానం చేస్తున్నట్టున్నాడు. సింహం నోట్లో బూజు పట్టింది. ఓ గోపికకి రొమ్ముల మధ్య లోయగా జారిన చోటు బీటు తీసింది — క్రిష్ణుడిమీది ప్రేమకి గుండెలో చోటు చాలక హృదయం పగిలినట్టు. అన్ని శిల్పాలూ అద్భుతంగా వున్నాయి నాకు. అపూర్వమైన ఆ శిల్ప సంపదని కాపాడేందుకని, తాపత్రయంతో మిగిలినట్టుగా వుంది హాలు. ఋతు పవనాల తాకిడికీ, సూర్యుడు విసిరిన నిప్పులకీ ధైర్యంగా ఎదురు నిలిచి, చివరికి జవం విడిపోగా అసందర్భంగా క్రిందికి వొదిగిన యింటి పైకప్పు, నడుం విరిగిన పాక్ సిపాయిని గుర్తు చేస్తోంది.

నే ననుకున్న యిల్లు యిదే అయి వుంటుందని నిశ్చయించుకొని లోపలికి అడుగెట్టేను. విసనకర్ర శబ్దం వినిపించింది. హాల్లోకి సన్నటి పొగలు ప్రవేశిస్తున్నాయి లోపల వంట గదిలో ఎవరో పొయ్యి రాజేస్తున్నట్టుంది. తల పక్కకి తిప్పేను. వీధి వైపున్న గోడవార, కిటికీ పక్కగా నున్న పాత మంచ మీద ఒక వ్యక్తి పడుకుని వున్నాడు. బహుశా నే చూడాలనుకునే 'మహాశిల్పి' యీ వ్యక్తేనేమో! నన్నాయన గమనించ లేదు. తెరచివున్న కిటికీగుండా బయటికి చూస్తున్నాడు. దాదాపు అరవై ఏళ్ళ వయసుండొచ్చు. ఇంటి లాగే తనూ శుష్కించి వున్నాడు సాయంత్రపు వెలుగులో ఆయన పెద్ద గడ్డం వెండిలా మెరుస్తోంది మీసాలకీ, గడ్డానికీ నడుమ దాగి వున్న సన్నటి పెదాల కలయికలో, అనుభవాలు మిగిల్చిన గర్వం ఏదో వొంపు తిరిగినట్టుంది. లోతైన ఆయన కళ్ళలో లోయల్లో దాగిన ప్రశాంతత కనబడుతోంది. అంత వయసొచ్చినా, ఆ కళ్ళలో చురుకుదనం చచ్చిపోనందుకు కాస్త ఆశ్చర్యమేసింది. అలా ఒక్క క్షణం చూసేక నాకాయన అంపశయ్యమీద పడుకొన్న భీష్ముడిలా అగుపించేడు.

ఇంకా అక్కడ నా ఉనికి గుర్తింపబడక పోడంలో నా 'మహాశిల్పి'మీద నాకు ఆత్రుత పెరిగింది. చిన్నగా దగ్గేను. ఆయనకు వినబడి



నట్లుంది. 'ఎవరూ?-' అంటూ తల నాకేసి తిప్పిచూసేడు. నేనుమంచం దగ్గరికి నడిచి 'నేనండీ!' అని పేరు చెప్పేను. ఆయన యింకా ప్రశ్నార్థకంగానే చూసేడు. నేను మళ్ళీ చెప్పేను— 'నేనీ ప్రదేశానికి చాలా కొత్తవాణ్ని. విశాఖపట్నం వెళ్తూంటే దారిలో ఈ వూరిదగ్గర హాఠాత్తుగా బస్సు పాడయింది. రిపేరు చేస్తున్నారు. నాలుగ్గంటలు పైగా ఆలస్యం ఉందిట. ఎందుకో ఈ వూరు చూసిపోదామని సరదా పుట్టింది. ఇలా వచ్చేను-' 'వచ్చేక' అని నేను యింట్లోకి ప్రవేశించిన కారణం చెప్పబోయేంతలో, ఆయన 'అలాగా అబ్బాయ్! చాలా సంతోషం!' అన్నాడు. 'అమ్మాయ్! కాసిని మంచినీళ్ళు పట్టుకు రామ్మా!' అంటూ కూతుర్ని కాబోలు - పిలిచి నావైపు తిరిగేడు. ముఖంలో ఎంతో అనుభవం, పరిజ్ఞానం, స్వచ్ఛత వుట్టిపడుతున్నాయి. ఏదో గొప్ప కుటుంబంలో వుట్టి, చివరికి చితికి పేదవాడై పోయిన వ్యక్తిలా వున్నాడాయన. కూర్చోమని చెప్పేడు. మంచం పక్క నేవున్న పాత కుర్చీలో కూర్చున్నాను.

శిల్పాలకేసి చూస్తూ నేనన్నాను- 'నిజంగా యీ రోజు నేను చాలా అదృష్టవంతుణ్ని. ఇక్కడ మీ యింట్లో అద్భుతమైన శిల్పాలెన్నో చూడ గలిగేను. నాకు శిల్పాలంటే చచ్చేపిచ్చి. మొదట్లో బయటి నుంచి యీ యిల్లు చూసినప్పుడు, యీ లోపల యింత శిల్ప శోభ వుంటుందని వూహించలేదు. అపూర్వంగా వున్నాయివి. ఇవన్నీ చూస్తూంటే — ప్రయాణీకుల బస్సులు యిలాగ అప్పుడప్పుడు

పొడవుతూ వుండాలనిపిస్తోంది నాకు.'

ఆయన భళ్ళున నవ్వేడు. ఆ నవ్వులో సంతోషం కంటే గర్వమూ, తృప్తీ కలిసి కనిపించేయి. నా కెందుకో యిల్లు కూలి పోతుం దేమోనని భయమేసింది. కప్పు కేసి చూసేను.

ఆయన నవ్వు పూర్తిచేసి, నా మోకాలి మీద చెయ్యి బలంగా మోపేడు – 'బాగుందబ్బాయ్! ఇన్నాళ్ళకి నా శిల్పాల గొప్పతనం చవి చూడగలిగిన మనిషి నా దగ్గరికి వచ్చినందుకు నాకు పరమానందంగా వుంది' అన్నాడు. 'నా కళ కూడా నా లాగే ముసిలిదై పోయిం దను కున్నాను. లేదు. అదింకా పడు చుగా బ్రతికే వుంది. ఎప్పటికీ అలాగే వుంటుంది. చరిత్రలో నా శిల్పాలు నాలుగు కాలాలపాటు నిలుస్తాయి. చాలు. అది చాల బ్బాయ్! అదే నా క్కావలసింది.' ఆయనలో వుద్రేకం కనబడింది.

వెంటనే నాకు నా 'మహాశిల్పి' యీ వ్యక్తేనని తెలిసింది. ఆయన మీద పూజ్య భావం ఏర్పడింది. నాలో ఆయనంటే ఎంతగానో ఆసక్తి పెరిగింది. సాటిలేని తన అభిమాన తార దర్శనభాగ్యం లభిం చిన మూడవ తరగతి ప్రేక్షకుడికి కలిగే అనుభూతిలాంటి అనుభూతి, యీ క్షణం ఆయన సమీపంలో నాకు కలిగింది. నా జన్మ చరితార్థ మైనట్టు భావించేను. మీకు నవ్వు రావొచ్చు. కాని నాకు శిల్పా లంటే అంత పిచ్చి!—

ఇంతలో 'మహాశిల్పి' కూతురు మంచినీళ్లు తెచ్చియిచ్చింది. ఆమె లోపలికి తిరిగి వెళ్తోన్నప్పుడు చూస్తే ఆయన చేతిలో ప్రాణం పోసుకున్న శిల్పం ఏదో కదిలి నట్లనిపించింది నాకు. మెరిసేలా తోమిన గ్లాసుమీద కదిలిపోయే ఆమె రూపం చిత్రంగా సాగి మెరి సింది.

ఆమె లోనికి వెళ్ళేక, ఆయన్ని పేరడిగేను. చెప్పేడు. మనిషికి తగ్గ పేరు – నరసింహాచార్యులు.

మంచినీళ్ళు త్రాగుతూ అను కున్నాను– ప్రతి గొప్ప కళాకారుని సృష్టిలోనూ అతడికిష్టమూ– యిష్టమూ, ఓర్పూ – నేర్పూ అన్ని టినీ మేళవించుకొని వెలసిన కళా ఖండం ఏదో వొకటి వుంటుంది.

● 'ఆదేమిటి, కారుకి రంగులు చిత్రంగా వేయించావ్! ఈ వేపు నీలం, ఆ వేపు ఎరుపు?'

'అంతే ఏదేనా యాక్సిడెంట్ జరిగినాక, కోర్టులో కారు ఏరంగుదో చెప్పమంటే కొందరు నీలం అనీ కొందరు ఎరుపనీ – ఇలా అనేసరికి కేసు తేలిపోవాలని!'

అలాగే యీ నరసింహాచార్యులు గారికికూడా ఏదో వొక మాస్టర్ పీస్ వుండే వుంటుంది అనిపించింది. మంచినీళ్ళగ్లాసు క్రిందపెట్టి, ఆయనకి నా వుద్దేశ్యం తెలియజెప్పి ధోరణిలో "చూడండీ" అంటూ అడగబోయేను.


"వెంటనే ఆయన 'నేను చూడలేనబ్బాయ్!' అన్నాడు.

ఒక్కసారిగా నా ఆలోచనా ప్రవాహం ఆగిపోయింది. నాలో ఆయన జవాబు రగిల్చిన ఆశ్చర్యం గుండెని ఝల్లు మనిపించింది.

ఇందాకే నాకు నరసింహాచార్యులుగారి శిల్ప చాతుర్యమంతా ఆయన కళ్ళలో కొట్టొచ్చినట్టు కనబడింది. ఎంతవరకూ, గొంతుకవిని చూడాయగా నా వయస్సు పసిగట్టిన ఆయనయొక్క గ్రుడ్డితనం తెలీక— ఆ కళ్ళు చెప్పని భావాలెన్నో నాలో వూహించుకున్నాను. పొరపాటు జరిగి పోయిందని కింగపడ్డాను.

నా మౌనం ఆయన తెలుసుకున్నట్టుంది. మాటలు కదిపేడు— "ఇంతసేపూ నాకు కళ్ళున్నా యనుకున్నావ్ కదూ ?" నవ్వేడు. "ఎందుకు లేవూ వున్నాయ్. కాని యివి శిల్పాలు చెక్కడానికి పనికిరావు. వెలుతురు చూడలేవు. అడపా తడపా వుద్రేకాలొస్తే కానీని కన్నీళ్ళు కారుస్తా యంతే. అంతకుమించి వీటి కేపనీ చేతకాదు. నేనూ అంతే. నడవలేను. కళ్ళు పోయినప్పుడే కాళ్ళూ పోయాయి. అప్పట్నుంచీ యీ మంచమే నా జీవితం" ఆయన ఆగేడు.

నేను మళ్ళీ యిందాకటిలాగే చలించేను 'నా మహాశిల్పి' అంధుడూ, అశక్తుడూ అయిపోయి సందుకు తీరని జాలితో నా మనస్సు రెపరెప లాడింది. ఆయన కేసి చూసేను. శరీరమూ, జీవితమూ కలిసి మిగిల్చిన కష్ట నష్టాలకి తగినంత బాధ నరసింహాచార్యులు గారితో నాకు కనిపించలేదు. ఆయనే చెప్పేడు — "కళ్ళు పోయాయనికాని, కాళ్ళు పోయాయని కానీ నా కేమాత్రం విచారం లేదు. ఎందుకో తెలుసా ? ఈ దేహంతో ఈ మహత్తర శిల్ప సృష్టి ఏనాడో పూర్తి చేసేశాను. నా జీవితంలోనే సాధిద్దా మనుకున్న మహాఫలితం ఏనాడో సాధించేశాను. అదేమిటనుకున్నావ్ ? కళాఖండం. నేను చెక్కిన శిల్పాలన్నీ వొక ఎత్తు. అదొక్కటీ ఒక ఎత్తు చూపులకూడా ఎత్తయిందేలే — 24 అడుగులు." నరసింహాచార్యులు నిర్వికారంగా మాట్లాడేడు. నాకు వెంటనే ఆ కళాఖండాన్ని తనివి తీరా చూడాలనిపించింది. కాని, ఆయన తన కళాఖండం ఎంత గొప్పదో చెప్పేడేగాని, ఎలా వుందో ఎక్కడుందో చూడమని మాత్రం చెప్పలేదు. అంచేత నేనే కలుగజేసుకుని—"ఏదీ? ఎక్కడుంది మీ



కళాఖండం?' అని ఆతృతగా ఆసక్తిగా అడిగేను.

నరసింహాచార్యులుగారు నా ప్రశ్న విని, మోచేతులమీద సగం లేచేరు, మంచంమీంచి లేచి క్రింద పడతారేమోనని భయం వేసింది. పట్టుకోడానికి సిద్ధపడాలనుకున్నాను కాని సగం లేచేక ఆయన అలాగే వుండిపోయి మొదలెట్టేరు– 'చూడబ్బాయ్! నువ్వు అశోకుడి గురించి చదివేవుంటావు షాజహాను గురించి కూడా చదివేవుంటావు–'

నాకు చిరాకేసింది – కళాఖండం చూపించకుండా మాట మారుస్తారేమిటూ? అని ఒకవేళ సస్పెన్స్ కలిగిద్దామనుకుంటున్నాడేమో! హిచ్‌కాక్ గర్వం పెంచుకుంటే యిలాగే ఉంటాడేమో! అనుకున్నాను. ఏమైనా చేసేది లేక వినడం మొదలెట్టేను. ఆయన చెబుతున్నాడు– 'చెప్పుకోడం కాదుగానీ నాకూ ఉంది పెద్ద చరిత్ర. నన్నడిగితే నాకున్న గతం షాజహానుక్కూడా లేదంటాను. చూడబ్బాయ్! ఒక్క సంగతి యిన్నాళ్ళకి నేనంటే అభిరుచితో వచ్చినమనిషివి నువ్వొకడివి కనబడుతున్నావ్. బహుశా మనిద్దరికీ ఏదో పూర్వజన్మ సంబంధం వున్న

ష్టుగా ఉంది సమయం వొచ్చింది కాబట్టి చెబుతున్నా విను అసలు సంగతేవిటంటే–

అప్పట్లో నాకు పాతికేళ్ళ వయస్సూ, పాతికెకరాల భూమీ వుండేవి. నిత్యవూ శిల్పాలు చెక్కాలనే ధ్యాసతప్ప నాకు మరో దృష్టి వుండేదికాదు. ఆ రోజుల్లో ఈ చేతుల్తో నేను ముట్టని మట్టిగానీ, కొట్టని రాయిగానీ లేదు. చాలా మట్టి బొమ్మలు చేశాను. కనిపించిన రాయినల్లా తెచ్చి, ఖరారైనబొమ్మలెన్నో ఖచ్చితంగా చెక్కాను. ఆమీదట దేశంలో గొప్ప శిల్పాలన్నిటికీ మించిన మహాశిల్పాలు చెక్కాలనుకున్నాను. అంతే. వెంటనే బయల్దేరి దేశమంతా తిరిగాను. చూశాను. చాలా చూశాను. హంపీ శిధిలాలు, అజంతా ఎల్లోరాలు, ఆగ్రా ఢిల్లీలు, గొప్ప గొప్ప కోటలు, దేవాలయాలూ, మసీదులూ–ఓహ్! వాటికేవిటి? సమస్తవూ చూశాను. తిరిగొచ్చాక నేననుకున్నంత పనీ చెయ్యగలిగాను. గర్వపడుతున్నా ననుకునేవ్! అప్పుడీ అగ్రహారం చుట్టుపక్కల నేనంటే తెలియని మనిషి లేడు. అద్భుతమైన శిల్పినని అంతా మెచ్చుకునేవారు. అయినా నాకెందుకో తృప్తి వుండేదికాదు. ఎన్ని మలిచినా కూడా, నే చెక్కాల్సిన శ్రేష్ఠమైన శిల్పం యింకా తయారుకాలేదనే అనిపించేది. అలాగే రోజులతరబడి చెక్కేవాణ్ణి. వాంతో ఆదాయం లేకపోగా ఆస్తంతా హరించుకుపోడం మొదలెట్టింది. అప్పుడికే లాభంలేదని, నన్నేదో బాగుచేస్తారంటూ మా పెద్దలంతా కలిసి నాకు పెళ్ళిచేసేశారు. కాని పెళ్ళయ్యాక నా ధోరణి మరీ ఎక్కువైపోయింది. కారణం ఏవిటో తెలుసా?– మా ఆవిడ అచ్చం అప్సరసే అనుకో. ఈ కాలం పిల్లలు దాని అందం ముందెందుకూ పని చెయ్యరు. మునిలిపీనుగ పెళ్ళాం సొగసు వల్లిస్తున్నా డనుకునేవ్. నామాటల్లో అసలు ఉత్ప్రేక్షలుండవు. ఉన్నదున్నట్టే. నే బొమ్మ చెక్కినానంటే. అయిందా–అప్పుడేం చేశానూ?" అంటూ పక్కకివొత్తిగిల్లేరాయన.

"ఏంచేసేరు?"

"శిల్పం చేశాను. అమర శిల్పం. మా ఆవిడ శిల్పం. అచ్చం అప్సరసని అప్సరసలా చెక్కేశాననుకో. పోలికలన్నీ పోతపోసినట్టు తీసుకొచ్చాను కాని, కాని యిప్పుడది లేదు. చచ్చిపోయింది. ఉంటే చూసుకుని ఎంత మురిసిపోయేదో! నన్నెంత మెచ్చుకునేదో–" నరసింహాచార్యులుగారి కంఠం బొంగురుపోయింది. ముందు చెప్పినట్టుగా ఆయన చూడలేని కళ్ళు చెమర్చేయి. ఆయనలో బాధ చూసేను. నరాలు గిజగిజలాడేయి.

అంతలోనే ఆయన అనుభూతి మార్చుకున్నాడు. మామూలుధోరణి తెచ్చిపెట్టుకోడానికి ప్రయత్నించి, గొంతు సర్దుకుంటూ అన్నాడు.

'చూడబ్బాయ్! షాజహాను పెళ్ళాన్ని ప్రేమించే కదూ తాజమహలు కట్టించేడు? కాని, నన్ను చూడు – నేనూ ప్రేమించాను నా భార్యని. షాజహానుకంటే అమితంగా ప్రేమించానేమో కూడా. ప్రేమించడమే కాదు–ప్రపంచంలో అందాన్నంతా ధిక్కరించేలా ఉన్న 'ఆమె' రూపాన్ని అపూర్వంగా మలిచాను. పెళ్ళాన్నంత ప్రేమించీ షాజహాను తాజమహలు తనుగా తను కట్టలేక పోయాడు. ఎవరిచేతో కట్టించాడు. కాని నేను! నా చేత్తో నేను మలిచాను దాన్ని. ఇప్పుడు చూడు! పెద్ద కొండరాయి వుండే దక్కడ. దొలిచి ప్రాణాలు పోశాను. అదే నా కళాఖండం!'– గర్వంగా కిటికీ వేపు చాచిన చేత్తో సూదిస్తూ చూపించేడు. తటాలున నేను ఆత్రంగా వంగి చూసేను. బాగా చూసేను. నాకేమీ కనిపించలేదు ఇందాక నే నిలబడ్డ పచ్చగడ్డి స్థలం, దాని వెనక పొలాలూ, దూరాన కొండ అంచులూ తప్ప మరేమీ కనిపించలేదు.

నరసింహాచార్యులు గారింకా మాట్లాడుతున్నాడు– "నేను గొప్ప వాణ్ణి కాదూ? షాజహాను కంటే గొప్ప చరిత్ర పురుషుణ్ణి కాదూ? చెప్పబ్బాయ్!"

నాకేం మాట్లాడాలో తెలియలేదు. నరసింహాచార్యులుగారు ఏదో గొప్ప కళాఖండాన్ని చూపిస్తారనుకున్నాను. చూస్తాననుకున్నాను. ఫలితంగా నాలో గొప్ప నిరుత్సాహం కలిగింది. నరసింహాచార్యులుగారికి పిచ్చెమోనన్న అనుమానం కూడా కలిగింది. నాకేమీ కనిపించడంలేదని చెబుదా మనిపించింది నా కళ్ళు ఆయనవి, ఆయన కళ్ళు నావి అయిపోయినట్టుగా వుంది. నెమ్మదిగా కూర్చున్న వాణ్ణి లేచేను. పెదవి కదిలేంతలో పెద్ద శబ్దం వినబడింది. వెనక్కి తిరిగి చూసేను. నేల విడచిన నీటిగిన్నెను పైకెత్తుకుంటూ, జారవిడిచిన నీలి పైటను మెడచుట్టూ తిప్పుకొంటోంది— 'మహాశిల్పి' కూతురు.

ఆయన పిలిచేడు– "అమ్మాయ్ నువ్వేనా? ఒక్కసారి యిలా రామ్మా!"

ఆమె గిన్నె క్రిందబెట్టి గబగబా వచ్చింది. ఎందుకో కంగారు పడుతోంది. నిటారుగా నిలబడింది. ఆమె నడిచి వచ్చిన సవ్వడి విన్నాక ఆయన– "చూడమ్మా! ఇతన్ని కాస్త అలా తీసుకువెళ్ళి మీ అమ్మ బొమ్మని చూపిస్తావూ!" అన్నాడు.

"రండి!" అంటూ కదిలింది. ఆమె మాట్లాడ్డం మొదటిసారిగా విన్నాను. ఆమెని అనుసరించేను ఇద్దరం గుమ్మందాటి, మెట్లు దిగేం. నాపరాళ్ళ మీదుగా నడిచేం. మరో క్షణానికల్లా – చాలాసేపటి క్రితమే నేను తాకి చూసిన రాతి పాదాల దగ్గరికి నడిచి ఆమె ఆగిపోయింది. నేనూ ఆగేను.

'చూడండి!' ఆమె రెండవసారి మాట్లాడింది.

నేను చూసేను. ఇప్పటికిగాని నా మెదడు పని చేయలేదు. కళాఖండం ప్రమాదంలోపడి శిథిలాన్ని విస్మరించేనని మెలకువ కలిగింది. నివ్వెర పోయేను. ఇదా నా 'మహాశిల్పి' కళాఖండం! ఇదా నరసింహాచార్యులుగారి చరిత్ర చాటే కళాఖండం! దీని కోసమేనా కిన బతలేదని నిరుత్సాహ పడ్డాను! దీని కోసమేనా నరసింహాచార్యులు గారికి పిచ్చి వుందని అనుమానించేను! — అనిపించింది. గుండె బరువెక్కినట్టయింది. మనస్సు మరోసారి రెపరెప లాడింది. కళాఖండపు ఖండాన్ని మరోసారి చూసేను. విరిగిన పాదాలు — మెత్తగా, సుకుమారంగా అనిపిస్తున్నాయి. పాదాల దిగువకి జారిన పలుచని వస్త్రభాగం చిరిగిన కలువ రేకులా వుంది. ఏవేవో ఆభరణాలు, నగిషీలు — వనితనమంతా పాదాల్లోనే వుపయోగించేసినట్టుంది. మిగిలిన శిల్పమంతా చూడగలిగితే ఎంత బాగుణ్ణు! — యింతక్రితం చూసినప్పటిలాగే అనుకుంటున్నాను. మరోలా అనుకోడం తెలియడం లేదు.

ఆమె అడిగింది 'చూశారా?'

'వచ్చేముందే చూసేను. యిది రెండవసారి' క్షణం ఆగేను. 'మీ అమ్మగారి పాదాలు యిలాగే ఉండేవనుకుంటాను.'

'అవును.'

'ఆవిడ పోయి ఎన్నాళ్ళయింది?'

'పదేళ్ళు సుమారు.'

'ఎలా పోయేరు పాపం.'

'నాన్న చంపేశాడు.'

హఠాత్తుగా అదిరి పడ్డాను. వణికేను 'ఎందుకు?' అని మాత్రం అనగలిగేను.

'అమ్మలాంటి బొమ్మని చెయ్యాలని నాన్నెంతో కష్టపడ్డాడు. అమ్మని ఎదురుగా కూర్చోబెట్టి, రోజుల తరబడి ఎన్నో బొమ్మలు చెక్కాడు. ఏవీ అమ్మకి నచ్చలేదు. ప్రతి శిల్పంలోనూ ఏదో ఒక వంక చూపించేది. నాన్నకి పట్టుదల హెచ్చు. మానలేదు. ఇంకా ఎన్నెన్నో చెక్కాడు. ఎంతో డబ్బు ఖర్చుపెట్టాడు. చివరికి అమ్మ విసుగెత్తిపోయింది. తన కోసం దరిద్రాన్ని కొని తెస్తున్నారంది. తనలాంటి శిల్పం తయారు చెయ్యడానికి అన్నాళ్ళూ, అన్ని రాళ్ళూ పాడుచెయ్యాలా అనడిగింది. ఆఖరికి, నాన్నకు శిల్పాలు చెక్కడమే చేతకాదంది. పైగా పాడు బొమ్మలు చెక్కి పచ్చటి బ్రతుకంతా పాడుచేస్తున్నారని ఆ బొమ్మలన్నీ పగలకొట్టింది. నాన్నకప్పుడు విపరీతంగా కోపం వచ్చింది. ఆయనకెప్పుడూ కోపం రాలేదు. అదే మొదటిసారి నాన్నకి తన చేతిమీద నమ్మకం ఎక్కువ.

తన శిల్పాలే ఆయన ప్రాణాలు. తన నేర్పునీ తన శిల్పాన్నీ కించపరచడం నాన్న సహించలేకపోయాడు. అమ్మతో ఘర్షణపడ్డాడు. ఆ ఘర్షణలో చేతనున్న ఉలిని అమ్మమీదికి కోపంగా విసిరాడు. కణతకి తగిలింది రక్తం కారింది. అంతే అమ్మ చచ్చిపోయింది.' ఇలా చెప్పినంతసేపూ ఆమెలో నిర్లిప్తత తప్ప మరే భావంలేదు. బహుశా పాత భావాలన్నీ ఘనీభవించి గుండెని రాయిచేసి వుంటాయి. వెళ్ళేటప్పుడు నరసింహాచార్యులు గారికి తెలిస్తే కూతుర్ని గుండెని కూడా శిల్పంగా చెక్కేవాడేమో!'

ఆమె చెప్పడం అయిపోలేదు. 'అమ్మపోయాక నాన్న కోపమూ పోయింది. ప్రాణంలేని రాళ్ళకి ప్రాణంపోసిన ఉలితో, ప్రాణమున్న అమ్మప్రాణం కాస్తా బలి తీసుకున్నానని కుమిలి పోయాడు. చాలా రోజులు విచారంతోనూ, పశ్చాత్తాపంతోనూ గడిపాడు. చివరికి అమ్మ జ్ఞాపకార్థం ఆయిదేళ్ళు రాత్రీ పగలూ కష్టపడి యీ శిల్పం చెక్కాడు అమ్మ బ్రతికి ఉంటే దీనికి వంక పెట్టేదికాదు. అంత బాగా చెక్కాడు. నిజం చెప్పాలంటే అమ్మలాంటి బొమ్మని అమ్మ పోయాకే తయారు చెయ్యగలిగాడు నాన్న.' అమె ఆగింది. పరాయి వ్యక్తిలో ఆమె యింతసేపు నిబ్బరంగా, ధారాళంగా మాట్లాడగలిగిన మనిషి అని నేను మాత్రం వూహించలేదు. చీర కొంగుతో చెంపల్ని తుడుచుకొని అంది— 'కాని శిల్పమంతా పూర్తయ్యాక, అమ్మ బుజాలమీద నిలబడి—తల పాపిట సవరిస్తూ చివరి మెరుగులు చెక్కుతూంటే కాలు జారి నాన్న క్రింద పడిపోయాడు. తలకి పెద్ద గాయం తగిలింది. మెదడు దెబ్బతిందిట. అప్పట్నించీ నాన్న చూడలేడు. నడవలేడు. అమ్మని చంపినందుకు శిక్షనుకుని అస్తమానం కన్నీళ్ళు పెట్టుకుంటాడు.'

మగాడిలా మాట్లాడే స్త్రీ ఎప్పుడూ తెలియదు నాకు. ఆమె మాటలు వింటోంటే 'మహాశిల్పి' కూతురు కాక, కొడుకు మాట్లాడుతున్నట్టనిపించింది నాకు. నేనడిగేను, 'మీరు మగాడిలా ఎందుకు మాట్లాడుతున్నా'రని కాదు

'మరయితే ఎందుకీ దేవాలయం శిథిలమై పోయింది?'

'ఎవరో గొప్ప వ్యక్తిట. ఆ మధ్య యీ వూరొచ్చాడు. స్వాముల వారో, సన్యాసో—తెలీదు నాకు. దేశమంతా కాలి నడకనే నడుస్తాట. ఏదో వుపన్యాసాలిచ్చాడు. మునసబుగారు ఈ ప్రదేశాన్ని ఆయనకి భూదానం చేశాడు. అప్పుడాయన యీ విగ్రహాన్ని చూశాడు. ఆసహ్యించుకున్నాడు. అమాయకులైన ప్రజల్లో యిలాంటి శిల్పాలు చెడ్డ ఆలోచనల్ని ప్రేరేపిస్తాయట. శృంగార వాంఛల్ని రేకెత్తిస్తాయట.'

"బహుశా అప్పుడు ఆయనలో అలా రేకెత్తి వుండొచ్చు."


"ఏమో! శిష్యులతో కలిసి విగ్రహాన్నంతా ఛిన్నా భిన్నం చేసి వెళ్ళిపోయాడు. కోపంలో అమ్మని చంపేసినా — యీ బొమ్మ చెక్కి నాన్న మళ్ళీ అమ్మకి ప్రాణం పోశాడు. కానీ రెండవసారి కూడా అమ్మ చంపబడింది. నే నడ్డుపడ్డాను, ఏడిచాను, తల బాదుకున్నాను. లాభంలేకపోయింది పైగా 'మా అమ్మని చంపకండి' అని ఏడిస్తే అందరూ నన్ను అపహాస్యం చేశారు. సిగ్గు భరించలేక నేనుకూడా చచ్చిపోయానను కున్నాను. ఇక నేను చెయ్యగలిగిందల్లా ఆ క్షణంలో ఒక్కటే మిగిలింది. యీ అమానుష విషయం నాన్నకు తెలియకుండా జాగ్రత్త పడ్డాను. తెలిస్తే నాన్న గుండె పగిలేది పాపం-యింకా యిక్కడ అమ్మ శిల్పం వుందను కుంటున్నాడు. ఆ ఆసరాతోనే నాన్న బ్రతికున్నాడు." రెండు సెకన్లు ఆగింది. "చూడండి లోపలికి వెళ్ళాక నాన్న మిమ్మల్ని అడుగుతాడు. అమ్మ శిల్పం ఎలా ఉందనిః- దయచేసి. బాగుందని చెప్పండి! — నాన్న కోసం. నాకీ ప్రపంచంలో నాన్న తప్ప ఎవరూ లేరు. నాన్న పరపతి తప్ప మాకు మరో బ్రతుకుతెరువు లేదు. నాన్నని నేను కాపాడుకోవాలి. కాదు మీరే కాపాడాలి. ఇంతకంటే నాకు మరో మార్గం లేదు. నాన్నని కాపాడి పెట్టండి! మా బ్రతుకు నిలబెట్టండి! అమ్మ బొమ్మ బాగుందని చెప్పండి! చిన్న అబద్ధం—చెబుతారు కదూః" ఆమె గొంతులో దైన్యం, వేడికోలు నా మనస్సుని కదిపేయి. నేను చాలా చాలా చలించేను. అంతా నాకో చిత్రమైన అనుభూతిలా వుంది. "అలాగే" అన్నాను. ఆమె చేతులు కలిపి నమస్కారం చేసింది. కృతజ్ఞత అనుకుంటూ.

"పదండి వెళ్దాం" అంది

ఆమె వ్యక్తిత్వంలో తెలియని వైరుధ్య మేదో వుంది. నా కర్థం కాలేదు. ఇద్దరం వెనక్కి తిరిగి నడిచేం. సాయంత్రం పలుచని చీకటి రాకని చూచాయగా సూచిస్తోంది. నాకు ప్రయాణం గుర్తొచ్చింది. త్వరపడా లనిపించింది.

ఆమెతో ఇంట్లోకి ప్రవేశించేను. లోపల వెలుగు బాగా తగ్గింది. నరసింహాచార్యులుగారి మంచంకేసి నేను వడివడిగా నడిచేను. ఆయన రెండు చేతులూ కలిపి పట్టుకున్నాను. లేనివుత్సాహోద్రేకాలని సృష్టించుకున్నాను. అన్నాను—

"ఆచార్యులుగారూ! నిజంగా యీ రోజు నా జన్మ తరించింది. అసమానమైన శిల్పకళ దర్శించే భాగ్యం నాకు కలిగించేరు మీలాంటి మహాశిల్పులు నూటికి కోటికి ఎక్కడో ఏ ఒక్కరో వుంటారు. పొగడ్త అనుకోకండి. నాకు పొగడ్డం చేతకాదు. అసలు నా అనుమానంమీరేదో దైవాంశతో పుట్టి వుండాలని. ఇంత అద్భుత



మైన కళాఖండం ఎప్పుడూ, ఎక్కడా, చివరికి కలలో కూడా నేను చూడలేదు."

నేను అప్పుడప్పుడు శ్రవ్య నాటికల్లో పాల్గొన్నాను. బాగానే అనగలిగేను. ఎంచేతనంటే నా మాటలకి నరసింహాచార్యులు గారిలో ఎదురు చూసిన ప్రతిభావాలన్నీ ఎంతో బాగా కదిలించేయి. తెగని సంతోషం, తృప్తి నరసింహాచార్యులు గారి గుడ్డి కళ్ళల్లో నీటిని తిప్పేయి. గిల్టీగా ఫీలయ్యేను.

నరసింహాచార్యులు గారు పొంగిపోయేరు. మంచి వుత్సాహాన్నీ, మంచి కృతజ్ఞతనీ మాటల్లో చెప్పేరు — "చాలా సంతోషమబ్బాయ్! చాలా సంతోషం! నాకీ రోజు నా చిన్నప్పటి దీపావళి పండగంత హాయిగా ఉంది. నా కళా ఖండాన్ని బాగా చూశావు కదబ్బాయ్!- ఆ కళ్ళూ, ముక్కూ, శంఖులాంటి మెడా, గుండ్రంగా జారిన భుజాలూ, వాటి మీంచే జారి పడి కళ్ళూ, కాళ్ళూ పోగొట్టుకున్నాను-అంత నునుపుగా చెక్కేను దాన్ని—బాగా చూశావుకదూ? నే చెప్పిందంతా అక్షరాలా నిజమే కదూ..."

ఇంకా ఏదో అంటున్నాడు. నాకేమీ వినిపించడంలేదు. వినిపించినా అర్థం కావడంలేదు. కాళ్ళ క్రింద పుట్టుకిచ్చిన పుణ్యభూమి తొలుచుకుపోతున్నట్టుగా ఉంది.

"ఈపాటికి బస్సు దాదాపు బాగయిపోయి ఉంటుంది. ఆలస్యమైతే అందుకోలేను, విశాఖపట్నం వెళ్ళాలి. ఇక సెలవు తీసుకుంటానండీ!" అన్నాను

"మంచిదబ్బాయ్! క్షేమంగా

వెళ్ళు! ఎప్పుడన్నా వీలువడితే ఇటు కేసో చూపు చూడు."

"ఎంతమాట వస్తానండి!" అని ఆయన చూడలేకపోయినా, నరసింహాచార్యులు గారికి నమస్కారం పెట్టి కదిలేను. ఆమె వీధి గుమ్మం దగ్గర నిలబడి కనబడింది. కృతజ్ఞతని చిరునవ్వుగా తయారుచేసి పెదాల మధ్య చూపించింది. ఇప్పటికిగానీ నాకు ఆమె అందం కేసి మనసు పోలేదు. కాని టైము తక్కువగా వుండడంవల్ల ఒకేమాట 'వస్తానండి!' అని చెప్పి మెట్లు దిగేను.

నావరాతి ముక్కలమీద నడుస్తున్నాను.

పాపం! కండలు కరిగించుకుని కళాఖండం మలిచిన నరసింహాచార్యులుగారు తన ప్రేమ కథకి చరిత్రలో షాజహానుకంటే వున్నత స్థానం వుంటుం దనుకుంటున్నాడు. కళ్ళు పోగొట్టుకుని పిచ్చిగా వూహించు కుంటున్నాడు. కాని ఆయనకి తెలియదు. ఊహల్ని కాదనే నిజం వుంది. కళాఖండమూ, ప్రేమా, చరిత్రా ఏవీ ఆయనకు దక్కలేదు. అవును. ఎలా దక్కుతాయి? నరసింహాచార్యులు లేనివాడు. అతి సామాన్యుడు. సామ్రాజ్యాధినేత కాడు. రాజకీయ నాయకుడూ కాడు. కేవలం ఒక పేద శిల్పి. పేదవాళ్ళ ప్రేమలో ఎంత బలం వున్నా ప్రయోజనం లేదు. మహా ధనవంతుడైన షాజహాను చక్రవర్తి అపూర్వమూ, అద్భుతమూ అయిన తాజ్‌మహాల్ కట్టించి నరసింహాచార్యులుగారి లాంటి పేదవాళ్ళ ప్రేమకి విలువ లేకుండా చేసేడు. ఎవడో రాజకీయ సన్యాసి మహాశిల్పాన్ని నాశనంచేసి ఆయన చరిత్ర నిలువకుండా నిర్జించేసేడు. ఛీ ఛీ!— వీళ్ళా భారతదేశం మనుషులు! గురజాడకవి దేశమంటే మట్టికాదు, మనుష్యులే అని చెప్పేడుగానీ— నా కిప్పుడు యిలాంటి మనుషులు వున్న దేశాన్ని వొక్తి 'మట్టి' అనుకుంటేనే బాగుణ్ణని పిస్తోంది. లేకపోతే, కొన్నాళ్ళకి దేశంమీద ఏవగింపు కలిగి, నాలో వుందనుకునే కొద్దిపాటి దేశాభిమానం చచ్చిపోతుందేమోనని భయం కూడా వేస్తోంది.

ఆలా ఆలోచనలు పేర్చుకుంటూ కొంత దూరం నడిచేక, ఎందుకో వెనక్కి తిరిగి చూడాలనిపించింది. చూసేను! నరసింహాచార్యులు గారి పాత పెంకుటిల్లు చిన్న అట్ట సెట్టింగులా కనబడింది. నాలో యిప్పుడు— ఒక గొప్ప కళాఖండాన్ని చూడలేకపోయాననే దిగులు తొలగిపోయి, నా 'పేద మహాశిల్పి' నరసింహాచార్యులుగారి ప్రేమనీ, తృప్తినీ, చరిత్ర స్థానాన్నీ కాపాడగలిగానన్న సంతోషభావం కమ్మగా, తియ్యగా కలిగి పెరిగింది.

□□□

[గత సంచిక తరువాయి]

32

పద్మ లిల్లీలు కూడా మాధవపురం వచ్చి వేణూ రఘూలతో పాటు కలరా నివారణోద్యమంలో పాల్గొన్నారు. ఊరికి దూరంగా వేసిన పాకల్లో డాక్టర్లు, వలంటీర్లు అద్భుతమైన సేవ చేస్తున్నారు. వాంతులూ, మలమూత్రాలతో తడిసిన వస్త్రాలను ఎప్పటికప్పుడే రోగుల పక్కల మీదినుంచి తీసేసి బాల్చీలలో వున్న లోషన్ నీళ్ళలో వేసి బయటికి తీసుకుపోయి మరిగే నీళ్ళలో నానబెట్టి ఉతికి ఆరేస్తున్నారు. డాక్టర్ల సలహాల ననుసరించి మందులు త్రాగించడం, టేబ్లెట్లు మింగించడం, గ్లూకోజ్ సెలైన్ ఇంజెక్షన్లు ఎక్కించడానికి కావల్సిన పరికరాలను సిద్ధం చెయ్యడంలోనూ, వలంటీర్లు ఎంతో శ్రద్ధ, సహనాలు కనబరుస్తున్నారు. నాలుగేసి గంటలకి వలంటీర్లు, డాక్టర్లు మారుతూ నిర్విరామ సేవ చేస్తున్నారు.

● ● ●

వేణూ, పద్మా కలరా పాకల్లోంచి విశ్రాంతి గుడారంవైపు చేతులమీద "ఏప్రన్సు" వేసుకుని నడిచి వస్తూండగా వేణు అన్నాడు.

"డాక్టర్ శ్రీధర్ కుమార్ పట్ల అక్రమంగా ప్రవర్తించేవు పద్మా."

"కావచ్చు కాని. దానివల్ల ఆయనకి నష్టం లేదు."

"ఆయన నిన్నెంత గాఢంగా ప్రేమించాడో నువ్వర్థం చేసుకోలేదనుకుంటాను."

"పోనీలే యిద్దరం సమానమైన దురదృష్టవంతుల మవుతాం!"

"నువ్వెంత త్వరగా వెళ్ళి ఆయన క్షమార్పణ కోరుకుంటే అంత మంచిది."

సీరియల్

'మళ్ళీ చీకట్లోకి వెళ్ళమంటావా'

'వెలుగులోకి వెడతావు. లేక పోతే ప్రజాసేవ, శాశ్వత కీర్తితో బాటు ఆదర్శ దాంపత్యం సంపాదించే అవకాశం చేతులారా విడిచి పెట్టిన దాన వవుతావు.'

'మళ్ళీ స్వార్థ సౌఖ్యాల్లో పడితే ఆదర్శాలు వెనక్కి వెడతాయి వేణూ!'

'అది నీ ఆత్మ విశ్వాసం మీద ఆధారపడి ఉంటుంది.'

'ఇదిగాక డాక్టర్ కుమార్ నా ఆశయాల్ని మన్నిస్తారని ఏం చెప్ప గలం ?'

'పొరపాటుపడుతున్నావు. డాక్టర్ గిరిధర్ లాంటి వాళ్ళ హృదయాలు నాకు బాగా తెలుసు. ఈనాడు సాంఘికంగా కొన్ని సంకుచితాభిప్రాయాలున్నా, ఆయన మారటాని కెక్కువ కాలం పట్టదు. నీ సాహచర్యం వల్ల మరింత సులభసాధ్యమౌతుంది.'

ఇద్దరూ దేశాలోకి వెళ్ళేటప్పటికి అంతరూ కాఫీ తీసుకుంటున్నారు. వేణూ దృష్టి స్టాండ్ మీద వున్న నల్లబల్లమీద గీసిన రేఖా పటం మీదకు పోయింది. రేఖ కిందకువాలి, చావు సంఖ్యలలో ఒకటిమీద నిలిచింది. డాక్టర్ శ్రీదేవి చిరునవ్వుతో వేణు, పద్మలకి స్వాగత మిచ్చింది. వేణూని చూసి—

'నీ శపథం నెరవేరిందా లేదా అని చూస్తున్నావా! ఇంక రెండు మూడు రోజుల్లో మనం ఎవరెళ్ళకు వారు వెళ్ళిపోవచ్చు' అంది.

'నడుంకట్టి ముందుకువచ్చి ఈ వుద్యమం మీరు లేవదీయకపోతే, ఇంకా ఎన్నాళ్ళు పట్టేదో ... ఇంకా ఎన్ని ప్రాణాలు పోయేవో అని ఆలోచిస్తున్నాను' అన్నాడు వేణు.

'నేను చేసిందీ, చెయ్యగల్గింది మాత్రం ఏముంది ? మీరందరూ యింత పట్టుదలతో సహకరించి కృషి చెయ్యకపోతే నే నుండి చెయ్యగలిగిం దేముంది ?'

'మేమూ డాక్టర్లమే. ఎందుకూ, మీ పిలుపు వింటేనేకాని మాలో మానవత్వం మేలుకోలేదు. మాలో చైతన్యం కలిగించి, స్వార్థం వైపు పోతున్న యీ వైద్య వృత్తిని, ధర్మంవైపు మళ్ళించారు. ఇంతకీ మేము చేసింది మాత్ర మేముంది. మా విధ్యుక్తధర్మాన్ని నెరవేర్చాం, ఏమంటావ్ డాక్టర్ వేణూ' అన్నారో డాక్టర్.

'ఆర్థికంగా వెనక పడిన మన దేశంలో చేయగలిగిన వైద్య సహాయం చెయ్యకపోవడం మన వైద్య వృత్తికే ద్రోహం అంటాను. కేవలం డబ్బుకోసమే వైద్యం చేసిన డాక్టరు పచ్చి నెత్తురుతాగే కిరాతకుడన్న మాట. జీవితంలో డబ్బు మనిషి కొక సాధనం కాని లక్ష్యం కాదు. అవసరానికి మించిన డబ్బు సంపాదించడంకూడా ఒక విధమయిన మానసిక వ్యాధే అవుతుంది. ఈ రోగం వచ్చిన వ్యక్తికి డబ్బు మీద మమకారం ఎక్కువయిన

కొద్దీ న్యాయంమీద, ధర్మం మీద నమ్మకం తగ్గుతుంది" అన్నాడు వేణు.

"ఇలాంటి నైతిక విప్లవం వైద్య లోకంలో రావాలంటే మీలాంటి అభ్యుదయ భావాలు కల యువతీ యువకుల వల్లనే రావాలి. వస్తుంది కూడా. లక్షాధికారి కూతురయి వుండి, ఎంతో సుకుమారంగా పెరిగిన పద్మావతి మనతో సమానంగా సేవ చేసిందంటే కాలంలో ముందు రాబోయే మార్పుకు సూచనన్న మాటే" అంది పద్మ భుజం తడుతూ డాక్టర్ శ్రీదేవి.

"హియర్ - హియర్" అప్పుడే వచ్చిన లిల్లీ.

"లక్షాధికార్లుమాత్రం మనుషులు కారా?" ఉక్రోషం వచ్చిందిపద్మకి.

"ఏమో మరి!" అన్నాడు రఘు పద్మ మొహం తప్పించుకుంటూ.

పద్మ నిస్సహాయంగా వేణువైపు సానుభూతి కోసం తిరిగింది. వేణు నిశ్శబ్దంగా చిరునవ్వు నవ్వుతూ కూర్చున్నాడు.

33

గత సంఘటనల ఫలితంగా గిరిధర్ హృదయం అమితంగా గాయపడింది. జీవితంలో యిదే అతని మొదటి పరాజయం. తీరని అవమానంతో తీవ్రంగా క్రుంగిపోయాడు. ఏదో ఆవేశంలో తనని పరాభవించిన పద్మ త్వరలో దారి కొస్తుందనుకున్న ఆశ, నిర్లక్ష్యంగా తనతో మాటవరసకైనా చెప్పకుండా కలరా నివారణోద్యమం పేరు చెప్పి వేణుతోటి పరిగెత్తడం నిరాశయింది. సెలవుపెట్టి మనశ్శాంతికోసం లక్ష్మీపురం వెళ్ళటానికి నిశ్చయించుకున్నాడు. ప్రయాణానికి సిద్ధం చెయ్యమని డానికి నౌకరు రామయ్యని పిలిచేడు.

"నేను సెలవుపెట్టి వూరెళుతున్నాను ఇల్లు జాగ్రత్తగా చూసుకో."

"ఎప్పుడెళుతున్నారు బాబూ?"

"ఇప్పుడే."

'అదేమిటి బాబూ అంత అర్ధంతరంగానా? రెండు మూడు రోజుల్నించి తమకి ఒంట్లో బాగా లేదు. భోజనంకూడా మానేశారు. ఇంత నీరసంగా ఉన్నారు. పోనీ రెండు రోజులు పోయిన తర్వాత...'

'...వెళ్ళితీరాలి రామన్నా. లేకపోతే ఆరోగ్యం మరీ పాడవుతుంది. ముందు విజయనగరం వెళ్ళి, దివాన్ గారితో ఎస్టేటు విషయాలు మాట్లాడి అక్కణ్ణుంచి లక్ష్మీపురం వెడతా?"

"డ్రైవరుకూడా రాలేదే. దూర ప్రయాణం కూడాను."

బి. వి. రమణారావు

'అక్కర్లేదు సామాన్లన్నీ కారులో పెట్టు.'

సామాన్లన్నీ సర్ది కార్లో పెట్టేక కారు బయల్దేరేసమయానికి జ్ఞాపకం వచ్చి రామన్న ఖాళీ థర్మోఫ్లాస్కు వాటర్. బాటిల్ కార్లో పడేశాడు.

గిరిధర్ లక్ష్మీపురం పరిసర ప్రాంతాల్లో కాలవ పక్కన కారాపి వెనకసీట్లోఉన్న వాటర్ బాటిల్ అందుకున్నాడు. అది ఖాళీగా వుంది. వెనక సీట్లో వున్న తోలుసంచిలోంచి కొంచెం దూది తీసి, కారు దిగి, వాటర్ బాటిల్ మూతి కడ్డంగా దూదిపెట్టి, కాలవలో నీరుపట్టాడు. ఆ నీళ్ళతో మొహం కడుక్కొని, కొంచెం నీళ్ళు తాగేడు. నీళ్ళు తాగుతుండగా, అతని దృష్టి కాలువ గట్టున, చెట్టుకు వేలాడవేసిన ప్రకటన మీద పడింది. అందులో 'కలరా-జాగ్రత్త. కాలవనీరు బాగుగా మరిగించి, వడబోసి త్రాగవలెను.' అని వుంది. మిగిలిన నీరు పారబోసి, తిరిగి కారు స్టార్టు చెయ్యబోతూ, అనుమానంగా తన నాడి చూసుకున్నాడు. అసలే అస్వస్థత, తరువాత బడలిక, పైగా మనోవ్యథ. వీటితో మొహమంతా చెమటలు క్రమ్మి, నీరసంగా వున్నాడు. ప్రయత్నం మీద కారు స్టార్టుచేసి బయలుదేరాడు.

కారు మరో రెండు మైళ్ళ దూరం వెళ్ళగానే ఒక అడ్డరోడ్డు దగ్గర, ఐదేళ్ళ కుర్రాడిని ఎత్తుకున్న ఒక స్త్రీ, మరో యువకుడు రోడ్డు కడ్డంగా నిలబడి కారు ఆపుచేశారు.

'బాబూ-యీ కుర్రాడి కివ్వాళే కలరా తగిలిందండి. ఈ కుర్రాడి తండ్రి పొద్దుగుంటయ్యి ఈ రోడ్డునే బండి తోలుకు పోయాడండి. ఓ కోసు లెక్కెళ్ళుంటాడు. దయుంచి యీ తల్లినీ, కుర్రాణ్ణీ, ఆ బండికాడ దిగబెట్టారంటే, ఆ బండిమీద లచ్చింపురం ఆస్పత్రి కెళ్ళిపోతారు బాబూ' అన్నాడు గ్రామస్థుడు ప్రాధేయ పూర్వకంగా.

'ఇందుకా కారాపింది. డామ్-ఫూల్ ... నా కూడా కలరా రావాలనా మీ ఏడుపు... అడ్డు తప్పుకోండి.' అంటూ తిట్టి కారు స్టార్టు చేశాడు.

కారు వేగంగా పోవడంలో రెండు మూడు సార్లు రోడ్డు పక్కకు లాగేస్తోంది. కాళ్ళూ చేతులు స్వాధీనం తప్పుతున్నట్లు అనుమానంతో మరింత పట్టుదలతో ప్రయాసతో కారువేగం హెచ్చించాడు. మరో రెండుమైళ్ళు వెళ్ళేటప్పటికి ముందొక రెండెడ్ల బండి వుంది. దాన్ని తప్పించే ప్రయత్నంలో కారు హారన్ విరామం లేకుండా అలాగే మోగించాడు! కారు బండిని సమీపిస్తున్నకొద్దీ, గిరిధర్ కళ్ళు మసకలు కమ్మేయి. బండిని తప్పించలేక, బండికి సమానాంతరముగా కారుకి బ్రేక్ వేసి, స్టీరింగ్ చక్రంమీద మొహం వాల్చేశాడు. కారు ఆగిపోయింది కాని హారన్ మాత్రం యింకా మోగుతూనే వుంది.

ఆ బండి తోలే మనిషిది కుంచి కండలు తేరిన బలిష్టమైన శరీరం. కారు ఆగిపోవడంచూసి, తక్షణం పరిగెత్తుకువచ్చి, బలవంతం మీద తలుపు తెరిచి, గిరిధర్‌ని స్టీరింగ్ చక్రంమీదనుంచి లేవదీసి చేతుల మీద మోసుకుపోయి బండిలో పడుకోబెట్టేడు. మరోయిద్దరు బాటసార్లకు నచ్చచెప్పి, కారు కాపలా పెట్టి, బండి తోలుకుని నాలుగు మైళ్ళ దూరంలోవున్న లక్ష్మీపురం ఆరోగ్య సదనానికి బయలు దేరాడు.

ఆదే సమయంలో అంతక్రితం గిరిధర్ కారు ఆపు చేసిన యువకుడు పొలాల గట్లువెంట అడ్డదారిని పరిగెత్తుకుంటూ వచ్చి, రోడ్డెక్కి, యీ బండిని చూసి ఓ ఫర్లాంగ్ దూరంనుంచే "అచ్చయ్య మామా బండి ఆపు ... అచ్చయ్య మామా బండి" అంటూ కేకలు పెట్టేడు. బండిలో పడుకున్న పెద్ద మనిషిని త్వరగా హాస్పటల్‌కు చేర్చాలన్న ఆత్రుతతో ఆ అచ్చయ్యకి, ఈ కేకలు వినబడక, బండిని పరిగెత్తించేడు. మరింత వేగంగా పోతున్న బండికేసి చూస్తూ, వెనక నుంచి పిల్లవాణ్ణి, ప్రయాస పడుతూ, పరుగు పరుగున వస్తున్న తల్లిని చూసి నిట్టూరుస్తూ నిలబడి పోయాడా యువకుడు :

34

లలిత సకాలంలో చేసిన పరిచర్యలతో, గిరిధర్‌కుమార్ స్పృహ వచ్చి తేరుకున్నాడు. గుమ్మంలో బండిమీద తీసుకువచ్చిన అచ్చయ్య ఆతృతగా నిలబడి చూస్తున్నాడు.

'నే నిప్పు డెక్కడున్నాను?' గిరిధర్ అడిగాడు.

"డాక్టర్ శ్రీదేవిగారి ఆరోగ్య సదనంలో" లలిత చెప్పింది.

"శ్రీదేవిగారున్నారా?"

"లేరు. కలరా సహాయోద్యమంలో వున్నారు."

"మీరెవరు? ఎక్కడో చూసిన జ్ఞాపకముంది. కాని జ్ఞాపకం తెచ్చుకునే స్థితిలో లేను."

● మధ్యప్రదేశ్ బొండరీలో ఓ చోట:—

1 డు: ఈ గదిలో ఐదు దోమలున్నాయి; మూడు మొగవి; రెండు ఆడవి.

2 వ వాడు: దోమల్లో కూడా నీకు మొగా ఆడా యెలా తెలిసాయి?

1 డు: దాని కేముంది? మూడు దోమలు సారా సీసామీద వున్నాయి; రెండేమో మొహం చూసుకునే అద్దంమీ దున్నాయి!

"వివరాలన్నీ తరవాత చెబుతాను. ప్రస్తుతం నే నిక్కడ 'నర్సు'గా పని చేస్తున్నాను."

"నే నిక్కడ కెలా వచ్చాను?"

"అచ్చయ్యనీ — ఓ పొరుగూరి రైతు. మీరు కార్లో స్పృహ తప్పి పడిపోయి వుంటే తన బండిలో ఎక్కించుకు వచ్చేడు."

"నన్నెందుకు తీసుకు వచ్చేడు సిస్టర్ ... నన్నలాగే వదిలెయ్య వల్సింది."

"అలాంటి స్థితిలో వున్న తోటి మానవుల్ని, నిస్సహాయంగా విడిచి పెట్టి వెళ్ళేటంత కిరాతకులు కాదు యీ పల్లె ప్రజలు."

"కాని అలాంటి కిరాతకుడికే సహాయం చేశాడు."

"మీ రేదో ఆవేశంలో వుండి ఆత్మ దూషణ చేసుకుంటున్నారు, డాక్టర్. కాని మీ ఔదార్యం, దాతృత్వం నాకు తెలియనివి కావు."

"నాకూ తెలియనివి కావు. నిజం తెలుసుకుంటే నన్ను క్షమించవు సిస్టర్."

"ముందర మీరు విశ్రాంతి తీసుకోండి."

● ● ●

..బయట అలికిడి విని లలితలోపల్నుంచి వరండా మీదకు వచ్చింది. గిరిధర్ కుమార్ని రక్షించిన అచ్చయ్య ఎదురయ్యి చేతులు జోడించి "అమ్మా మా కుర్రాడికి కలరా తగిలింది. రక్షించాలి తల్లీ... మీదే భారం" అని అంటుంటే వెనకాలే పిల్లాడినెత్తుకుని, కారులో ఎక్కించుకోడానికి గిరిధర్ నిరాకరించిన తల్లి నిలబడింది.

"అరెరె! అలాగ, ముందర మీరు కలరా అన్నమాట పైకి అనకండి. ఆ డాక్టరమ్మగారి కారు షెడ్డు ఖాళీగా వుంది. ఒక మంచం, పెట్టె అన్నీ అక్కడికి పంపిస్తాను అచ్చయ్యా. ఈలోగా అక్కడ కొంచెం శుభ్రం చేయించుతాను. ఈలోగా మీ రెక్కడికీ, యీ హాస్పటల్లో అటుయిటు పచారు చేయకుండా యిక్కడే కూర్చోండి" అంటూ ఆ యేర్పాట్లు చేయించడానికి వెళ్ళింది లలిత.

కుర్రాడు స్పృహ లేకుండా తల్లి ఒళ్ళో పడుకుని వున్నాడు. లలిత లోపల్నుంచి వచ్చి, ఒక చిన్న గ్లాసుతో మందు తీసుకువచ్చి, తల్లికి యిచ్చి వెళ్ళింది. తల్లి కుర్రాడికి పట్టింది. అచ్చయ్య పిల్లాడికేసి ఆత్రుతగా చూస్తూండగా, అతని భార్య అంది.

"ఉన్నట్టుండి రాముడన్న కేకకైనా అందకుండా పరిగెత్తించేసేవే బండి!"

"దారిలో ఓ మారాజు కారు నడుపుతూ నడుపుతూ కార్లోనే మాట లేకుండా కూలబడిపోతే, కలరా ఏమోనని ఆయన్ని గబగబ బండిమీద యిక్కడకు తీసుకొచ్చేశాను."

"అం...ఆ కారు నడుపుతుంటూ వచ్చిన మనిషేనా?"

"ఏం?"

"దార్లో కారాపి కూతంత లెక్క కారుమీద తీసికెళ్ళి బండికాడ నన్ను, బుల్లోణ్ణి దిగబెట్టమంటే, కళ్ళురిమి చక్కాపోయాడు."

"పాపం. ఆయనేం చేస్తాడే. ఓ మూల ఆయన ప్రాణం మీదకే వొచ్చి పడితే!"

"ఏమో! యీ కారు పేటిరయి లేకపోతే, రాముడన్న కేక నీకు వినబడేది. ఈ రెండు కోసులూ కాళ్ళు పగిలేలాగ పరిగెత్తడం నాకు తప్పేది.

అచ్చయ్యకి, భార్యకి మధ్య జరిగిన సంభాషణ ప్రక్క గదిలో పడుకున్న డాక్టర్ గిరిధర్‌కి వినబడింది. తనకి అచ్చయ్యకీ వున్న తేడా గ్రహించి పశ్చాత్తాపంతో, తల దించుకుని, తక్షణం లలితని పిలిచేడు.

"ఏం డాక్టర్!"

"ఈ గదిలోనే ఆ కుర్రాడికి మంచం వేయించు సిస్టర్."

"మీ ఆరోగ్య పరిస్థితి కూడా బాగాలేదు. ఈ స్థితిలో ఆ కలరా రోగిని ... ..."

"ఇక్కడ వుంచితే నాకూ కూడా కలరా వస్తుందంటావ్. వచ్చినా సరే!"

"నరాల బలహీనతవల్ల వచ్చిన షాక్ నుంచి మీరింకా తేరుకోలేదు. ఈ పరిస్థితిలో ఆ రోగి నిక్కడకు తీసుకు రాకపోయినా, ఈ వాతావరణంలో మీకు కలరా తగలడానికి అవకాశాలున్నాయి. అందుచేత ..."

"నేను భయపడ వలసిందేమీ లేదు. వెంటనే యిక్కడ మంచం వేయించు. డాక్టర్‌గా కాకపోయినా, యీ హాస్పిటల్ ధర్మకర్తలలో ఒకణ్ణిగా ఆదేశిస్తున్నాను. వెంటనే రోగి నిక్కడ ప్రవేశపెట్టి 'డెక్స్ట్రోస్-సెలైన్' యింజక్షనివ్వడానికి ఏర్పాటుచెయ్యి"

"సరే డాక్టర్"

35

కలరా పాకలన్నీ ఖాళీ అయిపోయాయి. మందులూ, పరికరాలు, తదితర సామగ్రి, లారీలలో ఎక్కిస్తున్నారు. ఆనాటి సాయంత్రం గ్రామస్థులంతా, శ్రీదేవి మొదలయిన డాక్టర్లందరికీ కృతజ్ఞతా పూర్వకమైన వీడ్కోలు యిస్తూ, ఆ సందర్భంలో అల్పాహార విందు ఏర్పాటు చేశారు. అదే సమయంలో కార్లో చంద్రశేఖరరావు గారు, కవి, హుస్సేన్ దిగి వీళ్ళను కలుసుకున్నారు. వేణు అందర్నీ అందరికీ పరిచయం చేసేక, అందరూ అల్పాహారానికి కుర్చీలలో కూర్చున్నారు.

"శ్రీదేవమ్మగారి ఋణంకాదు, ఈ యువతీ యువక డాక్టర్ల ఋణం

కాని, యీ వలంటీర్ల ఋణంకాని, యీ జన్మలో తీర్చుకోలేం' అన్నాడా గ్రామ పంచాయతీ ప్రెసిడెంటు తన కృతజ్ఞత తెలియజేస్తూ.

'మేం చేసిందేమీ లేదు. మానవ జన్మెత్తినందుకూ, వైద్యవృత్తి నవలంబించినందుకు, ఇది మా కనీస విధ్యుక్త ధర్మం' అంది డాక్టర్ శ్రీదేవి సహజమైన వినయంతో.

'మీ సేవాదీక్షని పొగడటానికి కూడా అర్హత లేనివాణ్ని. దానికి కారణం మరి మీరన్న మానవత్వం నాలో లేకపోవడమో లేకపోతే వాతావరణ దోషమో' అన్నాడు చంద్రశేఖర్రావుగారు. వార్తా పత్రికలద్వారా డాక్టర్ శ్రీదేవిని గురించి తెలుసుకున్నాడుగాని, ఆవిణ్ణి చూడటం యిదే మొదటిసారి. ఈ వుద్యమంలో ఆమె చూపిన మానవసేవ రీత్యా ఆమె అంటే పూజ్యభావం ఏర్పడింది.

'జమీందారుగారివల్ల మా కో ఉపకారం జరగాలి. ఈ గ్రామంలో హాస్పటల్ కట్టించమనీ, గవర్నమెంటుకి అర్జీ పెట్టుకున్నాం. ఇంకా గ్రాంటివ్వలేదు. పెద్దవారు తమరు కొంచెం మాట సహాయం చెయ్యాలి.' గ్రామ పంచాయతీ ప్రెసిడెంట్ చంద్రశేఖర్రావుగారి మాటల్లో ఔదార్యాన్ని పురస్కరించుకుని యీ ప్రస్తావన తీసుకొచ్చేడు.


'ఆయన తలచుకుంటే మాట సహాయ మేమిటి, ధన సహాయం చేస్తారు, ఏం డాక్టర్?' అన్నాడు అతిథిగా వచ్చిన కవి శ్రీదేవికేసి తిరిగి.

'కాదంటానా! మన తెలుగుగడ్డ దానానికి ధర్మానికి, త్యాగానికి పుట్టిల్లు. లక్ష్మీపురం జమీందారుగారు, మా హాస్పటల్ కి సాలీనా పదివేల రూపాయలు ఆదాయం వచ్చే ఆస్తి యిచ్చారు. అందుచేత యిలాంటివారు తలచుకుంటే... ...'

'మానవ మాత్రుణ్ణి. దేవతాతుల్యులైన శ్రీదేవిగారు ఆజ్ఞాపిస్తే కాదంటానా! లక్ష్మీపురం జమీందారు గాంధీగ్రాం నాకు ప్రాణమిత్రుడు. అతను బతికివుండగా అతని మార్గాల ననుసరించక పోయినా, యిప్పుడైనా అతని అడుగుజాడల్లో నడిచే అవకాశం లభించింది. చెప్పండి డాక్టర్. ఇక్కడ హాస్పటల్ నడవడాని కెంత డబ్బు కావాలి?'

'చిన్న బిల్డింగు, ఒక సంవత్సరానికి సరిపడ్డ మందులూ, తదితర పరికరాదులూ ... ముందు వీటికి కనీసం ఏభయివేలైనా అవుతుంది. ఒక డాక్టరు, ఒక నర్సు, ఒక కంపౌండరూ, ఒక మంత్రసాని, యీ నలుగురి జీతాలకయ్యే ఖర్చు భరించడానికి సాలీనా పదివేల రూపాయలు వచ్చే ఆస్తికాని, కొంత నిధికాని వుండాలి.

'ఈ భారం నేను సంతోషంగా భరిస్తాను. జీవితంలో ఒక్క మంచి



పని చేసిన సంతృప్తైనా కలుగుతుంది. ఇంతకీ యీ హాస్పిటల్ నిర్వహణకి బాధ్యత వహించగలిగిన సరియైన డాక్టరు దొరకాలి. ఆ బాధ్యత డాక్టర్ శ్రీదేవిగారిదే' చంద్రశేఖర్రావుగారి మాటలు విని అందరూ సంతోషంతో కరతాళధ్వనులు చేశారు. ఈ నిర్ణయానికి అందరికంటే ఆశ్చర్యపడింది వేణు. ఆ తరవాత ఆశ్చర్యపడింది పద్మ.

'మీ రందరూ అంగీకరిస్తే నా హౌస్ సర్జెన్సీ పూర్తవగానే యీ ఉద్యోగంలో ప్రవేశిస్తాను' అన్నాడు వేణు. మరోసా రందరూ చప్పట్లు కొట్టేరు.

'శహబాష్! భాయ్' అన్నాడు భుజం చరుస్తూ హాన్సెన్.

ఆనంద పారవశ్యంలో గ్రామ పంచాయితీ ప్రెసిడెంట్ లేచి 'ఈనాడు మా గ్రామ చరిత్రలో ఒక పవిత్రమైన దినం. చిరకాలంగా హాస్పిటల్ ప్రసక్తి యిక్కడికి రావడం, అది యిటువంటి గొప్ప పథకంగా పరిణమించడం ... ఇదంతా కేవలం యీశ్వర సంకల్పం. మీ అందరికీ మా గ్రామస్థుల తరఫున కృతజ్ఞతా వందన సహస్రాలర్పిస్తున్నాను. మరొక మనవి. ఇక్కడ త్వరలోనే చంద్రశేఖర్రావుగారి దయవల్ల వెలిసే ఆస్పత్రికి 'చంద్రశేఖర వైద్య సదనం' అని పేరుపెట్టి, దాన్ని ఒక దేవాలయం కంటే పవిత్రంగా చూసుకుంటూ, దాని పోషణకి,

అభివృద్ధికీ, పరివిగా విరాళాలూ, స్థిరాస్తులూ, మా చుట్టుప్రక్క గ్రామా లన్నిటినుంచీ సంపాదించే బాధ్యత నేనూ, మా సహచరులం వహిస్తామని మీకు హామీ యిస్తున్నాం." అన్నాడు.

ఈ లోగా యీ వార్త విన్న గ్రామస్థులు అల్పాహార విందు పూర్తయ్యే టప్పటికి పూలదండలు తీసుకువచ్చి, అతిథు లందరి మెళ్లోనూ వేశారు. చంద్రశేఖరరావుగారు తన మెడలోని దండ తీసి వేణుకి వెయ్యడంతో అందరూ వేణూ మెళ్ళో వేశారు.

హర్షధ్వనుల మధ్య వేణు మెళ్లో దండలు తీసి టేబుల్ మీద వుంచి అందరికీ నమస్కరించి నిలబడి "మానవసేవే జీవిత పరమావధిగా పెట్టుకుని ఓర్పుతో, దీక్షతో, ఒక మహోత్తరమైన వైద్యశాలను లేవదీసి అభివృద్ధిచేసి, శాశ్వతమైన కీర్తి ప్రతిష్ఠలను ఆర్జించిన డాక్టర్ శ్రీదేవి మా అందరికీ మార్గదర్శిని అయ్యేరు. వారి అడుగుజాడల్లో నడవటానికి కావల్సిన ఆత్మ విశ్వాసం, మనోబలం నాకు లభించే టట్టు దీవించమని మిమ్మల్నందరినీ ప్రార్థిస్తున్నాను" అని కూర్చున్నాడు.

అందరూ లేస్తున్న సమయంలో ఒక వలంటీర్ డాక్టర్ శ్రీదేవి కొక కవరు అందించేడు. అది చింపి చదువుతూ, ఖాళీ కవరు కిందకి జారవిడిచింది. వేణూ దృష్టి అప్రయత్నంగా ఆ దస్తూరిమీదపడి అది తీసి చూసేడు. అది లలిత దస్తూరి.

"మా హాస్పిటల్ కి ఒక కలరా కేసు వచ్చిందట, దైవవశాత్తూ డాక్టర్ గిరిధర్ కుమార్ అక్కడికి రావడంవల్ల ఆయనే ఆ రోగికి స్వయంగా చికిత్స చేశారుట. మా అసిస్టెంటు రాసింది" అంది డాక్టర్ శ్రీదేవి.

"ఓ. గిరిధర్ అక్కడే వున్నాన్నమాట" చంద్రశేఖరరావుగా రడిగేడు.

"అతని కూడా ఒంట్లో బాగా లేదుట."

"పదండి ముందర ఆయన్ని చూడాలి" అన్నాడు వేణు.

ఈ వార్త వినకుండా పద్మా, లిల్లీ, కవి, రఘూ, హుస్సేన్ కార్లో కూర్చున్నారు. పద్మ కారు స్టార్టు చేసింది. వేణూ పరుగుతో వచ్చి కారెక్కాడు.

"పద్మా. త్వరగా మనం ఆరోగ్య సదనానికి వెళ్ళాలి. నీకక్కడో నాటకం చూపెడతాను" అన్నాడు వేణు.

"నా కసలు ఆరోగ్య సదనం పేరు చెబితేనే భయంగా వుంది. మళ్ళీ చందాలు వసూలు చేస్తావా ఏమిట్రా? ముందర చెప్పు" కవి అడిగాడు అనుమానంగా.

"కారు తోయించకుండా వుంటే చాలు" అంది లిల్లీ.

36

గిరిధర్ మంచం మీదే పడుకుని పేపర్ చదువుకుంటూ వుండగా పక్కనున్న మంచంమీద అచ్చయ్య కొడుకు కూర్చుని, రొట్టె పాలూ తీసుకుంటున్నాడు. అచ్చయ్య రెండు మంచాల వెనకాల నిలబడి విసనకర్రతో యిద్దరికీ విసురుతూ వున్నాడు. అదే సమయంలో ఆ గదికీ, డిస్పెన్సరీకి మధ్య నున్న తలుపు తెరచుకుని లలిత ప్రవేశించింది.

"అచ్చయ్యా; మీ కుర్రాణ్ణివ్వాళ డిశ్చార్జి చేస్తున్నాం. తీసుకెళ్ళి పోవచ్చు" అంది.

"వద్దు సిస్టర్. ఇవ్వాళ కూడా యిక్కడే వుండి, విశ్రాంతి తీసుకొని రేపొద్దున తీసుకెళ్ళి పోతాడు. ఈ ఏభై రూపాయలు నీదగ్గరుంచుకుని ఆ కుర్రాడు పూర్తిగా తేరుకునే వరకూ నేను రాసిచ్చిన టానిక్కులు తెప్పించి ఇవ్వు." అంటూ గిరిధర్ పర్సులోంచి డబ్బు తీశాడు.

"వద్దు బాబూ వద్దు. తమరు నా కుర్రోణ్ణి రక్షించేరు. అదే పదివేలు. నేను రెక్కల కష్టం చేసి బతికే రైతును. ఊరికే వచ్చుకున్న డబ్బు మాకొంగదు అమ్మా— ఆ డబ్బు ఆయన పేరిట ఆస్పత్రి చందా కింద జమ కట్టించండి. మరి పన్లోకి వెళ్లొస్తానమ్మా ... శలవు బాబూ" సవినయంగా నిరాకరించాడు అచ్చయ్య.

అచ్చయ్య మొలలోంచి, సంచి తీసి, అందులోంచి ఒక పదిపైసల నాణెం తీసి కుర్రాడి చేతిలో పెట్టి, మళ్లీ ఇద్దరిదగ్గిరా శలవు తీసుకుని వెళ్ళిపోయేడు.

"అతను డబ్బు తీసుకుంటే, ఎంతో సంతోషించేవాణ్ణి"

"అతను మానాభిమానాలు కల రైతుబిడ్డ. డబ్బు నిరాకరించడంలో ఆశ్చర్యం లేదు"

"కాని అతను నా ప్రాణాలు కాపాడేడు. అతని ఋణం ఎలా తీర్చుకోగలను?"

"ఈ యేభై రూపాయల తోటి తీర్చుకుందామనుకున్నారా డాక్టర్. అతను రక్షించిన ప్రాణం ఖరీదు కూడా అంతేనేమో!"

"ఎవరు నువ్వు? ఇక్కడ పొట్టకూటికై పనిచేసే నర్సువా, లేకపోతే నాకు జ్ఞానబోధ చెయ్యటానికి ఉద్భవించిన దేవతవా?" అన్నాడు గిరిధర్ తీక్షణంగా.

"ఈ హాస్పిటల్ పరిచారికనే. కాని పొట్టగడవక రాలేదు."

"పరిచారికవో! పిశాచానివో నాకు తెలీదు. అతను నా ప్రాణాలు రక్షించేడన్న అభిమానంకొద్దీ ప్రాణానికి తెగించి వైద్యంచేసి, కుర్రాడి ప్రాణం దక్కించేను. పైగా ఓ యాభై రూపాయలు యిద్దామను

ఉంటే, నా ప్రాణానికి ఖరీదు కడతారా?'

'మీరు ఒక ప్రాణం రక్షించేరని గర్విస్తున్నారేమో కాని, మీ చేతులారా నూరు ప్రాణాలు తీశారు.'

'ఏమిటీ పేలాపన?'

'నాలాంటి దిక్కులేనిదాని పేలాపన నన్నొక్కర్తెనే బాధపెడుతుంది. మీలాంటి పెద్దల పేలాపనపైన వందలమంది జీవితాలాధారపడి వుంటాయి. జ్ఞాపకం తెచ్చుకోండి. ఆనాడు కలరా పీడితుల సహాయార్థం మీ హాస్పిటల్ తరఫున ఒక వైద్యబృందాన్ని పంపించడానికి జరిగిన నిర్ణయం, మీ వుపన్యాస ఫలితంగా విఘ్నం చేశారు. నిజంగా మరికొంతమంది డాక్టర్లు వస్తే మరో వంద ప్రాణాలు దక్కేవి. ఈనాడు ఆకస్మికంగా రావడం తటస్థించక పోతే ఆ కుర్రాడు బ్రతుకునో, చచ్చునో! ఇలాగ వైద్య సహాయం లేక ఎంతమంది చచ్చిపోయారో మీకు తెలుసా? దీనికెవరు కారణం? ఎంతో విశాల హృదయంతో రెండువందల రూపాయలు చందా యిచ్చేరని విన్నాను. ధనవంతుల ప్రాణాల్ని వాళ్ళ సమానమైన ధనంతోకే విలువ కడదామని యిందాకా అలా అన్నాను.'

'నీకెవరు చెప్పారు యిదంతా?'

'మీ హాస్పిటల్ డాక్టర్ ఒకాయన శ్రీ దేవిగారికి వుత్తరం రాశారు.'

'శ్రీ దేవిగా రేమన్నారు?'

'మీకు ధనం, విజ్ఞానం, హృదయం వున్నాయి కాని, ఆవేశం ఎక్కువ; ఆలోచన తక్కువ' అన్నారు.'

'అయితే అవన్నీ మనసులో పెట్టుకునే, ఈ రెండు రోజులూ నాకు పరిచర్య చేశావన్నమాట.'

'నా విద్యుక్త ధర్మాన్ని నెరవేర్చాను. ఆపదలో వున్నప్పుడు పరమ శత్రువుకైనా సేవ చెయ్యవల్సిందే. అటువంటిది – ఒకప్పుడు నా మానాన్ని కాపాడిన మీకు సేవచెయ్యడంకంటే నా కదృష్టం ఏముంది?'

'కర్ర విరగ కూడదూ – పాము చావకూడదూ' అన్న సామెతగా మాట్లాడుతున్నావు. హృదయం లేని కిరాతకుణ్ణన్న మరుక్షణంలోనే నీ మానాన్ని కాపాడిన దేవత నంటున్నావు.'

'మీరు రెండునూ. దానికి కారణం మీ ధనం. మీ జీవితంలో సమస్య లేదు. మీ కితరుల సానుభూతిలో లెక్కలేదు. మీ కవసరమైన వస్తువులకే విలువ యిస్తారు. మిగిలిన విషయాలను గురించి ఆలోచించరు. నిజంగా మీరు ఆనాడు లోతుగా ఆలోచించే యిచ్చారా మీ వుపన్యాసం?'

'లేదు సిస్టర్. వ్యక్తిగతమైన ద్వేషాన్ని పురస్కరించుకుని కేవలం నా వాదాన్ని నెగ్గించుకోటానికి

ఆ నాడలా పిలానూ. దాని ఫలితాన్ని అర్థం చేసుకునే విచక్షణా శక్తి కూడా లేని వయస్సు. నిజం చెప్పావు సిస్టర్.'

'క్షమించండి. మీ నేరం మీ చేతనే ఒప్పించాలన్న ఆవేశంలో మీ మానసిక అస్వస్థత సంగతి కూడా పాటించకుండా మీకింత ఉద్రేకం కల్గించాను. విశ్రాంతి తీసుకోండి. మీరు మందు తీసుకోటానికి టైమయింది. కలిపి పట్టుకొస్తాను.'

37

డిస్పెన్సరీలో లలిత మందు కలిపి, దానికి లేబుల్ అతికిస్తూ వుండగా అదే సమయంలో వేణూ డిస్పెన్సరీ గుమ్మంలోంచి 'హల్లో నర్స్' అంటూ లోపలి కొచ్చేసేడు. లలిత తన కళ్ళను నమ్మలేనంత ఆశ్చర్యంతో ఆనందతన్మయంలో 'బావా' అంటూ వేణూ వైపుకు ఒక్క పదడుగులు వేసి, మళ్ళీ తన ఆవేశాన్ని అంకట్టుకుని ఆగిపోయింది.

'ఎప్పుడొచ్చావు బావా? నేనిక్కడున్నట్టు ఎలా తెలుసు?'

'డాక్టర్ శ్రీదేవికి వచ్చిన వుత్తరం దస్తూరీనిబట్టి.'

'నువ్వొక్కడివే వచ్చావా?'

'భార్యా సమేతంగా వచ్చాను లలితా!'

'ఆఁ... పద్మొచ్చిందా! ఏది!'

'వెనకాలొస్తోంది. మా పెళ్ళికి నువ్వు రాలేదని ఎంతో విచారించాం. ఆశీర్వదించిన దానివి పెళ్ళి చేయించి మరీ వెళ్ళొద్దూ. నీకు రాద్దామనుకుంటే నీ ఎడ్రస్ తెలీదు.'

'హార్టీ కంగ్రాచులేషన్స్' అంటూ లలిత వేణూవయిపు చెయ్యి జాచింది.

'థేంక్స్' అంటూ చెయ్యి అందుకుని, దగ్గరకిలాగి, ఛెళ్ళున లెంపకాయ కొట్టేడు.

లలిత ఖిన్నురాలై, చెంపమీద చెయ్యి వేసుకుని, అలాగే నిలబడిపోయింది. అంతవరకూ వరండా మీద తలుపవక్కన నిలబడి యిదంతా వింటున్న పద్మా, లిల్లీ, రఘూ, కవి, హుస్సేన్‌లు ఒక్కసారిగా లోపలికి ప్రవేశించారు. పద్మ సరాసరి లలితదగ్గరకు పరిగెత్తుకెళ్ళి కౌగలించుకుంది.

'లలితను కొట్టడానికి చేతులెలా వచ్చాయి వేణూ? ఇదంతా నా తప్పు. నాకు తగలవలసిన దెబ్బ నీకు తగిలింది లలితా. వేణూ నాకు ఎప్పుడూ సోదరుడే. మీ ప్రేమానురాగాలు తెలియక, మీ యిద్దరికీ ఎడబాటు కలిగించేను. మన్నించు.' అంటూ అనునయంగా లలిత చేతులు తన చేతుల్లోకి తీసుకుంది.

కవి, హుస్సేను ఒకళ్ళ మొహాలు ఒకళ్ళు చూసుకుంటూ గుమ్మం దగ్గరే ద్వారపాలకుల్లాగా తలుపుకు జార్లాబడి ఆశ్చర్యంగా ఈ దృశ్యం చూస్తున్నారు. రఘు

డిస్పెన్సరీ టేబుల్ దగ్గరకెళ్ళి అక్కడున్న దూదితో 'జడ్జి' వేషానికి తగ్గట్టుగా ఒక 'విగ్గు' తయారుచేసి, పక్కనేవున్న మందుల బీరువా మీద నల్లగుడ్డ తీసి 'గౌన్' లాగా కోటుమీద వేసుకుని, విగ్గు నెత్తిమీద పెట్టుకుని; టేబుల్ వెనకాల వున్న స్టూల్ మీద కూర్చున్నాడు.

'జరిగిందంతా చూస్తే: నా నేరం కూడా అర్థమవుతోంది. నేను నీకూ వేణూకు, పద్మకీ కూడా క్షమాపణ చెప్పుకోవాలి' అంది లిల్లీ.

జడ్జి వేషంతో రఘు టేబుల్‌మీదున్న కల్వంతో చప్పుడు చేస్తూ 'ఆర్డర్! ఆర్డర్. ఇందులో అందరూ నేరస్థుల్లాగే కనబడుతున్నారు. న్యాయం విచారించవల్సింది మనం. మనమిప్పుడు జడ్జి... అంటే మనముందున్నది 'కేసు' అని లిల్లీని అడిగేడు.

'వేణు అనబడే యీ ముద్దాయి పంతులిగా, నిస్సహాయురాలిగా వున్న లలితఅనే ఈ అమ్మాయిముందు చెయ్యిచేసుకున్నాడు. అందుచేత ఇండియన్ పీనల్‌కోడ్ సెక్షన్ ...' లిల్లీ చెబుతోంది.

'...ఆడదానికి కొంచెం అదహా తడహా తగలాలి యువరానర్' కవి అన్నాడు.

'అందులోనూ కాబోయే పెళ్ళాం. అంచేత కేసు కొట్టెయ్యి జడ్జిభాయ్' హాస్యనస్ సలహా ఇచ్చాడు:

ఇంతలో పక్కగది తెరచుకుని గిరిధర్ కుమార్ లోపలి కొచ్చి గుమ్మం పట్టుకుని 'ముఖ్యమైన నేరస్తుణ్నిక్కడున్నాను' అంటూ నీరసంగా అడుగు లేసుకుంటూ ముందుకు వచ్చేడు. పద్మా, వేణూ చెరో జబ్బా పట్టుకున్నారు. అందరూ ఆశ్చర్యంగా గిరిధర్‌కేసి చూస్తున్నారు.

'మీరిలా లేచిరావడం మంచిది కాదు డాక్టర్. మీరింకా విశ్రాంతి తీసుకోవాలి' అంది లలిత.

'ఇప్పుడు నాకు విశ్రాంతికంటే మనశ్శాంతి ముఖ్యం' అన్నాడు గిరిధర్.

అదే సమయంలో శ్రీదేవి, చంద్రశేఖరరావుగార్లు గుమ్మంలోంచి యీ కోర్టు సీను చూసి అక్కడే నిలబడిపోయి గిరిధర్ వాఙ్మూలం వినసాగారు. లిల్లీ లలితను పక్కకిలాగి జరిగిన కథంతా క్లుప్తంగా చెప్పింది.

'నేను పద్మా వేణులమధ్య అక్రమంగా ప్రవర్తించిన మాట వాస్తవమే. అది నా హృదయ దౌర్బల్యం వల్ల జరిగిన నేరం. అంతకంటే ఘోరమైన నేరం చేశాను. విద్యా గర్వంవల్ల, అంతులేని అహంభావం వల్లా, వైద్య సహాయం జరగకుండా చేసి యీ పల్లె ప్రజలకి ద్రోహం చేశాను. చివరకు చావుకు సిద్ధంగా వున్న యీ ద్రోహిని — యీ పల్లె ప్రజలే రక్షించారు. నా నేరానికి...' గిరిధర్ అన్నాడు.

"ఏమిటీ! గిరిధర్ కుమారేనా మాట్లాడేది?" శ్రీదేవి అంది వ్యంగ్యంగా.

"కాదు డాక్టర్ గిరిధర్‌లో ఉన్న మనిషి. నాలో వున్న మానవత్వాన్ని మేలుకొల్పింది సిస్టర్ లలిత"

"ఇకమీరు తీర్పు చెప్పండి యువరానర్" చంద్రశేఖరరావుగారు కోరేరు.

"సరే, ముద్దాయిలను వరుసగా హాజరుపెట్టండి" రఘు ఆర్డర్ వేసేడు.

"యువరానర్. ఈ వేణూ అనే ముద్దాయి, యీ లలిత అనే అమ్మాయిని వంకరిగా, నిస్సహాయురాలిగా చూసి కొట్టేడు." లిల్లీ ఫిర్యాదు చేసింది.

"సాక్షులున్నారా?"

పద్మా, కవీ, హుస్సేన్‌ల కేసి చూపెడుతూ "వీళ్ళూ; నేనూ ఉన్నామండీ."

"ముద్దాయి చెప్పుకోవల్సింది ఏమయినా వుందా?" ముద్దాయికి అవకాశమిచ్చేడు జడ్జి.

"చిత్తం. నేనసలు కొట్టలేదండి. ఆ అమ్మాయే నన్ను ఛెళ్ళున లెంపకాయ కొట్టింది" అన్నాడు వేణు.

"కేసు కొట్టేశాం. ముద్దాయిని విడుదల చేస్తున్నాం. మరి రెండో ముద్దాయి ఎవరు?"

"ఈ లలిత అనే అమ్మాయి హుజూర్" హుస్సేన్ అన్నాడు.

"ఏమిటి నేరం?"

వేణుకేసి చూపెడుతు జాలిగా మొహంపెట్టి "యీ పిల్లోడి ముకంలోకి సూడండి సర్కార్. ఈ అమ్మాయీ యితనూ లైలా-మజ్నూ లాగా, అనార్కలీ - సలీం లాగా, రోమియో - జూలియట్ లాగా, జోరుజోరుగా ప్రేమించుకుంటుంటే, ఆ ప్రేమ తుఫానలో యీణ్ణి ఇడిసి పెట్టేసి యీ అమ్మాయి పలాయిపోయింది. అప్పట్నుంచి యితను తన దిల్‌కి లైలా అయిన యీ లలితను తలుచుకుంటూ ప్రతి రోజూ రాత్రీ పగలూ, ప్రొద్దున్న, మధ్యాహ్నం, సాయంత్రం, రాత్రి, స్నానం, ఆహారం, తిండి, నిద్రా, కాఫీ. టీ, సిగరెట్, అన్ని మానేసి రోడ్లంట తిరుగుతూ "ఛోడ్ గయా బాలమ్" అని పాడుకుంటూ..." కన్నీళ్ళు తుడుచుకుంటూ, ఫిర్యాదు చేసేడు హుస్సేన్. దుఃఖంతో వాక్యం పూర్తి చేయలేకపోయాడు.

కళ్ళు తుడుచుకుని లేచి నిలబడి జడ్జీ "ఇంక ఆపండి నవాబ్జీ, ఘోరం... యింక వినలేను. ఇలాంటి దారుణమైన నేరానికి, మెడకి తాడు తగిలించవల్సిందే. ఈ ముద్దాయి చేసిన దుర్మార్గానికి ప్రతిక్రియగా పబ్లిక్‌గా వూరేగించి ప్రజలందరి సమక్షంలో, ఈ అమ్మాయి మెడకు తాడు తగిలించమని వేణు గోపాలరావుకి అనుజ్ఞ యిస్తున్నాను" అంటూ తీర్పు చెప్పాడు.

"యువరానర్ ... ఇంకా వీళ్ళిద్దర్నీ ఈ గదిలో లాకప్ చెయ్యమని ఆజ్ఞ" కవి అడిగేడు.

"ఏం లేదు మళ్ళీ వాళ్ళని బయటికి లాగడం మనతరం కాదు.

మూడో ముద్దాయిని ప్రవేశపెట్టండి' జడ్జీ ఆర్డర్ జారీ చేశాడు.

'ముద్దాయిపేరు పద్మావతి. ఈ అమ్మాయి పాపం ఈ గిరిధర్ కుమార్‌ని పెళ్ళాడతానని మాట యిచ్చి దగాచేసి పారిపోయింది.' వేణు ఫిర్యాదు చేశాడు.

'ఏమమ్మాయ్. నీ నేరాన్ని ఒప్పుకుంటావా?' జడ్జి ముద్దాయిని అడిగేడు.

'ఏయ్ అమ్మాయ్... నా మాట విని నేరం ఒప్పేసుకో. గొడవొదిలి పోతుంది. లేకపోతే కేసు వాయిదా వెయ్యాలి. అయినా నువ్వు ఒప్పుకునేదేమిటి? కోర్టులో మౌనం పూర్ణాంగీకారసూచకం.. అందుచేత యీ పద్మావతి, ఏ గిరిధర్‌కుమార్ని దగా చేసిందో, అయన యింట్లో యావజ్జన్మ కారాగారం అనుభవిస్తూ ఆయనకి పాదసేవ చేయవల్సినదిగా శిక్ష విధిస్తున్నాను. ఈ నాటి కింక కోర్టు చాలిద్దాం'జడ్జీ లేవబోయాడు.

'మరి డాక్టర్ గిరిధర్ నేరాని కేం శిక్ష విధించారు యువరానర్' శ్రీదేవి నిలదీసి అడిగింది.

'పశ్చాత్తాపం కంటే నేరానికి పెద్ద శిక్ష లేదని ఏసుక్రీస్తుచెప్పాడు. అందుకని కేసు కొట్టేసెం' జడ్జి తీర్పు చెప్పాడు.

'కోర్టుని నిందిస్తున్నావ! రాస్కెల్ జాగ్రత్త' జడ్జి బెదరించాడు.

'ప్రతి నేరస్థుడూ పశ్చాత్తాపపడ తాడు. కాని ప్రతినేరానికి శిక్షపడ వల్సిందే. నా నేరానికి నేనే శిక్ష విధించుకుంటున్నాను. ఏ పల్లె ప్రజలకి నేను ద్రోహం చేశానో, ఆ పల్లె ప్రజలకి నేను బ్రతికున్నంతకాలం ఉచితంగా వైద్యంచేసి, నా ఋణం తీర్చుకో డానికి ప్రయత్నిస్తానని మీ అందరి ముందూ ప్రమాణం చేస్తున్నాను' అన్నాడు గిరిధర్.

అందరూ సంతోషంతో చప్పట్లు కొడుతూ వుండగా చంద్రశేఖ రావుగారూ, శ్రీదేవి కాబోయే దంపతులను అభినందించి, ఆశీర్వ దించారు. రఘూ వేషం తీసేను కుంటూ వుండగా—

'యువరానర్. మరో ముద్దాయి వుండి పోయింది,' అన్నాడు కవి రహస్యంగా.

'ఎవరు?' రఘు అడిగాడు.

'లిల్లీ. ఆవిడకికూడా శిక్షకావా లిటు' కవి అన్నాడు.

'షటప్' అంది లిల్లీ యిది విని.

'వీల్లేదు. కేసు వాయిదా వేశాం' అన్నాడు రఘూ లిల్లీకేసి క్రీగంట చూస్తూ.

ooo

అయిపోయింది.

పుస్తక సమీక్ష

"స్త్రీ"

(సాంఘిక నవల; రచన: ముప్పాళ రంగనాయకమ్మ; ప్రచురణ: ఎమ్. ఎస్. ఆర్. ఎస్. పబ్లికేషన్స్, ఎన్. ఎ. డి. (పోస్టు) విశాఖ పట్నం-9; వెల రు. 5/-)

ఈ నవల పేరును బట్టి కథా ప్రయోజనాన్ని కొంతవరకు ఊహించవచ్చు. పాత పూర్తిగా పోని, కొత్త పూర్తిగా రాని ప్రస్తుత సమాజంలో స్త్రీ స్వాతంత్ర్య సమస్యను, స్త్రీల కష్టసుఖాలు, ఆశయాలు, ఆవేదనలు, దౌర్బల్యాలను ఈ నవల చిత్రిస్తుంది.

ఇందులో ప్రధానమైనవి రెండు స్త్రీ పాత్రలున్నాయి. పద్మజ రచయిత్రికి ఆదర్శమూర్తిలా అనిపిస్తుంది. సనాతనాచారాల సంకెళ్ళను త్రెంచుకుని, కుటుంబాన్ని, సంఘాన్ని అన్నిటిని ఎదిరించి, తాను ప్రేమించిన ఆంగ్లో-ఇండియన్ యువకుని పెళ్ళాడిన బ్రాహ్మణ యువతి పద్మజ. ఆమెజీవితంలో ఆవేదనకు, అపజయానికి అస్కారం లేదు, సంఘర్షణకు స్థానం లేదు (ఉన్నా స్వల్పంగా మాత్రమే); తన జీవితాన్ని తన ఇష్టమైనరీతిగా మలచుకోగల స్థైర్యం కల స్త్రీ. బహుశా అందుకే ఆమెజీవితంలో ఏ ఒడుదుడుకులూ రావు. చివరకామె ఫారిన్‌కూడా వెడుతుంది.

రెండవపాత్ర పద్మజ బాల్య స్నేహితురాలు పార్వతి ఈ నవలకు నాయికపాత్ర ఈమెదే. సంఘ వంచిత; నిత్యదుఃఖిత. కోరినవరుని పొందలేక, కట్నాల దురాచారానికి బలియై అవివాహితగానే వుండిపోతుంది. చెల్లెలికోసం, తమ్మునికోసం తన సర్వసుఖాలను త్యాగంచేస్తుంది. దానికి ప్రతిఫలంగా ఆమెకు మానసిక సంతృప్తి కూడా దక్కదు. అంతా ఆమెను ఏకాకిని చేసి వెళ్ళిపోతారు. పరిస్థితులామెను కుళ్ళబొడుస్తాయి. అయినా ఆమె ధీరోదాత్తత, విశ్వాసం చెక్కుచెదరవు. ఆమెపట్ల జాలితో హృదయం ద్రవిస్తుంది.

ఇంకా, పార్వతిని పెళ్ళాడే ధైర్యం లేకపోయిన రఘు, పార్వతి చెల్లెలు రుక్మిణి, తమ్ముడు సూర్యం, పద్మజ చెల్లెలు సుజాత మొదలైన ఎన్నో పాత్రలున్నాయి. అన్నిటిని అన్నివిధాలుగా, స్పష్టంగా, సిద్ధష్టంగా, సహజంగా, సజీవంగా తీర్చిదిద్దడంలో రచయిత్రి కౌశలం ఎన్నదగినది. ఆమెకు పేరుతెచ్చిన రచనలెన్నో వున్నాయి. కాని, ఈ

ఒక్కనవలే వ్రాసివున్నా ఆమె పేరు కేమీ ధోకా వుండేదికాదు.

ఇతర రచయిత్రి నవలను వ్రాసిన రచయిత్రికి తనా చనపై వచ్చే విమర్శలను సర్దిప్తంగా స్వీకరించగలిగిన ఆత్మ విశ్వాసం వుండవలసింది. కాని పీఠికలో కొందరు పాఠక విమర్శకులను ఆమె అంత ఘాటుగా, తీవ్రంగా విమర్శించడం భావ్యంగాలేదు. అలాగే సాటి ప్రచురణ కర్తలను దుయ్యబట్టడం కూడా పొందాగా లేదు. (ఇలా వ్రాసినందుకు రచయిత్రి ఈసమీక్షకుని ఈ సారి ఏ పీఠికలోనో చీల్చి చెండాడబోరనే ఆశిస్తున్నాను.)

—వి. వి. ఆర్.

● ● ●

దైవహాతులు (నవల), రచన : నరిశేపల్లి లక్ష్మీనారాయణ, దొరకు చోటు : రోషన్నవీధి, తిమ్మనచెర్ల పోస్టు, గుంతకల్లు (ఆంధ్ర), వెల రూపాయి.

రాగబంధాలు : కథల సంపుటి; రచన : 'పార్వతి'; ప్రచురణ : పార్వతి పబ్లికేషన్స్, వైజాగ్; వెల రూపాయి.

ఆడపిల్లల పెళ్ళిళ్ళు – తల్లిదండ్రుల అగచాట్లు; రచన: కె. వి. ఎస్. సూర్యనారాయణరాజు. ప్రతులకు : స్నేహలతా వరకట్న నిషేధ సంఘం, 2-1-402, నల్లకుంట, హైదరాబాదు-20

చిత్రరథుని

"ఆడబ్రతుకు"

అసలే ఆడది. అందులో నాటక కంపెనీ నాట్యతార. నాటకాల డైరెక్టర్‌తో సంబంధం వున్నట్లు పుకారు. ఆమె గొప్పింటి కోడలే అయింది ఒక్కపరతు పైన.

వివాహమైన మరుక్షణం నుంచి ఆ డైరెక్టర్ వైపు కన్నెత్తి చూడరాదు; పెదవి కదిపి మాట్లాడరాదు— ఇదీ షరతు.

ఆ డైరెక్టర్ హంతకుడుగా పరిగణించబడి ఉరికంబమెక్కుతున్నాడు. హత్య జరిగిన రాత్రి ఆ ఆడది ఆ డైరెక్టర్ యింట్లోనే వున్నది. [illegible] లేదు. ఆ సంగతి కోర్టుకు వచ్చి ఆ ఆడది చెబితే అతగాడికి ఉరి తప్పుతుంది. అయితే కోర్టులో అతణ్ణి ఉరికి గురిపెట్టుతున్నది ఆ గొప్పింటి అధినేత — సాక్షాత్తూ ఆమె మామగారు. అసలే అనుమానాల మనిషి.

ఆ ఆడది ముందుకు వెళ్ళి ఆ రాత్రి డైరెక్టర్‌తో అతడి యింటిలో వున్నట్లు చెప్పడమా? మానడమా? చెబితే మానానికి హాని. అసలే ఆడదాని బ్రతుకు. చెప్పకపోతే అమాయకుడు, నిష్కల్మషుడైన మానవుడు ఉరికంబమెక్కుతాడు. ఆడబ్రతుకు ఏ గతి నిర్ణయించుకొంటుంది? జెమినీ వారి "ఆడబ్రతుకు" ఆ ప్రశ్నలువేసి పసందయిన సమాధానమిస్తుంది.

అభినయ, సాంకేతిక ప్రమాణం ఉన్నతంగావున్న ఆ చిత్రం యూనిట్ ముఖ్యులు :

ఎస్. ఎస్. వాసన్, వేదాంతం రాఘవయ్య విశ్వనాథన్ — రామమూర్తి, జానకిరాం (ఆర్టు), ఎల్లప్ప (కెమెరా), రామారావు, రంగారావు, కాంతారావు, దేవిక, ముక్కామల.

జోగ్ జలపాతం వద్ద తీసిన దృశ్యాలు, అనార్కలి కథతో ఉపకథ మేళవింపు, భారీతనం ఈ సాంఘికంలోని మరి మూడు విశేషాలు.

"ఇల్లాలు"

గతం: గతం అంతా "ఇల్లాలు" లో సచిత్ర స్వగతంగా కాన వస్తుంది.

వేణుగోపాలరావు, రాధ కాలేజీ కాలంనుంచీ మ్యారేజికి సోపాన మైన ప్రేమపద సోపాన పటంలో గంతులు వేస్తూ వచ్చారు. వివాహం నిచ్చెన ఎక్కారు. హాయి గడులు ఏడు దాటారు. వివాహ వార్షికోత్సవం జరుపుకొన్నారు. డైరీ వ్రాసుకొన్నారు. ఒకరి హృదయం గురించి మరొకరు లిఖించారు. దాంపత్య జీవిత రహస్య కార్యమది. రాధా గోపాలురకే ఆ సుధా కథా సాగరం తెలుసు. అందులోనే రామేశ్వర యాత్ర సంగతులున్నాయి, పాపపై పిల్ల కలలున్నాయి, దంపతులుఅన్నది మేథమేటిక్స ప్రకారం రెండూ అనే ప్లూరల్ అయినా సైకలాజికల్‌గా, లాజికల్‌గా ఒక్కరే. అన్నంత ఆత్మీయతతో రాధా గోపాలురు జీవితపు సోపాన పటంలో హాయి నిచ్చెనలు ఎక్కుతూనే వచ్చారు. అది అంతా గతం. శోభాయమానమైనది. సినిమా భాషలో చెప్పాలి అంటే ఈస్ట్‌మన్ కలర్ అంత ప్రకాశవంతమైనది.

ప్రస్తుతం; ప్రస్తుతం అంతా ఇల్లాలు' లో కల్లోలమయం. సోపానపటంలోవలె పాములమయం ఇటు తెలుపు-అటు నలుపు. ఏది సత్యం, ఏది అసత్యం-వేణుగోపాలరావు తెలుసుకోలేక కల్లోల పడుతున్నది ప్రస్తుతం. వేణుగోపాలరావు లండన్‌లో ఉండగా పిడుగువంటి వార్త వచ్చింది. భారత పట్టణంలో రాధ జీవితం అంత్య దశలో ఉంది. పశ్చిమం నుంచి తూర్పు వచ్చాడు. కాని ప్రాచ్య సుందరి రాధ అస్తమించింది. ఇక వేణుకు మిగిలింది తన మధుర వేణు గానం కాదు; గతంలో చేసిన ఆ ప్రేమ మధుర వేణుగానం గురించితలపులు, తల పగులగొట్టే జ్ఞాపకాలు. అదే వూరిలో దొంగలరాణి సుధ పోలీసులకు పట్టుబడింది. వేషం తప్పితే సుధ ముమ్మూర్తులా రాధే. ఈ సుధ అటు పోలీసులను, ఇటు భర్తను, అత్తను, సేవకులను, తుదకు ప్లీడర్లను, జడ్జీని హడలుగొట్టే రహస్యాలు బైటపెట్టి తానే రాధను, వేణు ఇంటి 'ఇల్లాలును' అని అన్నది. రాధకుమాత్రమే తెలిసిన డైరీ విషయాలు ఈ సుధ కెలా తెలిశాయి? చచ్చిన రాధ సుధగా ఎలా తిరిగి వచ్చింది? ఏది రాధ? ఏది సుధ? ఎవరు ఇల్లాలు?

న్యాయస్థానంలో అన్యాయాలను ఎదిరించిన అబల సుధ - 'ప్రస్తుతం



"దైవ మిచ్చిన బిడ్డ" చిత్రంలో జమున.

సుధ: గతం 'రాధ'...ఆ తర్వాత మాటలు ప్రసాద్ కళా ప్రసాదంగా సంజీవరావు ఆనంద సంజీవిగా ప్రేక్షకులను ముగ్ధులను చేస్తవి.

పైన సూచించినట్లు 'గతం' ను చాలభాగం ఈస్ట్‌మన్‌కలర్ లోనే చిత్రీకరించారు. వెరసి అయినది "ఇల్లాలు".

గతంనుంచి మొదలెట్టి ప్రస్తుతం తో పేని, ముగింపుతో "శుభం" కావడం కళాభిమానులకు నిజంగా "అశుభం" గత వర్తమానములను పందెపు గుర్రములలా, దాదాపు ప్రక్క ప్రక్క, దాదాపు ఏకకాలంలో పరుగెత్తించడం కళాభిమానులకు నిజంగా దీపావళి. మొన్నటి దీపావళి కళకళలు ముగియకముందే కొత్త కళాజ్యోతులను తిరిగి వెలిగించింది "ఇల్లాలు" కథా కథనమే. దర్శకుడు, ఎడిటర్ సంజీవి.

ప్రేమపద సోపాన పటములో అశయపు నిచ్చెనలకంటే సందేహపు సర్పములతో హెచ్చుగా తటస్థపడి ఏది తెలుపో, ఏది నలుపో, ఏది ఏ

రంగో తెలుసు కాన, సంఘర్షణ సముద్రమును మథించి, ఆ జంతెలును కొన్న పరిశోధకుడు వేణుగోపాల రావు పాత్రధారణ బహు క్లిష్టమైనది. కొత్తనటుడు కె. వి. నాగేశ్వరరావు తొలి ప్రయత్నంలోనే సమర్థ నటుని గా రుజువు పంచుకొన్నారు తాను దూషించిన సుధే, రాధే మో నన్న నిదర్శనాలు దొరుకుతున్నకొద్దీ నాగేశ్వరరావు నటనా ప్రదర్శనం పదునౌతుం వచ్చింది.

గీతాంజలి నటన ఆమెకు గర్వ కారకమైన కళాంజలి.

ఉత్కంఠతపోష పునిగారమట 'పాళీ, సౌందర్య పోషకులుగా తో టు 'కుంచె'. కె. వి. యస్. ప్రసాద్, 'లెన్సు', వేణుగోపాలుని కను వేణువంత మధురంగా వినిపించిన కె. వి. మహదేవన్ 'శ్రుతి', సర్వ పర్యవేక్షకుడు ఎల్. వి. ప్రసాద్ సృష్టిని సర్వ సంతోష దాయకం చేసినవి.

* * *

పి. పుల్లయ్య తదుపరి చిత్రం

పద్మశ్రీవారు "కొత్తకాపురం"తో పాటు మరిరెండు స్క్రిప్టులు కూడా సిద్ధం చేస్తున్నారు.రచన ముళ్ళపూడి. మార్చిప్రాంతాల ఒకటి తుదిసారి ఎన్నుకొని 'ఫలో సెట్స్' అంటారు: హీరోలు నాగేశ్వరరావు, పుల్లయ్య, వెంకటేశ్వర్లు.

అద్దంకికి సినీ తారల కానుకలు

ఆంధ్ర నాటక రంగంలో ఐదవ తరానికి చెంది, హరిశ్చంద్రుడు, దశరథుడు, రాజరాజ నరేంద్రుడు కణ్వుడు, దశరధుడు మొదలైన భూమికలకు ప్రసిద్ధిగాంచి, తొలి సినీ హీరో శ్రేణిలో ఒకరైన అద్దంకి శ్రీరామమూర్తి గారికి భారతీయ నాట్యకళామండలివారు మద్రాసు వాణీ మహల్‌లో గత తొమ్మిదవ తేదీన ఘన సన్మానం చేశారు. పులిపాటి, ఇంటూరి, ముదిగొండ లింగమూర్తి, టి.ఎల్. కాంతారావు గుమ్మడి, ధూళిపాళ, అల్లు రామ లింగయ్య, ఇంటూరి వెంకటేశ్వర రావు, ఎమ్. ఆర్. తిలక్, కోటకవి మొదలైనవారు ధన రూపేణా, ప్రశంసారూపేణా కానుకలు సమర్పించారు. శ్రీ ధారా రామనాథ శాస్త్రి, వారి సోదరుడు శ్రీ రాధా కృష్ణ సహాయంతో మద్రాసులో తొలిసారి ఆంగ్ల, ఆంధ్ర నాట్యవ ధానంచేసి ప్రేక్షకులకు దిగ్భ్రాంతి కలిగించారు. శ్రీ అద్దంకి సముచిత రీతిని సమాధాన మిచ్చారు.



జెమినీవారి "ఆడబ్రతుకు" లో
ముక్కామల, పుష్పవల్లి మొదలైనవారు.

సేలం నిర్మాతతో గోష్ఠి

తెలుగులో మొట్టమొదటి గేవా కలర్‌చిత్రం 'ఆలీబాబా 40దొంగలు' నిర్మించిన సేలం మోడరన్ థియేటర్సు వారు 'మొనగాళ్ళకు మొనగాడు' అనే తెలుపు నలుపు చిత్రం యిప్పుడు నిర్మిస్తున్నారు. ఎస్. వి. రంగారావు, హరనాథ్, ప్రభాకరరెడ్డి, చలం, బాలయ్య, సావిత్రి (గెస్ట్) కృష్ణకుమారి, రత్న నటిస్తున్న ఈ చిత్రానికి ఎస్. డి లాల్ దర్శకుడు, ఈయన లోగడ విఠలాచార్య చిత్రాలకు కో-డైరెక్టర్‌గా పని చేసి వున్నారు. 'అపూర్వ చింతామణి' దర్శకుడు. ఛాయాగ్రహణ దర్శకుడు ఎస్. ఎస్. లాల్. మోడరన్ థియేటర్సు ఇప్పటికి తెలుగు, హిందీ, ఆంగ్లం, తమిళం, కన్నడం, మలయాళం, సింహాళీస్ లలో 101 చిత్రాలు నిర్మించింది. ఈ 102వ చిత్ర నిర్మాత, మోడరన్ థియేటర్సు వ్యవస్థాపకుడు స్వర్గీయ టి. ఆర్. సుందరం పుత్రుడు, ఇంజనీరింగ్ పట్టు

భద్రుడు, యూనివర్శిటీ క్రికెట్ జట్టు మాజీ కెప్టెన్ అయిన ఆర్. సుందరం.

"జ్యోతి" ప్రతినిధి మోడరన్ థియేటర్స్ స్టుడియోలో నిర్మాత గారే ఒక చెంప నిర్మాణ నిర్వాహకునిగా ఉన్నతాధికారం చెలాయిస్తూ వేరొకచెంప సెట్‌కు వచ్చి, పనివారలలో కలసిపోయి ట్రాలి షాట్‌కు కెమెరా తోయడం, లైటులు వేయడం వంటివి చూచి నివ్వెరపోయారు.

అనంతరం "జ్యోతి" ప్రతినిధితో ముచ్చటిస్తూ ఇతరులతో కలసి పని చెయ్యడంలోనేమి, ఇతరులనుంచి తెలుసుకోవడంలోనేమి ఏ మీమాంస్యానత లేదన్నారు. ఆర్. సుందరం తల్లి బ్రిటిష్ వనిత.

సెట్‌లో ఎచ్చట చూచినా ప్రముఖ (పాత) తారలే వుండడం చూచి, కవ్వింపుగా, ఇన్ని చిత్రాలు తీసి మీకు స్టార్‌సిస్టమ్ తప్పలేదా? అని "జ్యోతి" ప్రతినిధి అడిగారు.

ప్రేక్షకుల మనః ఫలకంలో ప్రముఖతారల బింబాలు నాటుకొని వున్నవని, వాటిని తుడిచి వెయ్యడం అంత సులభం కాదని ఆయన జవాబిచ్చారు. అంతే తన చిత్ర విజయానికి ప్రముఖతారలు తప్పని సరి అని అన్నారు

తెలుగు, మలయాళ చలనచిత్ర చరిత్రలో వర్ణదశ ప్రారంభించిన మా సంస్థ నవతారలను పరిచయమ్ము చెయ్యదా ఏమిటి? అన్న మా తదుపరి పాయి ప్రశ్న.

మేటితారల సరసన కొత్త తారలను పరిచయం చెయ్యడమే అన్ని విధాలా మంచిదని నిర్మాత జవాబిచ్చారు. సెట్‌లోవున్న కొత్త నటి రత్న చిరునగవు కప్పించింది. మరి కొన్ని వారాలలో ఈ చిత్రం సిద్ధం కాగలదు.

● ● ●

"వీరకంకణం"

పి. పుల్లయ్య "వీరకంకణం" అనే చిన్న రక్షణ చిత్రం తీస్తున్నారు. నాగేశ్వరావు, గుమ్మడి, రేలంగి మొదలైనవారి ఉద్యోగులు వుండగల ఈ చిత్రానికి జగ్గయ్యవ్యాఖ్య ఒక ప్రత్యేకత.

● ● ●

రవీంద్రఆర్ట్ ప్రొడక్షన్స్‌వారి సాంఘికానికి పి. మధుసూదనరావు దర్శకత్వం వహిస్తారు. నిర్మాత డి. వి. రెడ్డి. రామారావు, అంజలి, చలపతిరావు, ఆత్రేయ, సి. నాగేశ్వరరావు ఇతరముఖ్యులు.

● ● ●

అన్నపూర్ణా వారి "ఆత్మగౌరవం" షూటింగ్ నవంబర్‌లో తిరిగి సాగింది. జనవరికి చిత్రం సిద్ధమౌతుంది. చిత్ర ముఖ్యసారధి దుక్కిపాటి మధుసూదనరావు.



"కన్నె మనసులు" సెట్స్‌పై
ఆదుర్తి, సంధ్యారాణి, సూర్యకాంతం

కొత్త చిత్రాలూ - కొత్త అనుభవాలూ

"కన్నె మనసులు"

బాబూమూవీస్ వారి 'కన్నె మనసులు' షూటింగ్ వాహినీ నాల్గవ ఫ్లోర్‌లో నవంబర్ మూడవ తేదీన ప్రారంభమైంది పూజా బొమ్మలపై మొదటి షాట్ తీశారు. సావిత్రి కెమెరాకు 'స్విచ్ ఆన్' చేశారు. ముఖ్య ఛాయాగ్రహణ దర్శకుడు వి. ఎల్. రాయ్. కెమెరామన్ కె. యస్ రామకృష్ణారావు మొదటి సెట్ షూటింగ్‌లో సంధ్యారాణి, [illegible]కేశ్వరరావు. సూర్యకాంతం పాల్గొన్నారు. ఇంకొక సెట్‌పై కూడా అతి త్వరగా షూటింగ్ జరుగుతుంది. ఇక మిగిలిందంతా (ప్యాచ్‌వర్క్ తప్పితే) ఔట్ డోర్‌లోనే షూట్ చేస్తారు. గుమ్మడి, రామమోహన్, కృష్ణ, సుకన్య, పుష్పకుమారి, చలపతిరావు తారాగణంలో కలరు. సంగీత దర్శకుడు కె.వి. మహాదేవన్. కథ ముళ్ళపూడి. సంభాషణలు - ఎన్. ఆర్. నంది.

దర్శకత్వం ఆదుర్తి నిర్మాత సి సుందరం కళ, తోట

"భీమాంజనేయయుద్ధం"

మహాలక్ష్మి ఎంటర్‌ప్రైజెస్ వారి "భీమాంజనేయ యుద్ధం" షూటింగ్ ఫిలిం సెంటర్‌లో నవంబర్ నాల్గవ తేదీన ప్రారంభమైంది. యన్. టి. రామారావు కెమెరాకు స్విచ్ ఆన్ చేశారు. ఛాయాగ్రహణ దర్శకుడు; వి. వి. రామచంద్ర. కాంతారావు క్లాప్ కొట్టారు. హనుమంతుడు పూజించే సీతారామ లక్ష్మణులపై మొదటి దృశ్యం చిత్రీకరించారు దర్శకుడు ఎస్. డి. లాల్. ఆంజనేయుని రామభక్తిగీతం పాడడంతో అసలు షూటింగ్ సాగించారు. గీతం పాడినది ఘంటసాల, భీముని పాత్రను దిండమూడి రాజగోపాల్, ఆంజనేయుని పాత్ర కామినేని ఈశ్వరరావు ధరిస్తున్నారు కామినేని ఈశ్వరరావు సినిమాలలో నటించడం ఇదే మొదటిసారి. మొదటి రోజు షూటింగ్ ముందు వీరిరువురిని ఎన్. టి. రామారావు తనహస్తములతో లంకెవేసి, తెలుగు చిత్ర రంగంలో ఇట్టి ఛాంపియనుల సమ్మేళనము అపూర్వమన్నారు. క్రీడారంగములో ఖ్యాతిని కళా రంగములో కూడా నిలుపవలెనన్నారు. ద్రౌపదిగా ఎస్. వరలక్ష్మి, నలకూబరుడుగా 'హీరో' కాంతారావు, రంభగా కాంచన, సౌదామినిగా రాజశ్రీ, ఇంకా రమణారెడ్డి, చలం, సత్యనారాయణ మొదలైనవారు తారాగణంలో ఉన్నారు. నవంబర్ ఆరున ద్రౌపదితో పాటు భీముడు బదరీ యాత్రకు బయలుదేరడం చిత్రీకరించారు. దరిమిలా సౌగంధికపుష్పోదంతం తీశారు. నవంబర్ మధ్య వరకు ఏకటాకీగా షూటింగ్ జరిగింది. డిసెంబర్, జనవరి నెలలోకూడా నిర్విరామంగా షూటింగ్ జరిపి ఫిబ్రవరి (1966) కనిపించకముందే ఈ యుద్ధం చూచేందుకు టిక్కెట్లుకై ప్రేక్షకులు యుద్ధం చేసేటట్లు చెయ్యాలని నిర్మాతల సంకల్పం. రచన తాండ్ర సుబ్రహ్మణ్యం. సంగీతం : టి. వి. రాజు, నిర్వహణ: దోనేపూడి కృష్ణమూర్తి, కళాదర్శకుడు కె వి నాగేశ్వరరావు



మోడరన్ థియేటర్స్‌వారి 102 వ చిత్రంలో ఎస్. వి. రంగారావు

చలన చిత్ర వార్తలు

"తారాశశాంకం"

రామకృష్ణ పిక్చర్స్‌వారి "తారాశశాంకం" షూటింగ్ నవంబర్ మూడవ తేదీన వీనస్ స్టుడియోస్‌లో ప్రారంభమైంది. తొలి చిత్రీకరణలో బృహస్పతిగా గుమ్మడి, తారగా దేవిక నటించారు. శశాంకుడు రామకృష్ణ. దర్శకుడు: మానాపురం అప్పారావు. బృహస్పతి ఆశ్రమ చిత్రీకరణ మొదటి షెడ్యూలు పూర్తి అయింది. నారదుడుగా కాంతారావు (గెస్ట్) నటించే ఈ చిత్రంలో యింకా ముదిగొండ లింగమూర్తి, నూరిబాబు, మిక్కిలినేని, అల్లు రామలింగయ్య, వాణిశ్రీ కలరు. సాంకేతిక సిబ్బంది వివరం: కెమెరా: సత్యనారాయణ, సంగీతం: టి. వి. రాజు, కళ: రాజేంద్ర కుమార్, రచన: రాజశ్రీ, నిర్మాత: కె. సత్యనారాయణ.

కె. వి. జానపదాలు

కంటికి ఆపరేషన్ పిమ్మట కొత్త కళ్ళద్దాలు వేసుకొంటున్న కె. వి. రెడ్డి కొత్తకోణాలలో రెండు జానపద చిత్రాలకు దర్శకత్వం వహించబోతున్నారు. ఒకటి జయంతి బ్యానర్‌లో, మరొకటి విజయా బ్యానర్‌లో రాబోతున్నది. రెండింటి రచయిత పింగళి నాగేంద్రరావు.



అనురూపా ఫిలిమ్సువారి
"పల్నాటి యుద్ధం"లో
భానుమతి (నాగమ్మ)

"నవరాత్రి"

ప్రసాద్ ఆర్ట్ పిక్చర్స్ నిర్మాత ఏ. వి. సుబ్బారావు డిసెంబర్ 20 నుంచి "నవరాత్రి" తెలుగు చిత్రం షూటింగ్ హైదరాబాద్ శ్రీ సారధి స్టుడియోస్‌లో కొనసాగించడానికి సన్నాహాలు పూర్తి చేస్తున్నారు. నాగేశ్వరరావు నవ

వనమాలకు ప్రతిబింబమైన నవ భూమికలు ధరించే ఈ చిత్రంలో నాయిక సావిత్రి, తాతినేని రామారావు స్వయం దర్శకుడుగా పరిచయమయ్యే ఈ చిత్రానికి ముళ్ళపూడి సంభాషణలు రచిస్తున్నారు.

"జమీందార్" క్లయిమాక్స్

రవీంద్ర ఆర్ట్ పిక్చర్స్ వారి 'జమీందార్'లో పతాక సన్నివేశంలోని కొన్ని భాగాలను మద్రాసులో నవంబర్‌లో చిత్రీకరించారు. మరొకటి రెండు షెడ్యూల్స్‌తో చిత్రం సర్వసిద్ధమౌతుంది. వి. మధుసూదనరావు, తమ్మారెడ్డి, నాగేశ్వరరావు, కృష్ణకుమారి, ముళ్ళపూడి యూనిట్ ముఖ్యులు.

బి. ఎన్. చిత్రంలో కృష్ణశాస్త్రి కలం విందు

శ్రీ బి. ఎన్. రెడ్డి డిసెంబర్‌లో షూటింగ్ ప్రారంభించబోతున్న 'రంగులరాట్నం'లో కుమార సంభవం నృత్య నాటికకు శ్రీ దేవులపల్లి కృష్ణశాస్త్రి సాహిత్య కల్పన చేస్తున్నారు. ఇందునిమిత్తం వారు నవంబర్‌లో మద్రాసులో మకాం చేసివున్నారు. ఈ చిత్రంలోనే దశావతార వర్ణనపాట వుంటుంది. దాశరథి దానిని వ్రాశారు, ఈసారి బి ఎన్ చిత్రంలో అంజలిదేవి, రామమోహన్, ఒక కొత్త నటుడు (పట్టభద్రుడు) సుకన్య, నిర్మల, వాణిశ్రీ మొదలైనవారు నటించగలరు. కథ; పాలగుమ్మి పద్మరాజు. సంభాషణలు; డి. వి. నరసరాజు. సంగీతం; ఎస్. రాజేశ్వరరావు. ఛాయాగ్రహణం; రాజగోపాల్.

జగ్గయ్య, సి. యస్. రావు

దక్షిణ భారత సినీ టెక్నీషియన్ల సంఘం వారు నవంబరు ఎనిమిదవ తేదీన ప్రత్యేక సమావేశం జరిపి ఇటీవల ఐర్లెండులోని కార్క్‌లో జరిగిన అంతర్జాతీయ చలన చిత్రోత్సవానికి భారత ప్రతినిధి వర్గ సభ్యులుగా ('కీలుబొమ్మలు' యూనిట్) వెళ్ళిన శ్రీయుతులు కె. జగ్గయ్య, సి. యస్ రావు, గంగాధరరావు, ఏ.ఎస్. ఆర్. ఆంజనేయులు అనుభవాలను తెలుసుకొన్నారు. ఈ నలుగురూ సినిమా రంగంలో చెకొస్లొవాకియా వంటి చిన్న దేశం సోవియెట్ రష్యా అంతటి పెద్ద దేశంతో సమానంగా అభివృద్ధి చెందుతున్నందుకు అచ్చెరువు ప్రకటించారు. వీరు సోవియెట్ రష్యా, తూర్పుజర్మనీ, పశ్చిమ జర్మనీ, ఫ్రాన్సు, ఇంగ్లండు మొదలైన దేశాలుకూడా సందర్శించారు. రాజకీయరంగంలో తమను తోటి సోదరులుగా సామ్యవాద రాజ్యాలు పరిగణించగా పాశ్చాత్య రాజ్యాలు

తను నేదో శత్రువును చూచినట్లు చూచిన వన్నారు.

మొదట సి. ఎస్. రావు మాట్లాడుతూ చెకొస్లోవాకియా రాజధాని 'ప్రాహా' లో మరే దేశంలోనూ లేనటువంటి నాటకం, సినిమా రెండూకలసిన 'లెటార్నొ మెజికా' అనే వింతను చూచినా మన్నారు. 70 మిల్లిమీటర్ల చిత్రాల ప్రదర్శనకు వీలయ్యే వెడల్పు తెరపై ఒకేసారి ఆరు ప్రొజెక్టర్లతో సినిమా ప్రదర్శన జరుగుతూ ఉంటుందని, మధ్య మధ్యనటులే స్వయంగా స్టేజి పైకి రావలసి వచ్చినప్పుడు కొన్ని ప్రొజెక్టర్లు ఆగడం, ఒకభాగం తెర లేవడం, దానిపైకల ఒక పెద్ద సెట్టులో నాటకం నటన కన్పించడం ఈ పద్ధతి విశిష్ట లక్షణ మన్నారు. మన తెలుగు సంప్రదాయంలోకి మార్చి ఆ టెక్నిక్‌ను యిలా వివరించారు.

'రావణాసురుడు సీతాదేవికి తుది హెచ్చరిక చేశాడనుకోండి. అదిఅంతా వెండి తెరపై పెద్దగా కన్పిస్తుంది. తెర ఎడమవైపు ఉన్న రావణాసురునికి గుడిగంటలు బిగ్గరగా వినిపిస్తవి. ఇది ఇంతవరకు సినిమా. ఆ వెనువెంటనే తెర మధ్య భాగం పైకి కర్టెనువలె లేస్తుంది. ఆ వెనుక దేవాలయం సెట్టు స్టేజిపై ఉంటుంది. గంటలు మ్రోగుతూనే ఉంటవి. మండోదరి ప్రార్థిస్తూ వుంటుంది. రావణాసురుడు - తెరపై కన్పించిన రావణాసురుడు- సాక్షాత్తూ మేకప్‌తో - మనిషి అన్నమాట; ఆ గుడిలో ప్రవేశిస్తాడు ఈ భాగం నాటకం. సాక్షాత్తూ నాటకం. తర్వాతి సీనుకు తెరపడుతుంది మళ్ళీ సినిమా కొనసాగుతుంది అలా నాటకం, సినిమా ఏకకాలంలో ప్రదర్శితమౌతవి. లెటార్నొ మెజికా మ్యాజిక్కే అది.'

అనంతరం శ్రీ కె. జగ్గయ్య మాట్లాడుతూ సినిమా సామగ్రిలో చిన్నవాటికి సయితం మనం విదేశాలపై ఆధారపడడం శోచనీయమని చెకొస్లోవాకియా సందర్శించిన మీదట అనిపిస్తున్నదన్నారు. పాకిస్తాన్‌కు అమెరికా యిచ్చిన సేబర్ జెట్ విమానాలను ఎదిరించగల 'నాట్' విమానాలను తయారు చెయ్యగల భారతదేశం సినిమా పరికరాలను ఉత్పత్తి చెయ్యలేదా? అని ప్రశ్నించారు విదేశాలలో హిందీ, మహా అయితే బెంగాలీ చిత్రాలనుగురించి తప్పితే మరే భాషా చిత్రాలనుగురించి తెలియదని, అందుచేత అంతర్జాతీయ చలన చిత్రోత్సవాలకు హిందీ చిత్రంతో పాటు విధిగా ఒక దక్షిణ భాషా చిత్రాన్ని పంపవలెనన్నారు.

శ్రీ బి. ఎన్. రెడ్డి, శ్రీ ముదిగొండ లింగమూర్తి, సంఘాధ్యక్షుడు శ్రీ సి. సీతారామ్ కూడా మాట్లాడారు.

□□□



' సంఘములో అల్లకల్లోలములు
లేకుండా చేయడమే మీ ప్రథమ కర్తవ్యము "

— లాల్ బహదూర్ శాస్త్రి

1 పొరుగువారి కుటుంబమును ఆస్తిని, మతమును గౌరవించండి.

2 దుండగీడుల బారినుండి కాపాడుకోండి

3 పుకారులను చెవిని పెట్టవద్దు.

జయము నిశ్చయముగా మనదే

D A 65/307 Telugu

Edited and Published by V. V. Raghavaiah
and Printed by him at Jyothi Press
Congress Office Road Governorpet. Vijayawada-2